APTEL/2008/28200

## 37వ నిందితుడిగా కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కొత్త ఛార్జిషీటు దాఖలు చేసింది. ఈ కేసులో 38 మందిని నిందితులుగా పేర్కొనగా, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేరును 37వ నిందితుడుగా చేర్చింది. ఛార్జిషీటు ప్రకారం, ఈ కేసులో కేజ్రీవాల్‌ను కీలక నిందితుడిగా ఈడీ పేర్కొంది. గోవా ఎన్నికల్లో ముడుపుల సొమ్ము వినియోగించిన విషయం ఆయనకు తెలుసునని వివరించింది. అరవింద్ కేజ్రీవాల్‌కు, మరో నిందితుడు వినోద్ చౌహాన్‌కు మధ్య జరిగిన వాట్సాప్ ఛాట్ వివరాలను ఛార్జిషీటులో ఈడీ ప్రస్తావించింది. గోవా ఎన్నికల సందర్భంగా కె.కవిత వ్యక్తిగత సహాయకుడు రూ.25.5 కోట్ల సొమ్మును వినోద్ ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీకి పంపాడని, అరవింద్ కేజ్రీవాల్‌తో వినోద్‌కు మంచి సంబంధాలున్నాయనే విషయం వారి మధ్య జరిగిన ఛాటింగ్‌తో స్పష్టమవుతోందని ఈడీ పేర్కొంది.




# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం


## ఓయూలో మీడియాపై పోలీసుల దాడి

హైదరాబాద్ జూలై 10 : ఉస్మానియా యూనివర్సిటీ మెయిన్ లైబ్రరీ వద్ద మీడియా ప్రతినిధుల పట్ల పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. డీఎస్సీ అభ్యర్థుల ఆందోళనలను కవరేజ్ చేసేందుకు వెళ్లిన జీ తెలుగు రిపోర్టర్ పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారు. జీ తెలుగు రిపోర్టర్ చొక్కా పట్టుకుని లాక్కెళ్లారు. నేను జర్నలిస్టును.. మీ పని మీరు చేసుకోండి.. మా పని మేం చేసుకుంటాం అంటుంటే కూడా పోలీసులు వినిపించుకోలేదు. ఆ రిపోర్టర్‌ను బలవంతంగా పోలీసు వాహనంలో ఎక్కించి పోలీసులు తమ పైత్యాన్ని ప్రదర్శించారు. ఉస్మానియా యూనివర్సిటీలో నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనలను కవరేజ్ చేయడానికి వెళ్లిన జర్నలిస్టుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును టీజేఎఫ్ తీవ్రంగా ఖండిస్తుంది. విధి నిర్వహణలో భాగంగా జర్నలిస్టులు వార్తలు కవర్ చేయడానికి వెళ్తే పోలీసులు అరెస్ట్ చేయటమేంటి..? కనీసం మీడియా ప్రతినిధులు అనే సోయి లేకుండా పోలీసులు వ్యవహరించిన తీరు చూస్తుంటే? మీడియా స్వేచ్ఛను కాలరాయడమే అవుతుంది.


సంపుటి: 16 సంచిక : 65 కరీంనగర్ గురువారం, జూలై 11, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు


## ముస్లిం మహిళలు విడాకుల తర్వాత భర్త నుండి భరణం పొందవచ్చు



న్యూఢిల్లీ జూలై 10 : విడాకులు తీసుకున్న ముస్లిం మహిళ తన భర్త నుంచి భరణం కోరుతూ సుప్రీంకోర్టు ఈరోజు కీలక తీర్పు వెలువరించింది. సెక్షన్ 125 ప్రకారం.. ముస్లిం మహిళ తన భర్త నుండి భరణం క్లెయిమ్ చేసుకోవచ్చని కోర్టు మళ్లీ స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ముస్లిం మహిళలకు అనుకూలంగా సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. సీఆర్‌పీసీ సెక్షన్ 125 ప్రకారం ముస్లిం మహిళలు తమ భర్తల నుంచి భరణం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని కోర్టు పేర్కొంది. తన భార్యకు భరణం ఇవ్వాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఓ ముస్లిం వ్యక్తి సుప్రీంకోర్టులో సవాలు చేశాడు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ సందర్భంగా కోర్టు కీలక తీర్పును వెలువరించింది. మహ్మద్ అబ్దుల్ సమద్ అనే వ్యక్తి దరఖాస్తు చేసుకున్నాడు. సీఆర్‌పీసీ సెక్షన్ 125 ప్రకారం విడాకులు తీసుకున్న భార్యకు భరణం చెల్లించాలన్న ఆదేశాలను వ్యతిరేకిస్తూ మహ్మద్ అబ్దుల్ సమద్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తులు బీవీ నాగరత్న, అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. ముస్లిం మహిళల (విడాకుల హక్కుల పరిరక్షణ) చట్టం 1986 సెక్యులర్ చట్టాన్ని అధిగమించలేదని కోర్టు పేర్కొంది. జస్టిస్ నాగరత్న, జస్టిస్ మసీహ్ విడివిడిగా, కానీ ఏకగ్రీవ తీర్పులను వెలువరించారు. 10,000 భరణం ఇవ్వాలని మహ్మద్ సమద్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సెక్షన్ 125 మహిళలందరికీ వర్తిస్తుంది: భరణం అవసరమయ్యే చట్టం వారి మతంతో సంబంధం లేకుండా వివాహిత మహిళలందరికీ వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గృహిణి భార్య మానసికంగా, ఇతరత్రా ఆధారపడుతుందనే వాస్తవాన్ని కొంతమంది భర్తలు గుర్తించరు. భారతీయుడు గృహిణి పాత్రను గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.

# ఐటీ రిటర్న్స్ దాఖలు చేసిన వారు రైతు భరోసాకు అనర్హులా..?

## క్లారిటీ ఇచ్చిన మంత్రి తుమ్మల



హైదరాబాద్ జూలై 10 : రైతు భరోసా పథకంపై విధివిధానాలను ఖరారు చేసేందుకు నలుగురు మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీని ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ సబ్ కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబులు ఉన్నారు. జిల్లాల వారిగా మంత్రుల సబ్ కమిటీ సమావేశాలు నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరించనున్నారు. ఈ క్రమంలో తొలుత ఖమ్మం జిల్లా నుంచి రైతు భరోసా సమావేశాలకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన రైతు భరోసా పథకం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం, మంత్రులు మాట్లాడారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రైతు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం ధృడ సంకల్పంతో ఉందని చెప్పారు. త్వరలో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతామని అన్నారు. రైతు భరోసా పథకం అమలుకోసం ఉమ్మడి పది జిల్లాల్లో పర్యటించి ప్రజలు, రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకుంటామని చెప్పారు. అందరి అభిప్రాయాల మేరకు విధివిధానాలు నిర్ణయించి ప్రభుత్వంకు నివేదిక అందిస్తామని భట్టి అన్నారు. రైతులు, రైతు సంఘాల అభిప్రాయాలు తీసుకుంటామని, రాజకీయాలకు అతీతంగా రైతుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరిస్తామని భట్టి చెప్పారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం మీ ఆలోచనలు ప్రకారమే ముందుకు వెళ్తుంది. మీరిచ్చే సూచనలు రైతులకు భరోసా కల్పించాలి. గతంలో జరిగిన ఆర్థిక నష్టం మీ అందరికీ తెలుసు. సన్న, చిన్నకారు రైతులను ఆదుకోవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. గతంలో రైతు బంధు కష్టం అయినా 7వేల కోట్లు ఇచ్చాం. ఇప్పుడు రైతు రుణమాఫీ చేస్తాం. శాసనసభ సమావేశాలలోపే అన్ని జిల్లాల్లో సబ్ కమిటీ సమావేశాలు పూర్తిచేస్తామని తుమ్మల అన్నారు. ఐటీ రిటర్న్స్ దాఖలు చేసినవారికి రైతు భరోసా ఇవ్వరు.. వారు రైతు భరోసాకు అనర్హులు అనేది ప్రచారం మాత్రమేనని మంత్రి తుమ్మల అన్నారు. ఐటీ రిటర్న్స్ దాఖలు చేయడం వేరు.. ఐటీ చెల్లించటం వేరు. పిల్లల చదువులకోసం, ఇతరత్రా పనులకోసం రైతాంగం ఐటీ రిటర్న్స్ కోసం ధరఖాస్తు చేసుకుంటారు. అటువంటి వారికి ఎటువంటి నష్టం జరగదు. ఐటీ చెల్లిపులు ఎవరైతే చెల్లిస్తున్నారో వారిని మాత్రమే పరిగణలో తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్లారిటీ ఇచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఖర్చు పెట్టే ప్రతి రూపాయి ప్రజలు నుండి వస్తున్న పన్నులు. గత ప్రభుత్వం ఎవరి అభిప్రాయం తీసుకోకుండా.. నాలుగు గోడలు మధ్య నిర్ణయం తీసుకుని ప్రజల మీద రుద్దింది. ఇది ప్రజా ప్రభుత్వం. ప్రతి పైసకి మేము బాధ్యులం. ప్రజలకి చెప్పాలిన బాధ్యత మాపై ఉంది. ప్రభుత్వం రైతు బంధు విషయంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సబ్ కమిటీగా మిగిలిన తొమ్మిది జిల్లాల్లో రైతులు, ప్రజల అభిప్రాయం తీసుకుంటాం. వారి అభిప్రాయాల నివేదికను అసెంబ్లీలో పెట్టి నిర్ణయం తీసుకుంటామని పొంగులేటి అన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారు. కొన్ని రోజుల్లోనే అసెంబ్లీ సమావేశాలు ఉంటాయి. ప్రధాన ప్రతిపక్షం అని చెప్పుకునే వాళ్లు అన్ని విషయాలు అసెంబ్లీలో ప్రస్తావిస్తే చర్చిద్దాంమని పొంగులేటి అన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ పై విచారణ చేపట్టిన సిజె ధర్మాసనం

హైదరాబాద్ జూలై 10 : ఫోన్ ట్యాపింగ్ పై సిజె ధర్మాసనం విచారణ చేపట్టింది. జడ్జిలు, వాళ్ల కుటుంబ సభ్యుల పేర్లు మీడియాలో ప్రసారం చేయొద్దని ధర్మాసనం పేర్కొంది. కొన్ని పత్రికలు జడ్జి పేరు, మొబైల్ నంబర్ ప్రచురించినట్లు హైకోర్టు తెలిపింది. ఫోన్ ట్యాపింగ్ పై మీడియా సంయమనం, బాధ్యతో వ్యవహరించాలని, ఫోన్ ట్యాపింగ్ కేసు వార్తలు రాసేటప్పుడు మీడియా జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేశారని. అందుకే ప్రస్తుతానికి ఎలాంటి ఆదేశాలు ఇవ్వాలనుకోవడం లేదని వివరించింది. ఇప్పటికే ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిందని, విచారణ జరుగుతోందని, నిందితులను అరెస్టు చేశామని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. పలువురు పోలీసు అధికారులు ఫోన్లు సైతం ట్యాపింగ్ చేసినట్లు ప్రభుత్వం కౌంటర్ ఇచ్చింది.

## 108 కేజీల బంగారం సీజ్.. ఎక్కడంటే..?

జమ్మూ కశ్మీర్, జులై 10: లడఖ్ సమీపంలోని భారత్ – చైనా సరిహద్దు వద్ద అక్రమంగా తరలిస్తున్న 108 కేజీల బంగారాన్ని ఇండో టిబెటన్ సరిహద్దు భద్రత దళం (ఐటీబీపీ) స్వాధీనం చేసుకొంది. అందుకు సంబంధించి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసింది. వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఐటీబీటీ డిప్యూటీ కమాండెంట్ దీపక్ భట్ బుధవారం వెల్లడించారు. ఈ మొత్తం బంగారం.. 108 కడ్డీల రూపంలో ఉందని చెప్పారు. ఒక్కో బంగారపు కడ్డీ ఒక కేజీ బరువు ఉందన్నారు. అయితే ఇంత భారీ ఎత్తున బంగారాన్ని స్వాధీనం చేసుకోవడం ఐటీబీటీ చరిత్రలో ఇదే తొలిసారి అని దీపక్ భట్ స్పష్టం చేశారు. ఈ స్వాధీనం చేసుకున్న మొత్తం బంగారాన్ని ఆదాయపు పన్ను శాఖ అధికారులను అందజేసినట్లు తెలిపారు. వాస్తవాధీన నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) సమీపంలో బంగారం స్మగ్లింగ్ జరుగుతున్నట్లు అంతకు కొద్దిసేపటి ముందే తమకు సమాచారం అందిందన్నారు.

# ‘నాలుగు గోడల మధ్య నిర్ణయం ఉండదు రైతుల ఆలోచనతోనే రైతు భరోసా’




ఖమ్మం : రైతు భరోసా అమలుపై తెలంగాణ సర్కార్ కసరత్తు చేస్తోంది. జిల్లాల వారీగా అనేక మంది నుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది. అందులో భాగంగా నేడు ఖమ్మం జిల్లాలో పర్యటిస్తోంది మంత్రుల బృందం. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పొంగులూటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు ఉన్నారు. ఈ జిల్లాల పర్యటన ముగిసిన తరువాత తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అందులో భాగంగానే జూలై 10 ఖమ్మం, 11న అదిలాబాద్, 12న మహబూబ్ నగర్, 15న వరంగల్, 16న సంగారెడ్డి(మెదక్), 18న నిజామాబాద్, 19న కరీంనగర్, 22న నల్గొండ, 23న రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయాల్లో రైతుల నుంచి ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నట్లు షెడ్యూల్‌ను రూపొందించారు. తెలంగాణ సర్కార్ రైతు భరోసాపై దూకుడు పెంచింది. కేబినెట్ సబ్‌కమిటీ జిల్లాల పర్యటన మొదలుపెట్టింది. ఇవాళ ఖమ్మంజిల్లా కలెక్టరేట్‌లో రైతు భరోసాపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్‌బాబు హాజరయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రైతుభరోసాపై విధివిధానాల ఖరారు కోసం రైతు సంఘాలు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. అన్నిజిల్లాలో అభిప్రాయాలు సేకరించి, త్వరలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా స్పందించారు. గత ప్రభుత్వం ఏ స్కీమ్ చేపట్టినా ప్రజల అభిప్రాయాలు తీసుకోలేదన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. నాలుగు గోడల మధ్య నిర్ణయం తీసుకుని ప్రజలపై రుద్దారన్నారు. ప్రభుత్వానికి వచ్చే ప్రతీపైసా ప్రజల నుంచి వచ్చిందేనని, రైతులు ఇచ్చే సూచనలపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అలాగే ఖమ్మం జిల్లాకు చెందిన మరో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. రైతుల ఆలోచన మేరకే ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. రైతుల అభిప్రాయం తీసుకున్నాకే రైతు భరోసాపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

## తెలంగాణ కొత్త డీజీపీగా జితేందర్



హైదరాబాద్ జూలై 10 : సీనియర్ ఐపీఎస్ అధికారి, హోం శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్ తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా నియమితులయ్యారు. ఆయనకు డీజీపీ (హెచ్ఓపీఎఫ్) పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత డీజీపీ రవి గుప్తా హోంశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన డీజీపీ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమై బాధ్యతలు స్వీకరించారు. పంజాబ్‌లోని జలంధర్‌లో రైతు కుటుంబంలో జన్మించిన జితేందర్ 1992 బ్యాచ్ %భ్రూ% అధికారి. పాకిస్థాన్‌కు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫిరోజ్‌పూర్ (పంజాబ్)లో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఢిల్లీకి వెళ్లి జేఎన్‌యూ నుంచి పట్టభద్రులయ్యారు. ఆంధ్రప్రదేశ్ కేడర్‌లో పనిచేశారు. తొలుత బెల్లంపల్లి ఏఎస్పీగా పనిచేసిన అనంతరం నిర్మల్‌లో ఎస్పీగా విధులు నిర్వహించారు. అనంతరం అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లోని మహబూబ్ నగర్, గుంటూరు జిల్లాల ఎస్పీగా పనిచేశారు. డీఐజీగా పదోన్నతి పొంది విశాఖపట్నం రేంజ్‌లో బాధ్యతలు నిర్వర్తించిన ఆయన తెలంగాణ ఉద్యమ సమయంలో వరంగల్ రేంజ్ డీఐజీగా కొనసాగారు.

# ఉత్తరాదిలో జలప్రళయం.. మళ్లీ ఐఎండీ రెడ్ అలర్ట్.. ఆ ప్రాంతాల్లో భారీ వర్షాలు

ఉత్తరాదిలో జలప్రళయం.. అసోం, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, ముంబై,ఉత్తరాఖండ్‌లోనూ వరుణుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ప్రస్తుతం దేశం మొత్తం రుతుపవనాలు చాలా చురుగ్గా ఉన్నాయి. దేశంలో పలుచోట్ల వర్షం బీభత్సం సృష్టిస్తోంది. ఇప్పటికే పలు రాష్ట్రాలు వరదలతో నిండి ఉన్నాయి. నదులు ప్రమాదస్థాయి దాటి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల కొండ చరియలు విరిగిపడుతున్నాయి. అసోంలో ఇప్పటికీ లక్షల మంది ప్రజలు వరదల బారిన పడ్డారు. అసోంలోని 27 జిల్లాలు వరదలతో ప్రభావితమయ్యాయి. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అనేక గ్రామాల్లో నీటి ఎద్దడి ఉంది. వర్షాలకు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. 91 రెవెన్యూ, 3వేల 154 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. అస్సాంలో వరదల కారణంగా మరణిస్తున్న వారి సంఖ్య కూడా రోజు రోజుకు పెరుగుతోంది. బాధితులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని సీఎం హిమంత బిస్వా శర్మ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఇప్పటికీ 48వేల మంది షెల్టర్లలో ఉన్నారు. వరదలు, కొండచరియలు విరిగిపడుతుండటంతో.. తాజాగా ఏడుగురు మరణించారు.. ఇప్పటివరకు 92 మంది మరణించినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఉత్తరాఖండ్‌లో వర్షం బీభత్సం..

ఇక ఉత్తరాఖండ్‌లో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. 72 గంటల పాటు ఏకధాటిగా వర్షం కురుస్తోంది. నదులు ప్రమాదస్థాయి దాటి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల కొండ చరియలు విరిగిపడుతున్నాయి. కీలక హైవేలపై రాకపోకలు నిలిపివేశారు. పలు రైల్వే స్టేషన్లు మునిగిపోయిన పరిస్థితి కనిపిస్తోంది. వర్షం కారణంగా పలు రైళ్లు రద్దు చేశారు. పలు పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులు ఇరుక్కుపోయారు.



ఉత్తరప్రదేశ్.. హిమాచల్ ప్రదేశ్‌లో

ఉత్తరప్రదేశ్‌లోనూ ఎడతెరిపిలేని వర్షాలతో ప్రజలందరూ కూడా అల్లాడిపోతున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. హైవేలు సహా 70 రోడ్లు మూసివేశారు. బీహార్‌లోని కోసి నది నీటిమట్టం పెరగడంతో వరద ముప్పు పొంచి ఉంది. బీహార్‌లోని నదుల నీటిమట్టం పెరగడంతో 7 జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి.

## ఛాన్సలర్ కార్ల్ నెహ్మార్‌తో ప్రధాని మోదీ భేటీ



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం (జూలై 10) తన మొదటి పర్యటన సందర్భంగా ఆస్ట్రియా ఛాన్సలర్ కార్ల్ నెహమ్మర్‌తో భేటీ అయ్యారు. ఉక్రెయిన్‌లో యుద్ధం భారతదేశం–ఆస్ట్రియా వ్యూహాత్మక సంబంధాల గురించి చర్చించారు. మాస్కోలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమైన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ సంయుక్త మీడియా సమావేశంలో ప్రపంచంలో యుద్ధానికి చోటు లేదని పునరుద్ఘాటించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆస్ట్రియా పర్యటన చారిత్రాత్మకం, ప్రత్యేకమైనదని అభివర్ణించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పునరుత్పాదక ఇంధనం, హైడ్రోజన్, నీరు మరియు వ్యర్థాల నిర్వహణ, ఆస్ట్రియాతో సంబంధాలను బలోపేతం చేయడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చర్చించారు. ఇది యుద్ధానికి సమయం కాదని, ఇంతకుముందు కూడా చెప్పాను, యుద్ధభూమిలో సమస్యలను పరిష్కరించలేమని, మానవత్వంపై నమ్మకం ఉన్న ప్రతి వ్యక్తి ఎవరైనా ప్రాణాలు పోగొట్టుకున్నప్పుడు బాధపడతారు, ప్రాణనష్టం ఆమోదయోగ్యం కాదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. శాంతి, సుస్థిరత పునరుద్ధరణకు సాధ్యమైన అన్ని సహాయ సహకారాలను అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. భారత్, ఆస్ట్రియా కలిసి తీవ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఇరు దేశాల అధినేతలు సంయుక్త ప్రకటన చేశారు. ఉగ్రవాదం ఏ రూపంలోనైనా ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన వంటి విలువలపై భారత్–ఆస్ట్రియా దేశాలు విశ్వాసం వ్యక్తం చేశాయి. ప్రధానమంత్రిగా మూడవ సారి బాధ్యతలు స్వీకరించిన ప్రారంభంలో ఆస్ట్రియాను సందర్శించే అవకాశం లభించినందుకు సంతోషిస్తున్నానని మోదీ తెలిపారు.

# తెలంగాణ నుండి ఫోకస్

తెలుగు దినపత్రిక

గురువారం, జులై 11, 2024


# డేంజర్ సిగ్నల్స్

ఈ రోజు గట్టెక్కితే చాలు అనేదే ప్రలోభం అంటే. అందువల్ల అనేక ప్రలోభాలకు ప్రజలను గురి చేస్తుంటారు నాయకులు. ప్రజలు నిశితంగా గమనించాల్సింది హామీలు అమలు చేయదగినవా అనేది. ఇది చాలా ముఖ్యం. అమలు చేయదగిన హామీలను నమ్మవచ్చు. అలాంటి హామీలను నమ్మటానికి తాయిలాలు అవసరం లేదు. ప్రతి మనిషికీ విచక్షణ ఉంటుంది. ప్రతి మనిషికీ అర్థం అవుతుంది ఎవరు ఏం చెప్తున్నారు, వారి ఉద్దేశాలు ఏమిటి అనేది. గతంలో ఏం చెప్పారు, ఎంతమేరకు చేశారనేది ప్రతి మనిషీ బేరీజు వేసుకోగలడు. అయితే ప్రలోభాల ముందు మనిషి విచక్షణా జ్ఞానం బలహీనపడే ప్రమాదం ఉన్నది. కర్ణాటకలో వరసగా ప్రభుత్వం పన్నులు పెంచుతూ పోతుంది. ఇది తెలుగు రాష్ట్రాలకు డేంజర్ సిగ్నల్స్ పంపుతుంది. కర్ణాటకలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికలు అయిన తర్వాత తమ ఖజానాను నింపుకునేందుకు అనేక రకాలుగా పన్నులు పెంచుతూ వస్తుంది. ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే ఆ మాత్రం పన్నులు పెంచకపోతే రాబడి ఎక్కడి నుంచి వస్తుందని కర్ణాటక పాలకులు ప్రశ్నిస్తున్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నా, ఇచ్చిన హామీలను ప్రజలకు అందించాలన్నా ఖచ్చితంగా ప్రజలపై భారం మోపాల్సిందేనన్నది కన్నడ పాలకుల వాదన. ఇందుకు సహకరించాలని కూడా ప్రజలకు కర్ణాటక ప్రభుత్వం కోరుతుంది. కర్ణాటకలో ఐదు గ్యారంటీలు ఇచ్చి అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు వీటిని అమలు చేయాలంటే ఎడా పెడా పన్నులను పెంచుతూ పోతుంది. తాజాగా పెట్రోలు, డీజిల్ పై అమ్మకపు పన్ను ను పెంచింది. పెట్రోలు ధరపై మూడు రూపాయలు, డీజిల్ ధరపై లీటరకు 3.02 రూపాయలు పెంచుతూ కర్ణాటక సర్కార్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పెంచిన ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని తెలిపింది. దీనివల్ల ఖజానాకు 2,800 కోట్ల రాబడి సమకూరుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఉచిత విద్యుత్తును అమలు చేయడానిక విద్యుత్తు ఛార్జీలను పెంచింది. మద్యం ధరలను కూడా విపరీతంగా పెంచింది. దేశీయ లిక్కర్ పై అదనపు ఎక్సైజ్ డ్యూటీ 20 శాతాన్ని పెంచారు. ఇక ఆదాయం వచ్చే అన్ని మార్గాలను వెతుక్కుంటూ కన్నడ సర్కార్ ధరలను పెంచుతూ వెళుతుంది. ఇప్పుడు తెలంగాణలోనూ ఆరు గ్యారంటీలు అమలు చేయాలంటే ఖచ్చితంగా ఏదో ఒక రూపంలో ప్రజలపై భారం మోపక తప్పని పరిస్థితి అంటున్నారు ఆర్థిక నిపుణులు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఆరు గ్యారంటీల హామీతో అధికారంలోకి వచ్చింది. వీటిని అమలు చేయాలంటే వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయి. ఇక మద్యం ధరలను పెంచుతారన్న ప్రచారం జరుగుతుంది. అలాగే ఆదాయం పెరిగే మార్గాలపై ఆర్థిక శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క ఇటీవల వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అందులో ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ వంటి శాఖల అధికారులు ఉన్నారు. దీంతో ఇక్కడ కూడా ఆ శాఖలకు సంబంధించిన క్రయ విక్రయాల్లో పన్నులు పెంచే అవకాశముందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అయితే స్థానిక సంస్థలు ఉండటంతో ఇప్పుడు చేస్తారా? తర్వాత చేస్తారా? అన్నది తెలియదు కానీ.. పన్నులు పెంచడమయితే గ్యారంటీ అని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఇందుకు అతీతం కాకపోవచ్చు. ఎందుకంటే అక్కడ తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ తో సక్సెస్ సాధించింది. ప్రజలు కూటమికి పట్టం కట్టారు. అయితే ఏపీలో ప్రభుత్వం ఏర్పడి పది రోజులు కూడా కాలేదు. కానీ రానున్న రోజుల్లో కొన్ని ధరలు పెరిగే అవకాశాలను కొట్టిపారేయలేమంటున్నారు ఉన్నతాధికారులు. ఇచ్చిన హామీలు అమలు కావాలంటే ఖచ్చితంగా ప్రజలపై భారం మోపాల్సిందే. అంతే తప్ప ఇప్పటికిప్పుడు సంపద సృష్టి సాధ్యం కాదు. అయితే కర్ణాటక, తెలంగాణ కంటే ఏపీకి ఒక విషయంలో అనుకూలత ఉంది. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. అక్కడ కేంద్ర ప్రభుత్వం సహకరించకపోవచ్చు. ఇకపోతే ఉచితాలు ఇస్తామని చెప్తారు మన నాయకులు. ఉచితాలు ఎంతకాలంఇవ్వగలదు ఏ ప్రభుత్వమైనా? ప్రజలు ఎప్పుడూ ఉచితంగా వసతులు కల్పించమని అడగరు. కొన్ని సేవలు ఉచితంగా కల్పించటమనేది సంక్షేమానికి కట్టుబడి ఉన్న రాజ్యాంగంగా ప్రభుత్వాలు వాటంతట అవే ఏర్పాటు చేస్తుంటాయి. ఉదాహరణకు ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం ఉచితంగా అందించాలని కోరుకునేవారుంటారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన ఉచితంగా అందించాలని కూడా కోరుకుంటారు కొన్నివర్గాల వారు. మన దేశంలో ఉన్న విచిత్రం ఏమంటే ప్రాథమిక విద్యకు ప్రైవేటు పాఠశాలల వైపు చూస్తాం; అదే ఉన్నత విద్యకు ప్రభుత్వ వ్యవస్థల వైపు చూస్తాం. ఉదాహరణకు గవర్నమెంటు కాలేజీలో డాక్టరు కోర్స్, ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశం పొందటం ప్రతిష్టాత్మకం. అదే ఎల్కేజీ దగ్గరి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రైవేటు బడుల్లో చదవటం కోరుకుంటాం. ప్రభుత్వ బడుల్లో పరిస్థితిని మెరుగుపరిచే కార్యక్రమాన్ని మధ్యతరగతుల వారు పెద్దగా అభినందించరు. ఎందుకంటే వాళ్ల పిల్లలు ఆ బడులకు పోరు గనుక. ఈ దమన నీతి నుంచి మనిషి బయటపడాలి. మెరుగైన వైద్యం, మెరుగైన విద్య మౌలిక వసతుల కల్పనలో భాగంగా, అభివృద్ధి కార్యక్రమంగానే చూడాలి. ఎక్కువ మంది ప్రజలు మెరుగైన రవాణా సౌకర్యం కావాలనుకుంటారు కానీ, డొక్కు బస్సుల్లో గుంతల రోడ్లలో ఉచిత ప్రయాణం కోరుకోరు. ఇట్లాంటి హామీలను ప్రజలే తిరస్కరించాలి. ఇక్కడే ఓటరు విజ్ఞత తెలిసేది. ఇప్పుడు గనక మనం నోరు తెరవకపోతే వచ్చే ఐదేండ్లు ఐదు వేళ్లతో నోరు మూసుకోవాల్సిందే. ఇక్కడ ఏది కోరుకోవాలి? నోరెత్తి అడిగే స్వేచ్ఛా లేక నోరు మూసుకొని మౌనంగా ఉండే దౌర్భల్యమా? మనం స్వేచ్ఛను పరిరక్షించుకోవాలంటే మన ఓటును అమ్ముకోకూడదు. ప్రలోభం ఎంతటి బలమైనదైనా కూడా. ఓటుకు 500 ఇచ్చారనుకుందాం. అంటేఏడాదికి వంద. అదేనా మన ఓటు విలువ? అసలు మన ఓటుకు ఇంత అని విలువ కట్టగలమా? కానీ ఏపీలో టీడీపీ వల్లనే దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం మనుగడ సాగిస్తుండటంతో కేంద్ర సహకారం లభిస్తుందని ఇప్పుడిప్పుడే పన్నుల భారం ఉండదన్న కామెంట్స్ వినపడుతున్నాయి. మొత్తం మీద మూడు రాష్ట్రాల్లో ముందు ముందు ఎన్నెన్ని రకాల పన్నులు వేస్తారో? ఏమేమి నిర్ణయాలు వెలువడుతాయోనన్న భయం ఇప్పుడు ప్రజలకు పట్టుకుంది.

# హెచ్ఆర్ఏ కోసం అడ్డదారులు స్పౌజ్ బదిలీల్లో నిబంధనలకు నీళ్లు



లింగాలఘణపురం, జూలై 10 : ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల పర్వంలో కొంతమంది ఉపాధ్యాయులు అక్రమాలకు తెరలేపారు. బదిలీల ప్రక్రియలో మానవీయ కోణంలో వాడుకోవాల్సిన స్పౌజ్‌పాయింట్లను దుర్వినియోగం చేశారు. హెచ్ఆర్ఏ కోసం అడ్డదారులు తొక్కారు. ఉపాధ్యాయుల బదిలీలు జూన్ 8న ప్రారంభం కాగా మొదట స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతులు కల్పించారు. ఆ తర్వాత సాధారణ బదిలీలు కొనసాగాయి. కాగా భార్యాభర్తలు ఇద్దరు కూడా ఉపాధ్యాయులైతే వారికోసం ప్రభుత్వం స్పౌజ్ కింద ప్రత్యేకంగా 10 పాయింట్లను కేటాయించింది. దీంతో భార్యాభర్తలు వేర్వేరు ప్రాంతాల్లో కాకుండా ఒకే చోట లేదా ఒకే మండలంలోని సమీప ప్రాంతాల్లో పని చేసేలా వెసులుబాటు కల్పించింది. భార్యాభర్తల్లో ప్రతీ ఎనిమిదేళ్లకోసారి ఎవరికో ఒకరికి మాత్రమే అదనంగా ఇచ్చే పదిపాయింట్లు వర్తిస్తాయి. ఈలెక్కన భర్త పనిచేసే చోటుకు భార్య లేదా భార్య పనిచేసే చోటికి భర్త వెళ్లాలనుకుంటే స్పౌజ్‌పాయింట్లను వినియోగించుకోవచ్చు. ఒకవేళ అక్కడ ఖాళీలు లేకపోతే అదే మండలంలో సమీపంగా ఎక్కడ ఖాళీలు ఉంటే అక్కడికి బదిలీ చేసుకోవచ్చు. కానీ ఈ నిబంధనలను ఉపాధ్యాయులు తుంగలో తొక్కుతున్నారు. భర్త/భార్య పనిచేసే చోటుకు లేదా సమీప ప్రాంతానికి కూడా కాకుండా హెచ్ఆర్ఏ వర్తించే ప్రాంతాలకు బదిలీ చేసుకుని అక్రమాలకు పాల్పడ్డారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. స్పౌజ్‌పాయింట్లను అడ్డగోలుగా వినియోగించుకోకుండా అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ప్రేక్షకపాత్రను పోషించినట్లు ఉపాధ్యాయ వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం మాణవీయ కోణంలో కల్పించిన 10 పాయింట్లను నిబంధనల ప్రకారమే వినియోగించుకుంటున్నారా.. లేక హెచ్ఆర్ఏ కోసం వాడుకుంటున్నారా అనే కోణంలో విచారణ చేయాల్సి ఉంటుంది. కానీ జిల్లా విద్యాశాఖాధికారులు అవేమీ పట్టించుకోకుండా ఎక్కడికి ఎంచుకుంటే అక్కడికే బదిలీ చేసి చేతులు దులుపుకున్నారని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. హెచ్ఆర్ఏ కోసం స్పౌజ్ పాయింట్లను వాడుకొని పట్టణప్రాంతాల్లో అక్రమంగా బదిలీలను పొందిన ఉపాధ్యాయులను గుర్తించి వాళ్ల బదిలీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. దేవరుప్పుల మండలంలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు నిబంధనల ప్రకారం తన భర్త పనిచేస్తున్న లింగాలఘణపురం మండలానికి బదిలీ అయ్యేందుకు స్పౌజ్ కింద 10 పాయింట్లను వినియోగించుకోవాలి. కానీ జనగామ మండలంలోని ఓ గ్రామానికి బదిలీ అయ్యేందుకు అక్రమంగా వాడుకున్నారు. అదేవిధంగా దేవరుప్పుల మండలంలో పనిచేస్తున్న మరో ఉపాధ్యాయురాలు తన భర్త పనిచేసే రఘునాథపల్లి మండలానికి వెళ్లాల్సి ఉండగా అక్రమంగా లింగాలఘణపురం మండలానికి బదిలీ చేసుకునేందుకు స్పౌజ్ పాయింట్లను వాడుకున్నారు. లింగాలఘణపురం మం డలంలో పనిచేసే మరో ఉపాధ్యాయురాలు తన భర్త పనిచేసే జనగామ మండలానికి వెళ్లకుండా అక్కడ ఖాళీగా ఉన్నప్పటికీ లింగాలఘణపురం మండలాన్నే ఎంచుకున్నారు. లింగాలఘణపురం మండలంలో పనిచేసిన ఓ ఉపాధ్యాయురాలు జనగామ మండలంలోని ఓ గ్రామంలో తన భర్త పనిచేసే పాఠశాలలోనే ఖాళీగా ఉన్నప్పటికీ మరో గ్రామానికి బదిలీ చేసుకున్నారు. ఇవి కేవలం మచ్చుకు మాత్రమే. జిల్లాలో 41 మంది ఎస్‌జీటీలు, 26 మంది స్కూల్ అసిస్టెంట్లు స్పౌజ్ పాయింట్లను వాడుకుని బదిలీ అయ్యారు. ఇలాంటి అక్రమాలు జిల్లాలో ఇంకా అనేకం ఉండొచ్చని ఉపాధ్యాయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేసి అక్రమం గా బదిలీ చేయించుకున్న ఉపాధ్యాయులను గుర్తించి విచారణ చేపట్టాలి.

# ప్రమాదపుటంచున గురుకులాలు



గంగాధర, జూలై 10 : ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గురుకులాల్లో విద్యార్థులు భయం గుప్పిట్లో చదువులు కొనసాగిస్తున్నారు. ప్రైవేటు భవనాలకు లక్షల్లో అద్దెలు చెల్లిస్తున్న ప్రభుత్వం కనీస వసతులపై దృష్టి సారించడం లేదు. చొప్పదండి నియోజకవర్గానికి నాలుగేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, జ్యోతిబావుపూలే బీసీ బాలికలు, జ్యోతిబావుపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలను మంజూరు చేసింది. ఈ మూడు విద్యాలయాలను గంగాధరలో ఏర్పాటు చేశారు. ఈ మూడింటినీ అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ప్రతి నెల ఒక్కొక్క భవనానికి సుమారుగా 1.8 లక్షల కిరాయి చెల్లిస్తోంది. లక్షల్లో అద్దెలు చెల్లిస్తున్నా ఈ భవనాల్లో కనీస సౌకర్యాలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. గంగాధర బ్లాక్‌లోని బీసీ జ్యోతి బావుపూలే బాలుర పాఠశాల బాత్‌రూం, మరుగుదొడ్లపై నుంచి 11 కేవీ విద్యుత్ కనెక్షన్ ప్రమాదకరంగా ఉంది. సోమవారం హై వోల్టేజీ విద్యుత్ ప్రసారంతో వైర్లు తెగిపడగా ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. పలు మార్లు తీగలనుతొలగించాలని విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ బాలికల గురుకుల పాఠశాలలో గతేడాది ఓ విద్యార్థిని భవనంపై నుంచి దూకింది. తీవ్రంగా గాయపడి అదృష్టవత్తు ప్రాణాలు నిలిచాయి. ఇదే పాఠశాలలో పై అంతస్తులో పిల్లల దుస్తులు ఆరవేయగా గాలికి కొట్టుకు పోయి భవనం పక్కనే ఉన్న 11 కేవీ తీగలపై పడ్డాయి. వాటిని తీసే క్రమంలో వాచ్‌మెన్ విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. పాఠశాల పక్కన ఉన్న వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా చేసే తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రమాదం జరిగిన మూడేళ్లు కనీసం చర్యలు తీసుకోవడం లేదు.

# 18వ లోక్‌సభ సవ్యంగా జరిగేనా?




'ఇప్పటి వరకు జరిగిందంతా ట్రైలర్, ఇక ముమ్ముందు అసలు పిక్చర్ కనపడుతుంది' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ లోక్‌సభ ఎన్నికలకు ముందు ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఇదే విషయాన్ని గత వారం ఆయన రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ఇచ్చిన సమాధానంలో మరో రకంగా చెప్పారు. గత పదేళ్ల బీజేపీ పాలన భోజనానికి ముందు సేవించే అపిటైజర్ (సూప్) మాత్రమేనని ఇక ప్రధాన భోజనం వడ్డించడం ప్రారంభమైందని ఆయన అన్నారు. బహుశా ప్రతిపక్షాలు కూడా ఇదే ఆలోచనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయి. గత పదేళ్లు బీజేపీకి పూర్తి మెజారిటీ వచ్చినందువల్ల పార్లమెంట్‌లో వారు ఎంత ప్రతిఘటించినా పెద్ద ఫలితం లేకపోయింది. ఇప్పుడు ప్రతిపక్షం బలోపేతం కావడం, బీజేపీ మిత్రపక్షాలపై ఆధారపడి ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి రావడంతో వారు తమ నిరసన ధ్వనులు మరింత మిన్నంటించేందుకు తయారవుతున్నారు. అందువల్ల ఎవరు అసలు పిక్చర్ చూపిస్తారో, ఏ భోజనం వడ్డిస్తారో రాబోయే రోజులు తేల్చనున్నాయి. 18వ లోక్‌సభ తొలి 9 రోజుల సమావేశాల్లోనే ప్రభుత్వానికీ ప్రతిపక్షాలకూ మధ్య ఘర్షణాయుత వాతావరణం కనిపించడంతో జులై 22 నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాలు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు. పార్లమెంట్ సమావేశాలు జరిగినప్పుడల్లా అధికార పార్టీ, ప్రతిపక్షాలు రాజకీయ ప్రత్యర్థులుగా కాకుండా ఆజన్మ శత్రువులుగా వ్యవహరించడం వల్ల ఉద్వేగపూరిత నాటకీయ సన్నివేశాలు కనిపించక తప్పదు. తద్వారా అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన పార్లమెంట్ ప్రాధాన్యత మరింత తగ్గిపోయే అవకాశాలున్నాయి. నిశితంగా పరిశీలిస్తే ప్రతిపక్షాలు కేవలం నరేంద్రమోదీనే లక్ష్యంగా పెట్టుకుని వాగ్బాణాలు సంధిస్తున్నాయని అర్థమవుతుంది. చర్చల్లో బీజేపీ నేతలు ఎవరు మాట్లాడినా పెద్దగా స్పందించని ప్రతిపక్షాలు కేవలం మోదీ మాట్లాడినప్పుడు గందరగోళం సృష్టిస్తున్నాయి. ప్రతిపక్ష నేతల ప్రసంగాల్లో అధిక భాగం మోదీని విమర్శించేందుకు, ఎద్దేవా చేసేందుకు పరిమితమయ్యాయి. సాధారణంగా చట్టసభల సమావేశాల్లో అద్భుతమైన ప్రసంగాలు ప్రతిపక్ష శిబిరంనుంచే వస్తాయి. ప్రభుత్వ పక్షం తరఫున మాట్లాడే వారికి తమ పాలన గురించి గణాంక వివరాలు చెప్పడం మినహా చెప్పగలిగింది పెద్దగా ఉండదు. కొద్ది రోజులు జరిగినప్పటికీ ఈ లోక్‌సభ సమావేశాల్లో సహజంగానే రాహుల్‌గాంధీ, మహువా మొయిత్రా, కల్యాణ్ బెనర్జీ, ఎ. రాజా లాంటి నేతలు ప్రభుత్వంపై, ముఖ్యంగా ప్రధానమంత్రిపై శక్తిమంతంగా విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. అంతే శక్తిమంతంగా మాట్లాడగలిగిన నేత అధికార పక్షంలో మోదీ తప్ప ఎవరూ కనపడకపోవడం విస్మరించదగిన విషయం కాదు. ఒక రకంగా ఈ సమావేశాలను చూస్తుంటే ఎన్నికలు ఇంకా కొనసాగుతున్నాయా అన్న అభిప్రాయం కలుగుతోంది. నిన్నమొన్నటి వరకూ జరిగిన ఎన్నికల ప్రసంగాలు మళ్లీ అదే ధోరణిలో పార్లమెంట్‌లో కూడా వినపడడమే ఇందుకు కారణం. అయితే ప్రతిపక్ష నేత అయిన తర్వాత రాహుల్ గాంధీ తడుముకోకుండా, సూటిగా, విస్పష్టంగా మాట్లాడడం కాంగ్రెస్ నేతలకు చాలా కాలం తర్వాత హర్షాతిరేకం కలిగించింది. 2008లో రాహుల్‌గాంధీ తన పర్యటనలో కలుసుకున్న ఒక పేద మహిళ కళావతి గురించి పార్లమెంట్‌లో చేసిన ప్రసంగంలో తాను చెప్పదలుచుకున్న విషయాన్ని విస్పష్టంగా చెప్పలేక నవ్వుల పాలయ్యారు. ఆ తర్వాత కూడా ఆయన పార్లమెంట్‌లోను, బయటా అనేకసార్లు మాట్లాడినప్పుడు వినేవారికీ, ఆయనకూ మధ్య సమాచార అగాధం కనిపించేది. శిక్షపడ్డ ఎంపీలను కాపాడేందుకు 2013లో జారీ చేసిన ఆర్డినెన్స్ ప్రతిని రాహుల్ గాంధీ ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో చింపివేసి తమ యూపీఏ ప్రభుత్వాన్నే ఇరకాటంలో పెట్టారు. 2018లో తన ప్రసంగం తర్వాత రాహుల్ మోదీ వైపు వచ్చి ఆయనను కౌగిలించుకోవడం, ఆ తర్వాత సహచర ఎంపీలకు కన్నుకొట్టడం కూడా చర్చనీయాంశమైంది. కాని 2008లో రాహుల్ ప్రసంగం విన్న వారికి, దాదాపు 16 ఏళ్ల తర్వాత 2024లో ప్రతిపక్ష నేతగా ఆయన ప్రసంగం విన్న వారికి ఒక చెప్పుకోదగ్గ మార్పు కనిపించింది. అప్పటి, ఇప్పటి రాహుల్‌లో స్పష్టమైన తేడా ఉన్నది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, మణిపూర్, అగ్నివీర్, నీట్ ప్రశ్నపత్రాల లీక్‌పై మాట్లాడడంతో పాటు మోదీ వ్యవహార శైలిపై తడుముకోకుండా తీవ్రవిమర్శనాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ పార్టీ తమ నాయకుడుగా భావిస్తున్న వ్యక్తి ఇన్నాళ్ల వరకూ లోక్‌సభలో పెద్దగా గొంతు విప్పగలిగేవాడు కాదు. ఒకవేళ మాట్లాడినా అందులో ఒక ధార కానీ, ప్రవాహం కానీ కనిపించేది కాదు. ఇప్పుడు కాంగ్రెస్‌కే కాక ప్రతిపక్షాలకు ఒక నేత అంటూ లభించాడని చెప్పక తప్పదు. మోదీ సభలో ప్రవేశించినప్పుడు ఎప్పటి మాదిరి మోదీ, మోదీ అన్న నినాదాలు వినిపిస్తే రాహుల్ సభలో ప్రవేశించినప్పుడు మొదటి సారి రాహుల్, రాహుల్ అన్న నినాదాలు ప్రతిపక్ష శిబిరం నుంచి వినిపించాయి. మోదీ తన ప్రసంగంలో రాహుల్‌ను బాలకుడని అభివర్ణించినప్పటికీ రాహుల్ బాలకుడి స్థాయిని వయసు రీత్యానే కాక, పరిణతి రీత్యా దాటిపోయారని ఎవరికైనా అనిపిస్తుంది. గతంలో సభలో అరుదుగా కనిపించే మోదీ ఇప్పుడు రాహుల్ ఉన్నంత సేపూ సభలో కూర్చోవడం విస్మరించదగిన విషయం కాదు. మోదీ అబద్ధాలు చెబుతున్నారని రాహుల్ అంటే రాహుల్ అబద్ధాలు చెబుతున్నారని మోదీ అంటున్నారు. మోదీ ఇప్పుడు ఎన్డీఏ నాయకుడని రాహుల్‌కు, రాహుల్ మొత్తం ఇండియా కూటమి నాయకుడని మోదీకి తెలిసినా ఇరువురూ పరస్పరం ఒకర్నొకరు లక్ష్యంగా పెట్టుకోవడం వెనుక ఒక వ్యూహం ఉన్నట్లు కనిపిస్తోంది. పార్లమెంట్‌లో ప్రారంభమైన ఈ వ్యూహాలు ఇప్పుడు బయట కూడా అమలయ్యే అవకాశాలున్నాయి. మణిపూర్, హత్రాస్, అస్సాం దేశంలో ఎక్కడ ఏ సమస్య తలెత్తినా రాహుల్‌గాంధీ అక్కడకు వెళ్లి జనంలో కలిసిపోవడమే కాకుండా మోదీపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధులు, ప్రధాన కార్యదర్శులు, మీడియా విభాగం గతంలో కంటే మరింత చురుకుగా కనిపిస్తోంది. ప్రతిపక్షాల సంఘటిత కార్యాచరణ గతంలో కంటే బలంగా మారింది. ఈ రీత్యా బలమైన ప్రతిపక్షాలను ఎదుర్కొనేందుకు మోదీ కూడా సంఘటిత కార్యాచరణ ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైంది. ఎవరు ఎన్ని చెప్పినా దేశంలో ప్రజలు ఎన్డీఏ, ఇండియా కూటమిల మధ్య చీలిపోయారన్నది విస్పష్టంగా కనిపిస్తోంది. ఈ రెండు పక్షాల్లో లేనివారు కకావికలయ్యే పరిస్థితి ఏర్పడింది తమ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ తమ వైపుకు తిప్పుకుంటోందని, ఇది రాజ్యాంగ వ్యతిరేకమని మంగళవారం బీఆర్ఎస్ నేతలు ఢిల్లీలో విలేఖరుల సమావేశం పెట్టి మరీ వాపోయారు. దేశంలో చాలా మంది నేతలకు రాజ్యాంగం వారు కష్టకాలంలో ఉన్నప్పుడే గుర్తుకు వస్తుంది. తాము అధికారంలో ఉన్నప్పుడు ఇదే రాజ్యాంగాన్ని తామే కాలరాశామన్న విషయం వారు మరిచిపోతారు. పరస్పర శత్రుత్వ వాతావరణంలో 18వ లోక్‌సభ ప్రారంభమైన తీరు ఈ దేశంలో నిర్మాణాత్మక రాజకీయాలకు విఘాతం కలిగిస్తుందా అన్న ఆందోళనకు దారితీస్తోంది. 'బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకదానినొకటి శత్రువులుగా కాకుండా రాజకీయ ప్రత్యర్థులుగా మాత్రమే భావించాలి. జాతీయ అంశాలపై ఏకాభిప్రాయ సాధనకోసం ప్రయత్నించాలి, తమ మధ్య సమాచార సంబంధాలు ఏర్పర్చుకోవాలి..' అని బీజేపీ కురువృద్ధుడు లాల్‌కృష్ణ ఆడ్వాణీ తన ఆత్మకథలో రాశారు. ఇదే విషయాన్ని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ఎన్నికల అనంతరం నాగపూర్‌లో చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. 'మన సంప్రదాయం ఏకాభిప్రాయంతో ముడిపడి ఉన్నది..' అని ఆయన చెప్పారు. 'అందర్నీ కలుపుకుపోవడం, ఏకాభిప్రాయానికి ప్రయత్నించడం అధికారంలో ఉన్న వారి బాధ్యత' అన్నారు. సమాజంలో ఉన్న వైమనస్యాలు, మైనారిటీల్లో ఉన్న ఆందోళనలు తొలగించడం అధికారంలో ఉన్నవారే చేయాలని. వివిధ వర్గాల మధ్య పరస్పర గౌరవం ఏర్పడేలా చూడాలని, అహంకారం లేని హుందాతనం అవసరమని ఆయన అన్నారు. మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు బీజేపీ అగ్రనేతలను ఉద్దేశించి చేసి ఉండవచ్చు కాని రాజకీయాల్లో ప్రవర్తనా నియమావళి అన్ని వర్గాలకూ వర్తిస్తుంది. ఎన్నికల ఫలితాలు మోదీకి ఒక సందేశాన్ని అందించాయన్న విషయంలో సందేహం లేదు కాని తమ బలం పెరిగినంత మాత్రాన సభలో గందరగోళం సృష్టించడానికి ప్రతిపక్షాలకు లైసెన్స్ ఇచ్చినట్లు ఎంత మాత్రమూ కాదు. రాహుల్ మాట్లాడినప్పుడు బీజేపీ ఎంపీలు మౌనంగా ఉన్నా మోదీ మాట్లాడుతున్నప్పుడు విపక్ష సభ్యులు గందరగోళం సృష్టించడం అసంబద్ధంగా కనిపిస్తోంది. గత లోక్‌సభ సమావేశాలు చరిత్రలో ఎన్నడూ లేనంతగా అతి తక్కువ రోజులు జరిగాయి. 18వ లోక్‌సభ సమావేశాలు కూడా వ్యర్థం కాకుండా చూసుకోవడం ఇరు పక్షాలకు అవసరం. ఇప్పటికే వ్యవస్థలు పనిచేయడం లేదని చాలా మంది వాపోతున్నారు. చట్టసభల పట్ల కూడా అలాంటి అభిప్రాయం ఏర్పడుతోంది. గత ఎన్నికల్లో కంటే ప్రజల ఓట్ల శాతం ఈ సారి తగ్గిపోయింది. ఓటర్లలో దాదాపు సగం మంది ఎన్నికలను విస్మరించడమో, విముఖంగా ఉండడమో చేశారు. ప్రజలకు ప్రజాస్వామ్యం పట్ల ఆసక్తి పెరిగేలా చేయాలంటే అధికార, ప్రతిపక్షాలు పార్లమెంటులో తమ పాత్రను బాధ్యతాయుతంగా నిర్వర్తించడం తప్ప వేరే మార్గం లేదు.

# పోస్టుల కోసం... అధికారుల లాబీయింగ్



**విజయవాడ, జూలై :** ఐదు సంవత్సరాలు అడ్డగోలుగా అధికారాన్ని ఎంజాయ్ చేశారు. అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ నేతలకు తొత్తులుగా వ్యవహరించారు. వారి మాటే వేదమన్నట్లు.. రూల్స్ పక్కనపెట్టి ఏం చేయమంటే అది చేసి చూపిచ్చారు. అలాంటి స్వామిభక్తులు ఇప్పుడు ప్రభుత్వం మారగానే ప్లేట్ మారుస్తున్నారు. ఇప్పుడు తిరిగి పవర్ ఎంజాయ్ చేయడానికి తమవంతు ప్రయత్నాలు మొదలుపెట్టారు. కూటమి నేతలతో బంధుత్వాలు కలుపుకుంటూ కీలక స్థానాలలో పోస్టింగ్‌ల కోసం లాబీయింగ్ చేసుకుంటున్నారు. దాంతో అర్హత ఉన్నా వివిధ కారణాలతో లూప్ లైన్ లో ఉన్న అధికారులు ఇదేం గోలని టెన్షన్ పడుతున్నారంట. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వ హాయంలో ఎన్నడూ లేని విధంగా పోలీస్, రెవెన్యూ లాంటి కీలక విభాగాలలో పోస్టింగ్ విషయంలో జరిగిన తంతుపై రాష్టమంతా నివ్వెర పోయింది. కొంతమందికి అసలు పోస్టింగ్ ఇవ్వడం అటుంచి కనీసం లూప్ లైన్ లో అవకాశం కూడా ఇవ్వలేదు. దీంతో వారు మూడు సంవత్సరాల పాటు జీతాలు కూడా తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి వారు రాష్ట వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉన్నారు. సమర్థత ఉన్నప్పటికి వర్గం , సానుభూతి పరుడు లాంటి కారణాలతో ఇబ్బంది పెట్టారు. పోలీసు, రెవెన్యూ విభాగాలలో ఇలాంటి పరిస్థితి ఎక్కువగా కనిపించింది. పలువురు అధికారులు గత ప్రభుత్వంలో చాలా హడావుడి చేసారు. కీలక స్థానాలో పనిచేశారు. మాజీ సీఎం జగన్‌కు ఆప్తులైన నాయకులు ఏం చెబితే అదే చేశారు. దాంతో టీడీపీ, జనసేన నాయకులు అప్పట్లో వారికి టార్గెట్ అయి పలు సమస్యల్లో ఇరుక్కున్నారు. అప్పట్లో టిడిపి శ్రేణులు అటువంటి అధికారులు, నేతలపై బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. ఎన్నికల పోలింగ్ , తర్వాత కౌంటింగ్ కు ముందు కూడా టీడీపీ , కూటమి నాయకులపై చంద్రగిరి, తిరుపతి, పుంగనూరు లాంటి చోట్ల కేసులు నమోదు చేసారంటే ఎంత స్వామి భక్తిని ప్రదర్శించారో అర్థం అవుతుంది. ఇలాంటి వారంతా ఇప్పుడు ఒక్కసారిగా అధికారం మారడంతో.. కూటమి నేతలతో బంధుత్వాలు కలుపుతూ.. గతంలో వారికి సన్నిహితులమని చెప్పుకుంటూ పోస్టింగ్స్ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. కీలక పోస్టుల కోసం పెద్ద మొత్తం డబ్బులు ఇస్తామని ప్రతిపాదనలు కూడా పెడుతున్నారంట. తిరుపతి నగర పాలక సంస్థలో మాస్టర్ ప్లాన్ రహదారులు, టిడిఆర్ బాండ్స్ కుంభకోణంలో కీలక పాత్రధారి అయిన ఓ అధికారి అయితే నేను మీవాడినే గతంలో మీతోనే తిరిగాను. గత్యం తరం లేక వారు చెప్పినట్లు చేయాల్సి వచ్చిందంటూ.. ఎంతైనా ఇస్తాను తనను ఆ పోస్టులోనే కొనసాగించమని నాయకుల చుట్టు తిరుగుతున్నాడంట. అయితే అతని గురించి తెలిసిన వారు సిఫార్సు చేయడానికి భయపడుతున్నారంట. ఇక పోలీసు విభాగంలోని గత ఐదు సంవత్సరాలు హడావుడి చేసిన వారు సైతం ఇప్పుడు తాము చాల నిజాయితీగా పనిచేసామని.. అంతేకాక చాలా సార్లు కేసుల నుంచి బయట పడవేసామంటూ అంటు ఎమ్మెల్యేల చుట్టు తిరుగుతున్నారంట. అయితే కొంతమంది ఎమ్మెల్యేలు మాత్రం మీరు గత ఐదు సంవత్సరాలలో ఎక్కడ పోస్టింగ్ చేసారో వివరాలు ఇవ్వండి పరిశీలిస్తామని అంటున్నారంట. గతంలో వారు ఎక్కడా పనిచేసారో అయా ప్రాంతాల టీడీపీ నాయకులతో మాట్లాడి వారి గురించి ఎంక్వైయిరీ చేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో వైసీపీ నుంచి వచ్చి కూటమిలో గెలిచిన ఎమ్మెల్యేల చుట్టు ప్రదక్షిణాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. అప్పట్లో వారితో సన్నిహితంగా మెలిగిన వారు మీకోసం అప్పుడు చేసాము. ఇప్పుడు మీరు అవకాశం ఇవ్వండి అని వత్తిడి తేస్తున్నట్లు సమాచారం. అయితే సిఐ నుంచి పైస్థాయి అధికారుల బదిలీలన్నీ పై నుంచి నడుస్తాయని చెప్పడంతో సదరు అధికారులు బిక్కచచ్చిపోతున్నారంట. వారి లాబీయింగ్ వ్యవహారం చూస్తూ.. గత ఐదు సంవత్సరాలుగా అర్హతలకు తగ్గ పోస్టింగ్‌లు లేక రాష్టం నలుమూలాల విసిరి వేయబడ్డ వారంతా ఇప్పుడైనా తమకు న్యాయం జరుగుతుందా లేదా అనే సందేహపడే పరిస్థితులు వచ్చాయంటరెవెన్యూ శాఖలో సైతం ఇలాంటి దందా నడుస్తోంది. అడ్డగోలుగా పనిచేసి అక్రమాలకు సహకారించిన అధికారులు.. మీకు కూడా ఇలాగే పనిచేస్తాం.. మాకు అవకాశం ఇవ్వండి.. రెవెన్యూ లొసుగులతో మీకు లాభాలు కల్పిస్తామని అధికార నేతలకు ఓపెన్ అఫర్లు ఇస్తున్నారంట. అయితే అప్పట్లో ఇక్కట్లు ఎదుర్కొన్న ప్రజా ప్రతినిధులు వటకే చెప్పడం లేదంటున్నారు. ఆర్డీఓ స్థాయి అధికారుల వ్యవహారం అంతా పై వారు చూసుకుంటారని ఎంఆర్వోతో పాటు కింది స్థాయి సిబ్బంది అయితే తాము చూస్తామని గతంలో తమను ఇబ్బందిపెట్టిన మీకు సహకరించే ప్రసక్తి లేదని తెగేసి చెప్తున్నారంట. మొత్తం మీద అధికార మార్పిడి తర్వాత పోస్టింగ్‌ల కోసం పోలీసులు ,రెవెన్యూలో తెగ లాబీయింగ్ జరుగుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఆర్టీఓ, మున్సిపాలిటీల్లో కూడా ఇదే తతంగం నడుస్తోందంట. చూడాలి మరి వారి లాబీయింగులు ఎంత వరకు పనిచేస్తాయో.

# అవయవాల రాకెట్.....వెలుగులోకి విస్తుపోయే నిజాలు

**విజయవాడ,జూలై :** విజయవాడలో అక్రమ అవయవ మార్పిడి వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. గత ఏడాది వెలుగు చూసిన అక్రమ కిడ్నీ మార్పిడి వ్యవహారం మరుగున పడకముందే మరో బాధితుడు వెలుగులోకి వచ్చాడు. ఈ దందాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐపీఎస్ అధికారుల సహకారం ఉండటంతో అక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గత ఏడాది విజయవాడ స్వర ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి వ్యవహారం వెలుగు చూసిన సమయంలో విజయవాడ పోలీస్ ఉన్నతాధికారులుగా ఉన్న ఇద్దరు ఐపీఎస్ అధికారులు చక్రం తిప్పారు. ఆస్పత్రి యాజమాన్యంలో ఉన్నవైద్యుడి బంధువైన వైసీపీ ప్రజాప్రతినిధి.. కులానికి చెందిన ఐపీఎస్ అధికారి ఈ వ్యవహారాన్ని భుజాన వేసుకుని సెటిల్ చేశాడు. పోలీస్ శాఖను నడిపించే ముఖ్యమైన అధికారులు స్వయంగా రంగంలోకి దిగడంతో కేసు కాస్త జావగారిపోయింది. తాజాగా మరోసారి కిడ్నీ రాకెట్ దందా వెలుగులోకి వచ్చింది. అవయవ మార్పిడి వ్యవహారంలో ఉన్న లోపాలను అడ్డం పెట్టుకుని ఫ్యామిలీ ఫ్రెండ్ పేరుతో ఓ యువకుడి కిడ్నీ కాజేశారు. ఈ వ్యవహారంలో తమకేమి సంబంధం లేదని ఆస్పత్రి చెబుతున్నా విజయవాడలో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ అవయవాల మార్పిడి దందాకు తాజా ఘటన ఉదాహరణగా నిలుస్తోంది. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న వ్యక్తి సోషల్ మీడియాలో ప్రకటన చూసి కిడ్నీ విక్రయించందుకు సిద్ధపడ్డాడు. కిడ్నీ తీసుకున్న తర్వాత డబ్బులు ఇవ్వకుండా తనను మోసం చేయడంతో పోలీసుల్ని ఆశ్రయించాడు. గుంటూరు జిల్లా కొండా వెంకటప్పటయ్యకాలనీకి చెందిన నేలపాటి మధుబాబు కిడ్నీని కాజేసిన ముఠా ఇస్తామన్న డబ్బులు మాత్రం ఇవ్వలేదు. 15ఏళ్లుగా గుంటూరులోని చుట్టుగుంటలో భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్న మధుబాబు కుటుంబాన్ని పోషించుకునే వాడు. కూరగాయల వ్యాపారం, నూడిల్స్ బండి వంటి చిరు వ్యాపారాలు చేసే మధుబాబు కోవిడ్ సమయంలో తీవ్రంగా నష్టపోయాడు. కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. లోన్ యాప్‌లలో కూడా అప్పులు చేశారు. వాటిని తీర్చడానికి సతమతమవుతున్న సమయంలో కిడ్నీ డోనర్ కావాలని ఫేస్‌బుక్‌లో ప్రకటన చూసి స్పందించాడు. దానికి బదులిచ్చిన బాష అనే వ్యక్తి కిడ్నీ దానం చేస్తే డబ్బులిస్తామని ఆఫర్ చేశాడు. రూ.30లక్షలకు కిడ్నీకి చెల్లిస్తామని చెప్పా?డు. అప్పులు తీర్చుకోవడంతో పాటు కుటుంబాన్ని పోషించుకోవచ్చని భావించిన మధుబాబు అందుకు సమ్మతించడంతో మధ్యవర్తిగా భాషా అనే వ్యక్తిని పరిచయం చేశాడు. వారిద్దరు కలిసి కిడ్నీ అవసరమున్న రోగి బంధువు సుబ్రహ్మణ్యం వద్దకు మధుబాబును తీసుకు వెళ్లారు. వైద్య పరీక్షల్లో మధుబాబు కిడ్నీ రోగికి సరిపోతుందని తెలియడంతో మొదట రూ.50వేలు చెల్లించారు. జీవన్‌దాన్ నియమనిబంధనల ప్రకారం అవయవ మార్పిడి చేయాలన్నా, దాతల




నుంచి స్వీకరించాలన్నా కుటుంబ సభ్యులు, కుటుంబ మిత్రులై ఉండాలి. ఈ క్రమంలో మధుబాబును రోగి కుటుంబ మిత్రుడిగా చూపించారు. ఇందుకు అవసరమైన పత్రాలను సృష్టించారు. జూలై 15న విజయవాడలోని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ శరత్ కిడ్నీ మార్పిడి చికిత్స చేశారు. మధుబాబు నుంచి స్వీకరించిన కిడ్నీని కేతినేని వెంకటస్వామి అనే వ్యక్తికి అమర్చారని బాధితుడు చెబుతున్నాడు. బాధితుడికి తల్లిదండ్రులు లేకపోవడంతో అతనికి అవసరమైన నకిలీపత్రాలను నిందితులే సృష్టించారు. ఒప్పందం ప్రకారం ఇస్తామన్న రూ.30లక్షలు ఇవ్వకుండా కేవలం రూ.50వేలు మాత్రమే ఇచ్చారని బాధితుడు వాపోయాడు. శస్త్ర చికిత్సకు ముందు బాధితుడి ఎడమ కిడ్నీ తీసుకుంటామని చెప్పినా చికిత్స సమయంలో కుడివైపు కిడ్నీ తొలగించారు. ఇదేమటని ప్రశ్నిస్తే వైద్యుడు శరత్‌బాబు తనను బెదిరించాడని బాధితుడు ఆరోపించాడు. ఫేస్‌బుక్‌లో ప్రకటన ఇచ్చిన బాషా, మధ్యవర్తి వెంకట్ ఫోన్ నంబర్ ద్వారా తనతో మాట్లాడారని తెలిపాడు. రోగి బావ నిమ్మకాయల సుబ్రహ్మణ్యం ఆన్లైన్‌లో రూ50వేలు పంపి నమ్మకం కలిగించారని తెలిపాడు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యే సమయంలో తనకు రావలసిన మొత్తం ఇవ్వాలని అడిగితే... ఇష్ట మయ్యే కదా కిడ్నీ ఇచ్చావు' అన్నారని, గట్టిగా అడిగితే కిడ్నీలు తీసిన వాళ్లకు ప్రాణాలు తీయడం లెక్క కాదని బెదిరించారని ఆరోపించాడు. తనను మోసం చేసిన బాషా, వెంకట్, సుబ్రహ్మణ్యం, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ శరత్ బాబు, వెంకట స్వామిలపై చట్టం ప్రకారం చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని మధుబాబువిజ్ఞప్తి చేశాడు. విజయవాడలోని శరత్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆస్పత్రి, దానికి అనుబంధంగా ఉన్న మరో ఆస్పత్రిలో ప్రతినెల 5-10 కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నారని బాధితుడు ఆరోపించాడు. కిడ్నీ మార్పిడి వ్యవహారంలో నగదు వ్యవహారంతో తమకు సంబంధం లేదని డాక్టర్ శరత్ చెబుతున్నారు.

# పదవుల కోసం విశ్వప్రయత్నాలు

**గుంటూరు, జూలై :** న్నో ఆటుపోట్లను తట్టుకొని కూటమి కట్టారు. భారీ విజయం సాధించడంలో కూటమినేతలందరూ పనిచేశారు. అగ్రనేతలు సమన్వయంతో పాలనాపగ్గాలు చేపట్టి ముందుకు సాగుతుంటే.. కింది స్థాయిలో మాత్రం కొన్ని చోట్ల ఆ పరిస్థితి కనిపించడం లేదు. టీడీపీ అభ్యర్థి ఘన విజయం సాధించిన ఆ సెగ్మెంట్లో ఆ పార్టీ నేతలు తమను పట్టించుకోవడం లేదని బీజేపీ, జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ఒంటెద్దు పోకడలతో వారంతా గుర్రుగా కనిపిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీకి తమ ప్రభావం చూపిస్తామంటున్నారు. అసలా సెగ్మెంట్ ఏది? అప్పుడే అక్కడ ఆ పరిస్థితి ఎందుకొచ్చింది? కూటమి అఖండ విజయంతో పల్నాడు జిల్లాలో నాయకులంతా పదవులపై కన్నేశారు. నియోజకవర్గాల వారీగా టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీల నేతలు తమ వర్గాల వారికి పదవులపై ఆశలు పెట్టుకుంటున్నారు. అయితే ప్రస్తుతం పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గం కూటమినేతలలో అసంతృప్తి జ్వాలలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నరసరావుపేటలో టీడీపీ అభ్యర్థి చదలవాడ అరవిందబాబు భారీ మెజారిటీతో గెలవడంతో కూటమినేతలంతా సహజంగానే పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఇలాంటి తరుణంలో టీడీపీ, జనసేనల మధ్య అప్పుడే విభేదాలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం టీడీపీ అభ్యర్థిగా డాక్టర్ అరవింద్ బాబు ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యే అయ్యారు. నరసరావుపేటకు చెందిన జనసేన ఇన్చార్జ్ ఆయన విజయానికి తనవంతు కృషి చేశారు. ఆ క్రమంలో కూటమిలో భాగంగా జనసేనకు కూడా నరసరావుపేట నియోజకవర్గం పరిధిలోని నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు రావాలని జనసేన నేతలు కోరుతున్నారు. జనసేన పార్టీలో ఉండి కూటమి విజయానికి కృషి చేసిన వాళ్ళకి ప్రస్తుతం ప్రాధాన్యత లేకపోతుండటంతో జనసైనికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. నరసరావుపేట నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులకు సంబంధించి టీడీపీ వారికే ప్రాధాన్యత ఉంటుందంటూ.. తమను పట్టించుకోక పోతుండటంతో జనసేన వర్గాలు అసహనంతోకనపిస్తున్నాయి. ఈ అంశాన్ని మంత్రి లోకేష్ దృష్టికి



కూడా జనసేన నేతలు తీసుకెళ్లారంట. అందరికీ న్యాయం చేసేలా నిర్ణయాలు తీసుకుంటామని లోకేష్ వారికి హామీ ఇచ్చారంటజనసేన ముఖ్యనేతలు కూడా అసంతృప్తిగా ఉన్న వారిని కాస్త ఓపిగ్గా ఉండాలని సూచించారంట. కలిసికట్టుగా పని చేసుకోవాలని రానున్న రోజుల్లో అందరికీ సమానమైన పదవులు దక్కుతాయని హామీ ఇచ్చారంట. ఏదేమైనా ఇలాంటి పరిస్థితి కొనసాగితే మాత్రం రానున్న రోజుల్లో నరసరావుపేట కేంద్రంగా కూటమిలో విభేదాలు మరింత పెరిగడం ఖాయమంటున్నారు. ప్రస్తుతానికి అయితే పర్లేదు గాని స్థానికి సంస్థల ఎన్నికలు జరగాల్సి ఉండటంతో.. ఇలాంటి అంశాలు పరోక్షంగా ప్రతిపక్ష పార్టీలకు కలిసి వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాంతో పాటు నియోజకవర్గంలో వైసీపీలో అసంతృప్తితో ఉన్న నేతలు ఎక్కువగా టీడీపీ కంటే జనసేన వైపే అడుగులు వేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వారికి జనసేన గేట్లు తెరుచుకుంటే.. ఆ పార్టీ మరింత బలపడి స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అవకాశాలు తగ్గిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అందర్నీ సమన్వయపర్చుకోవాల్సిన బాధ్యత నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందరావుపై ఉందని అయితే ఆయన టీడీపీలోని విభేదాలనే కంట్రోల్ చేయలేకపోతుండటం చర్చనీయాంశంగా మారింది.

# ఇసుకపై ట్వీట్... వార్



**విశాఖపట్టణం, జూలై :** ఆంధ్రులకు ఇకపై ఫ్రీ ఇసుక అందించేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు సైతం నిన్న జారీచేసింది. కాగా ఈ అంశంపై టీడీపీకి వైసీపీకి మధ్య ట్వీట్ వార్ జరుగుతోంది. చంద్రబాబు చెప్పింది ఎప్పుడూ చేయరని, అబద్ధాలు చెప్పడం.. మోసం చేయడం బాబు నైజమని వైసీపీ ఆరోపించింది. అలానే పేరుకే ఉచిత ఇసుక విధానమని.. దీని పేరుతో కూటమి నేతలు కోట్లు దోచుకుంటున్నారని మండిపడింది. ఇసుక ఉచితంగా ఇవ్వకపోగా స్టాక్‌యార్డుల వద్ద దారుణమైన రేట్లతో ఇసుకను విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన ధరలు ఒకసారి చూస్తే.. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం డిపో దగ్గర టన్ను ఇసుక. రూ.1225లు, విశాఖనగరంలో ఉన్న అగనంపూడి డిపోవద్ద టన్ను ఇసుక రూ.1394లు, అనకాపల్లి జిల్లా నక్కపల్లి డిపోవద్ద వద్ద టన్ను ఇసుక ధర రూ.1125లు దాదాపు ఇవే రేట్లతో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గాల్లో ఇసుక అందించిందని పేర్కొంది. అంతేకాదు నియోజకవర్గాల వారీగా రేట్లు ప్రకటించి అత్యంత పారదర్శకంగా ఇసుకను వైసీపీ అందించిందని, యస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ప్రజలు చెల్లించిన ధర నేరుగా ప్రభుత్వ ఖజానాకు ఏడాదికి రూ.750 కోట్లు చేరిందని, ఇప్పుడు ఈ డబ్బు నేరుగా టీడీపీ కూటమి నాయకుల జేబుల్లోకి వెళ్తోందని ఆరోపించింది. అలానే మీరు ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు విజ్ఞులని.. వారు అన్ని గమనిస్తూనే ఉంటారని. సరైన సమయంలో బుద్ధి చెబుతారని వైసీపీ ట్వీట్ చేసింది. కాగా ఈ ట్వీట్‌పై టీడీపీ ఘాటుగా స్పంధించింది. అవును ఇసుక ఫ్రీనే.. ఇసుకకి రూపాయి తీసుకున్నట్టు నిరూపిస్తే, జగన్‌ను అసెంబ్లీలో మొదటి బెంచీలో కూర్చోపెట్టమని, చంద్రబాబుకు రిఫర్ చేస్తామని తెలిపింది. నువ్వు ఎంత విష ప్రచారం చేసినా, ఉచిత ఇసుక తీసుకునే ప్రజలకు తెలుసని, 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు తెలుసని.. నువ్వు ఎంత తప్పుడు ప్రచారం చేస్తే, అంత దిగజారుతావంటూ టీడీపీ మండిపడింది. ఇసుక ఫ్రీ.. అనేది 2019కి ముందే ఉన్న విధానం అని.. ఇప్పుడు కొత్తగా వచ్చింది కాదని స్పష్టం చేసింది. లోడింగ్, రవాణా చార్జీలు భరించాలి.. అవి కూడా ఫ్రీ ఇవ్వాలంటే, ఎలాగూ తాడేపల్లి కొంపలో ఖాళీనేగా, వచ్చి లోడింగ్ చేస్తే ప్రజలకు లోడింగ్, రవాణా చార్జీలు కూడా ఉండవని.. ప్రజలకు కూడా సేవ చేసినట్టు ఉంటుందని జగన్‌ను ఎద్దేవా చేసింది. ఒకసారి మీ ముఠా ఆలోచించండి అంటూ టీడీపీ ట్వీట్ చేసింది.

# ఎక్కడి నేతలు... అక్కడే గప్ చిప్



**గుంటూరు, జూలై :** అధికారంలో ఉండగా వీరావేశం ప్రదర్శించారు. తోటి నాయకుల పై తోడ కొట్టారు. తమకు ఎదురు లేదని ఎవరు పోటీ రారని బీరాలు పలికారు. నాయకుల మెప్పుకోసం మీసాలు మెలేశారు. ప్రజెంట్ అధికారం పోయింది. ఇప్పుడు ఎక్కడ దాక్కున్నారో అడ్రస్ లేరు. అది ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 10 సంఖ్యలో లీడర్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్నారు. కేసుల భయంతో ఇతర ప్రాంతాలకు వెలుతున్న నేతలు కోర్టుల ద్వారా ఉపశమనం పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా వైసీపీలో గందరగోళం నెలకొంది. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, యువజన విభాగం కోఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య ఇలా చెప్పుకుంటే పోతే ఎంతోమంది నేతలు ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వైసీపీ నేతలు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడంతో కార్యకర్తలు అయోమయంలో పడిపోయారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పదిహేడు నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు ఓడిపోయారు. మొట్టమొదటి సారి కూటమి అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో కార్యకర్తలకు ధైర్యం చెప్పి ముందుండి నడిపించాల్సిన నేతలు తలోదిక్కుకు వెళ్లిపోయారు. ఎమ్మెల్యేలు లేకపోతే కనీసం ఎమ్మెల్సీలైనా అండగా ఉంటారనుకుంటే వారు కూడా అందుబాటులో లేకపోవడం కార్యకర్తలను మరింత కృంగదీసింది. కేసుల భయంతోనే ముఖ్య నేతలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్ట్ చేయడంతోనే ఇతర నేతల్లో ఆందోళన మొదలైంది. పిన్నెల్లి అరెస్టు రిమాండ్‌లో ఉన్నా ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి ఎక్కడున్నది ఇంతవరకూ తెలియదు. పిన్నెల్లి బ్రదర్స్ తో పాటు వారి ప్రధాన అనుచరుడు మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ తురకా కిషోర్ కూడా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కిషోర్ పై అనేక కేసులున్నాయి. పంచాయతీ ఎన్నికల సమయంలో టీడీపీ నేతల కారుపై దాడి చేసిన నిందితుల్లో కిషోర్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ప్రభుత్వం మారడంతోనే ఆ కేసుల్లో అరెస్ట్ చేస్తారన్న భయంతో వెంకట్రామిరెడ్డి, కిషోర్ ఇద్దరూ కూడా విదేశాలకు వెళ్లిపోయారని అనుకుంటున్నారు. ఇక కేంద్ర టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసు గుంటూరు నేతల్ని వెంటాడుతోంది. దాడుల్లో పాల్గొన్నారని పలువురి కేసు నమోదు చేయడమే కాకుండా ప్రభుత్వం సిట్ కూడా వేసింది. దీంతో ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ అప్పి రెడ్డి ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. దాడిలో పాల్గొన్న విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య కూడా ఎక్కడున్నాడో తెలియడం లేదు. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుండి చైతన్య గుంటూరులో కనిపించడం లేదు. వీరితో పాటు పలువురు కార్పొరేటర్లు, కార్పొరేటర్ల భర్తలు కూడా గుంటూరు వదిలి వెళ్లిపోయారు. కార్పొరేటర్ రోషన్, గురవయ్యలతో పాటు కార్పొరేటర్లు రమేష్, రాజేష్ లు ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. ఇప్పటికే కార్పొరేటర్ అంచాల వెంకటరెడ్డి టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో అరెస్ట్ అయ్యారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వైసీపీ నేతలతో పాటు కార్యకర్తల్లోనూ కేసులు భయం వెంటాడుతోంది. అయితే ముఖ్య నేతలు అజ్ఞాతంలోకి వెళ్లడంపై కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. న్యాయ పోరాటం చేయకుండా ఎన్నాళ్లు దాక్కుంటారని ప్రశ్నిస్తున్నారు.

# ఫైర్ బ్రాండ్.... కోటంరెడ్డి




**నెల్లూరు, జూలై :** ఉమ్మడి నెల్లూరు జిల్లా పదికి పది సీట్లు టీడీపీ పరమయ్యాయి. వైసీపీ కంచుకోటలు సైతం పేకమేడలా కూలిపోయాయి. పసుపు జెండా రెపరెపలాడింది. అసలు అవకాశమే లేదు అనుకున్న చోట ఇంతటి ఘన విజయం ఎలా దక్కింది. రాష్ట్రం మొత్తం కూటమి హవా వీచినట్లే.. నెల్లూరులోనూ సైకిల్ స్పీడ్ కొనసాగిందా? లేక ఇంకేమైనా కారణముందా? అంటే కచ్చితంగా ఓ పేరు వినిపిస్తుంది.. ఆ పేరే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. పదునైన విమర్శలతో వైసీపీ కోటలను కూల్చేసిన గ్రనేడ్ మన్ కోటంరెడ్డి. ఫ్యాన్ రెక్కలు విరిచి సైకిల్‌కు కొత్త జవసత్వాలు తెచ్చేలా తొలి అడుగు వేశారు కోటంరెడ్డి. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కోటంరెడ్డి? ఎన్నికలకు ఏడాది ముందు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా మెలిగిన శ్రీధర్‌రెడ్డి? అంతేస్థాయిలో విభేదించి ఆయనకు దూరమయ్యారు. కోటంరెడ్డి టీడీపీలో చేరినంతవరకు ఒకలా ఉండేలా జిల్లా రాజకీయాలు? ఆయన పార్టీ మారిన తర్వాత ఒక్కసారిగా మారిపోయాయి. కోటంరెడ్డితో టీడీపీలోకి మొదలైన వలసలు? ఆ తర్వాత మరో ఇద్దరు ఎమ్మెల్యేలు, ఓ ఎంపీ టీడీపీ గూటికి చేరేలా చేసింది. ఇలా నెల్లూరులో టీడీపీకి కొత్త జోష్ తేవడంలో కోటంరెడ్డి పాత్రను ప్రముఖంగా చెబుతున్నారు పరిశీలకులు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 10 అసెంబ్లీ, 2 పార్లమెంట్ నియోజకవర్గాలున్నాయి. గత ఎన్నికల వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వైసీపీ బలంగానే ఉండేది. 2014 ఎన్నికల్లో 7 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంటే.. 2019లో పదికి పది అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించి క్లీన్ స్వీప్ చేసింది వైసిపి. నెల్లూరు నగర కార్పొరేషన్ ఎన్నికల్లోనూ విజయ ఢంకా మోగించింది. 54 డివిజన్‌లను క్లీన్ స్వీప్ చేసింది. కాని ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సీన్ రివర్స్ అయింది. వైసిపి కంచుకోట బ్లాస్ట్ అయింది. ఈసారి అన్ని స్థానాలలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించి వైసీపీ కంచుకోటను తన వశం చేసుకుంది. జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంతలా డ్యామేజ్ అవడానికి ప్రధాన కారణం టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిదే అంటున్నారు పరిశీలకులు. వైసీపీపై ఆయన చేసిన తిరుగుబాటే ఆ పార్టీకి నష్టాన్ని కలిగించిందంటున్నారు. సంచలన రాజకీయాలకు కేరాఫ్‌గా చెప్పే ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తన వ్యూహచాతుర్యంతో వైసీపీని దెబ్బతీశారు. ఫైర్ బ్రాండ్ లీడర్ అయిన కోటంరెడ్డి వైసీపీలో కీలక నేతగా వ్యవహరించేవారు. 2019లో వైసీపీ ఎమ్మెల్యేగా గెలిచిన కోటంరెడ్డి గత ఏడాది ఆ పార్టీ నుంచి బయటకు వచ్చారు. తిరుమలకు పాదయాత్రగా వెళ్లిన అమరావతి రైతులను నెల్లూరులో కోటంరెడ్డి కలవడంతో మొదలైన వివాదం?. ఫోన్ ట్యాపింగ్‌కు దారితీయడం? చివరకు వైసీపీ నుంచి బయటకు వచ్చినంతవరకు వెళ్లింది. పార్టీ పట్ల విధేయతతో వ్యవహరించిన తనను తీవ్రంగా అవమానించడం, అనుమానించడం తట్టుకోలేని కోటంరెడ్డి కసితో పనిచేసి వైసీపీ కోటను కూల్చేశారు.

# డీఫాల్ట్ బెయిల్ పైనే ఆశలు




**హైదరాబాద్, జూలై :** భారత రాష్ట్ర సమితికి చెందిన ఇద్దరు కీలక నేతలు కేటీఆర్, హరీష్ రావు ఐదు రోజులుగా ఢిల్లీలోనే ఉన్నారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారని రేవంత్ రెడ్డి వ్యవహారాన్ని దేశం మొత్తానికి తెలిసేలా చేయడానికే ప్రెస్ మీట్ పెట్టామని కేటీఆర్ చెప్పారు. నిజానికి వారు ఢిల్లీలో ఉన్నప్పుడే ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ విషయం చెప్పడానికి ఐదు రోజులు సమయం తీసుకోవాల్సిన అవసరం లేదు. మరో ప్రత్యేకమైన కారణంతోనే కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీలో ఉన్నారని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆ కారణం కవితకు బెయిల్ అనే గుసగుసలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఢిల్లీ లిక్కర్ స్కాం కల్వకుంట్ల కవితను మార్చి పదిహేనో తేదీన ఈడీ అరెస్టు చేసింది. అప్పటి నుంచి జైల్లోనే ఉన్నారు. మధ్యలో సీబీఐ కూడా అరెస్టు చూపించింది. అంటే ఇప్పుడు ఆమె అటు సీబీఐ కేసులో.. ఇటు ఈడీ కేసుల్లోనూ అరెస్టు అయ్యారు. ఇప్పుడు బెయిల్ రావాలంటే రెండు కేసుల్లోనూ బెయిల్ తెచ్చుకోవాల్సి ఉంది. దిగువ కోర్టులో అనుకూల ఫలితం రాలేదు. ఎగువ కోర్టుల్లో న్యాయపోరాటం చేస్తున్నారు. తాజాగా చార్జిషీటు విషయంలో న్యాయపరమైన అవకాశం దొరకడంతో వెంటనే.. డీఫాల్ట్ బెయిల్ కోసం దిగువకోర్టును ఆశ్రయించారు. చార్జిషీటులో లోపాలున్నందున పరిగణనలోకి తీసుకోలేదు కాబట్టి డిఫాల్ట్ బెయిల్ ఇవ్వాలని కవిత తరపున బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. శుక్రవారం ఈ పిటిషన్ పై విచారణ జరగనుంది. కవిత జైలుకు వెళ్లి దాదాపుగా నాలుగు నెలలు అవుతోంది. ఇంత కాలం జైల్లో ఉంచడం అన్యాయమని న్యాయనిపుణులతో కోర్టుల్లో వాదించేందుకు కేటీఆర్, హరీష్ రావు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారని చెబుతున్నారు. పేరెన్నికగన్న న్యాయనిపుణలతో చర్చలు జరుపుతున్నారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఫామ్ హౌస్ నుంచి కేసీఆర్ ఎప్పటికప్పుడు పరిణామాల్ని కనుక్కుంటూ.. కొత్తగా ఎలాంటి ప్రయత్నాలు చేయాలో ఆదేశాలిస్తున్నారని అంటున్నారు. ఢిల్లీలో ప్రముఖ లాయర్లతో కేసీఆర్ కూడా మాట్లాడుతున్నట్లుగా చెబుతున్నారు. కవితను ఎలాగైనా బెయిల్ పై బయటకు తీసుకురావాలని ఆ తర్వాతనే హైదరాబాద్ వెళ్లాలన్న ఆలోచనలో కేటీఆర్, హరీష్ రావు ఉన్నారని చెబుతన్నారు. శుక్రవారం వరకూ డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ పై విచారణ జరుగుతుంది. ఆ రోజున బెయిల్ వస్తే మిగతా లాంఛనాలు పూర్తి చేసి అందరూ హైదరాబాద్ వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. బెయిల్ వచ్చే సంకేతాలు ఉన్నందున హరీష్ రావు, కేటీఆర్ ఢిల్లీలో ప్రయత్నాలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్గాలంటున్నాయి. అయితే కేజ్రీవాల్ కు దిగువ కోర్టు బెయిల్ ఇచ్చిన హైకోర్టులో చుక్కెదురు అయింది. మాజీ డిప్యూటీ సీఎం సిసోడియా ఏడాదికిపైగా జైల్లోనే ఉన్నారు. మరి వారెవరికీ రాని బెయిల్ కవితకు వస్తుందా అన్న సందేహాలు కూడా కొంత మందిలో వ్యక్తమవుతున్నాయి

# పాము కాటు వేయడంలోనూ... పద్ధతి



**లక్నో, జూలై :** సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ప్రపంచం నలుమూలలా ఎక్కడ ఏం జరిగిన కూడా క్షణాల్లో వైరల్ అవుతుంది. ఈ క్రమంలోనే ఒక ఆశ్చర్యకరమైన ఘటన ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతుంది. ఒక వ్యక్తిని ఒక పాము నెలన్నర వ్యవధిలో ఆరు సార్లు కాటు వేసింది. అదృష్టం బాగుండి ఆ వ్యక్తి ప్రతి సారీ ప్రాణాలతో బయట పడుతున్నారు. అయితే ఇందులో అందరికి ఆశ్చర్యాన్ని కలిగించే విషయం ఏమిటంటే పగ పట్టిన ఆ పాము అతడిని వేటాడి రెండు ప్రత్యేక రోజుల్లోనే కాటు వేస్తుంది. ఆ వ్యక్తి ఆ పాము నుంచి తప్పించుకోవడానికి ఊరు మారినప్పటికీ లాభం లేకపోయింది. పాము ఆ వ్యక్తిని వేటాడి పొరుగూరికి కూడా వెళ్లి కాటు వేస్తుంది. ఇలా మొత్తం ఆరు సార్లు ఆ పాము కాటు వేసింది. పాము కాటు వేసిన ప్రతి సారీ ఆ వ్యక్తి ఆసుపత్రి లో చికిత్స పొందటం చూసి డాక్టర్లు సైతం ఆశ్చర్యపోతున్నారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లో జరిగింది. యూపీ లోని ఫతేపూర్ లో ఈ ఆశ్చర్యకరమైన ఘటన చోటు చేసుకుంది. పాము కు భయపడి ఆ వ్యక్తి తన ఇల్లు వదిలి తన మామ ఇంట్లో ఉంటున్నప్పటికీ ఆ పాము అతనిని వదలలేదు. దాంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. వికాస్ దూబే అనే వ్యక్తి నెలన్న వ్యవధిలో ఆరు సార్లు పాము కాటుకు గురయ్యాడు. జూన్ 2 న రాత్రి 9 గంటలకు మంచం మీద నుంచి లేస్తూ కాలు కింద పెట్టగానే అతనిని మొదటి సారీ పాము కాటు వేసింది. రెండు రోజులు ప్రైవేట్ నర్సింగ్ హోమ్ లో చికిత్స తర్వాత అతను కోలుకొని ఇంటికి తిరిగి వచ్చాడు. ఇది ఒక సాధారణ ఘటన అని అతని కుటుంబసభ్యులు భావించారు. అయితే జూన్ 10 న మళ్ళీ అతనిని పాము కాటు వేసింది. చికిత్స తర్వాత మళ్ళీ కోలుకున్న వికాస్ కు మనసులో పాముల భయం ఏర్పడింది. ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్న కూడా ఈ సారి మళ్ళీ అతనిని జూన్ 17 న ఇంట్లోనే పాము కాటు వేసింది. మళ్ళీ మూడు రోజుల తర్వాత నాల్గవ సారీ పాము కాటు వేసింది. చికిత్స కోసం అతనిని మళ్ళీ అదే ఆసుపత్రికి తరలించడంతో వైద్యులు కూడా ఆశ్చర్యపోయారు. ఈసారి ప్రాణాలతో బయటపడిన అతను తన బంధువుల సూచించినట్లు రాధనగర్ లోని తన మేనత్త ఇంటికి వెళ్ళాడు. అక్కడ కూడా రాత్రి 10 గంటల సమయంలో మళ్ళీ పాము కాటు వేసింది. మళ్ళీ చికిత్స నుంచి కోలుకున్న తర్వాత అతను మాల్వా పోలీస్ స్టేషన్ పరిధిలోని తన మామ సంతోష్ దూబే ఇంటికి వెళ్ళాడు. అయితే జులై 6 తేదీన మధ్యాహ్నం మళ్ళీ తన మామ ఇంట్లో పాము ఆరో సారీ కాటు వేసింది. ఆసుపత్రిలో చేరిన అతను చికిత్స తర్వాత కోలుకొని ఇంటికి వెళ్ళాడు. అయితే ప్రతి సారీ తనను పాము శని, ఆది వారాల్లో కాటు వేస్తుందని అతడు చెప్పుకొచ్చాడు. ప్రతి సారి అతని ఒంటిపై పాము కాటువేసిన కొత్త గుర్తులు ఉంటున్నాయని వైద్యులు తెలిపారు. పాము కాటు వేసిన ప్రతి సారీ అతనికి యాంటీ స్నేక్ వెనం ఎమర్జెన్సీ మందులు ఇస్తున్నామని వైద్యులు తెలిపారు.

# స్కిల్ యూనివర్సిటీ అడుగులు




**హైదరాబాద్, జూలై :** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడం.. నైపుణ్యం మెరుగుపర్చడమే లక్ష్యంగా స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్ణయించింది. యుద్ధప్రాతిపదికన వీటిని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల ప్రాంగణాల్లోనే ఈ స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా అటు ఐటీ కంపెనీలతోపాటు ఇటు పరిశ్రమలన్నింటికీ అందుబాటులో ఉంటుందన్న యోజనలో సర్కార్ ఉంది. ఇక స్కిల్ యూనివర్సిటీలో ఏయే కోర్సులు అందుబాటులో ఉండా లి. ఎలాంటి పాఠ్యాంశాలు ఉండాలి.. పరిశ్రమల అవసరాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా యువతకు అవకాశాలు దక్కేలా ఏయే కోర్సులు నిర్వహించాలో అధ్యయనం చేయాలని నిర్ణయించింది. జూలై 23 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి. ఈలోపే స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని పరిశ్రమలు, విద్యాశాఖల అధికారులకు ప్రభుత్వం సూచించింది. ఇందుకు అవసరమైన సహకారం అందించాలని పారిశ్రామిక రంగ ప్రముఖులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రతిపాదనలు వచ్చిన 24 గంటల్లోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఈమేరకు గచ్చిబౌలిలో ఇంజినీరింగ్ స్టాఫ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అధికారులు, పారిశ్రామిక ప్రముఖులు పాల్గొన్నారు. స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుపై అభిప్రాయాలు సేకరించారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఐఎస్‌బీతరహాలో ఒక బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశానికి వచ్చిన అధికారులు, పారిశ్రామిక ప్రముఖులను తాత్కాలిక బోర్డు సభ్యులుగా భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఆర్థికపరమైన అంశాలపై భట్టి విక్రమార్కతో, కరికులమ్, కోర్సులకు సంబంధించి మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించాలని సూచించారు. స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుకు 15 రోజులే గడువు ఉన్నందున తాత్కాలిక బోర్డు ప్రతీ ఐదు రోజులకు ఓసారి సమావేశం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలా లేక ప్రభుత్వమే బాధ్యతలు చేపట్టాలా అనే అంశంపై కూడా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. యూనివర్సిటీల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు, ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేసేందుకు నిపుణులను సంప్రదించాలని తెలిపారు.

# రైతు బంధు పేరుతో రియల్ వ్యాపారులకు పన్నారం



**మెదక్, జూలై :** ఆరుగాలం శ్రమించే రైతులను నిండా ముంచారు. అబద్దాలతో అరచేతిలో వైకుంఠం చూపించి వారి భూములను కారుచౌకగా కొట్టేశారు. ఇలా సేకరించిన వేలాది ఎకరాల భూమిని అందమైన బ్రోచర్లు, కనువిందు చేసే ప్రాజెక్టు వీడియోలతో గుంటల లెక్కన ఫామ్‌లాండ్స్‌గా మార్చి మధ్యతరగతికి అంటగట్టేశారు. మొక్కల పెంపకం, రిసార్ట్స్ నిర్మాణం అంటూ మాయమాటలు చెప్పి వేలకోట్లు కూడబెట్టుకున్నారు. ఇదంతా ఒకెత్తయితే.. పేద రైతులకు పంట పెట్టుబడిగా తెలంగాణ ప్రభుత్వం ఇస్తు?న్న రైతు బంధు లక్ష్యానికి తూట్లు పొడుస్తూ.. ఆ సాయాన్ని అనర్హులకు అందేలా చేసి ప్రభుత్వ ఖజానాకు చిల్లుపెట్టారు. జనతా, న్యూ లీఫ్ ఎకో ఫామ్స్, క్రీక్ సైడ్ ఫామ్ ల్యాండ్, గ్రీన్ వ్యాలీ, నీమ్స్ బోరో, జీఎస్ఆర్‌న్యా.. ఒక్కటేమిటి.. ఇలా వందలాది కంపెనీలు, ఆ కంపెనీల వెనక కొందరు రాజకీయ ప్రముఖులు చేస్తున్న చీకటి వ్యాపారంతో .. నేటికీ రైతుబంధు పథకం నిర్వీర్యం అవుతూనే ఉంది. జహీరాబాద్ పార్లమెంటు స్థానం నుంచి బీఆర్ఎస్ తరపున ఎంపీగా గెలిచిన బీబీ పాటిల్.. గతంలో ఇక్కడ మెగా ఫుడ్ ప్రాజెక్టు పేరుతో పేద రైతుల భూములను కారుచౌకగా కొట్టేశారు. ముఖ్యంగా కర్ణాటక ? తెలంగాణ సరిహద్దులోని రైతుల నుంచి ఈయన గారు సుమారు 500 ఎకరాల భూమిని ఎకరం రూ. 10 వేల మొదలు లక్ష రూపాయల లెక్కన కొనుగోలు చేశారు. తెలంగాణలో ఎక్కడైనా పది లక్షల లోపు భూమి దొరకటం కష్టంగా ఉన్న ఈ రోజుల్లో నిరుపేదలను మాయచేసి వారి భూముల రిజిస్టర్ చేయించుకున్నారు. తర్వాత అక్కడ మెగా ఫుడ్ ప్రాజెక్టు రాకపోవటంతో నాటి ఎంపీ మీద తీవ్రంగా వ్యతిరేకత వచ్చింది. అంతేకాదు.. తమ భూములను కారుచౌకగా కొట్టేసి, ఆయన వ్యాపారం చేసుకుంటున్నారనే అసలు వాస్తవమూ బయటికి వచ్చింది. పేద రైతుల భూములను పెద్దల పరం కావటంలో బ్రోకర్ కనకరాజు చక్రం తిప్పాడు. బీబీ పాటిల్, నారాయణ్ ఖేడ్ సమీప ప్రాంతంలో పదుల సంఖ్యలో ఫామ్‌లాండ్స్ కంపెనీలు వేలాది ఎకరాలు కొనుగోలులో ఇతగాడి పాత్ర ఉంది. జోగిపేట- నారాయణఖేడ్ మధ్యలోని ఓ కుగ్రామంలో పుట్టి, సాధారణ రియల్ ఎస్టేట్ బ్రోకరుగా జీవితాన్ని ప్రారంభించిన కనకరాజు.. బ్రోకరిజానికి కొత్త అర్థాలు నేర్పాడు. కొవిడ్ తర్వాత నగర శివారులో ఫామ్‌లాండ్స్, ఫామ్‌హౌస్ కల్చర్ పెరగటంతో దీనిని కనకరాజు కొత్త వ్యాపారసూత్రంగా మలచుకున్నాడు. పెద్దలు కారుచౌకగా కొనుగోలు చేసిన భూములను.. గుంటల లెక్కన అమ్మటానికి రంగం సిద్ధం చేశాడు. అందమైన లేవుట్స్, కన్నుచెదిరే వీడియోలు తీయించి.. ఎకరం లక్షకు కొన్న భూములను 5 గుంటలు.. 2 లక్షల లెక్కన మార్కెటింగ్ ఏజెంట్లను పెట్టి అమ్మించాడు. ఇందులో మొక్కలు పెంచుతామని, అది అదనపు ఆదాయమని నమ్మబలకటమే గాక.. రైతుబంధు, రైతుబీమా సాయం అందిస్తామని ప్రచారాన్ని జోరుగా చేశారు. అంతేకాదు.. పెద్దల భూములు అమ్మే క్రమంలో లీగల్ సమస్యలు రాకుండా కనకరాజు తీసుకున్న జాగ్రత్తలు చూస్తే.. మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. రసీదుల మీద ఉండే అడ్రస్‌లు, కాగితాల మీద ఉండే పేర్లు అతగాడి ముందుచూపుకు నిదర్శనం. మొత్తానికి ఇటు కమిషన్లు, అటు పెద్దల దగ్గర పొందిన వ్యాపార వాటాలతో ఒకనాటి ఏజెంట్ కనకరాజు.. నేడు కోట్లకు పడగలెత్తేశాడు. నారాయణ్ ఖేడ్ సమీప ప్రాంతాల్లో పదో తరగతి చదివి ఖాళీగా ఉన్న నిరుపేద విద్యార్థులను టార్గెట్ చేసుకున్న కనకరాజు.. వారికి ఉద్యోగాలిస్తానంటూ పిలిపించి నిలువునా ముంచినవైనమూ ఇప్పుడు బయటికి వస్తోంది. ఇలా వచ్చిన విద్యార్థుల్లో మేజర్లను గుర్తించి, వారి పేరు మీద భూములు రిజిస్ట్రేషన్ చేయించి, తర్వాత చెక్ బౌన్స్ వంటి ఏదైనా లీగల్ సమస్యలు వస్తే.. సడన్‌గా కనకరాజు ముఖం చాటేసేవాడు. ఉద్యోగమని పోయి.. తర్వాత కేసుల్లో ఇరుక్కుని ఎందరో యువకులు కోర్టులకు తిరగాల్సిన దుస్థితి. అంతేకాదు.. ఈ యువకులు రోజంతా తిరిగి పబ్లిసిటీ చేసినా నెలాఖరు జీతాలు మాత్రం ఇచ్చేవాడు కాదు. ఇదేంటని నిలదీసిన వారికి రూపాయి కూడా ఇవ్వకుండా పంపేశాడు.

# కవితకు బెయిల్ ఎప్పుడు



హైదరాబాద్, జూలై : మరో 3 రోజుల్లో 4 నెలలు అవుతుంది. లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ, మాజీ సీఎం కేసీఆర్ కూతురు కవిత అరెస్టై. బెయిల్ పిటిషన్లు, కస్టడీ పిటిషన్లు.. విక్టరీ సింబల్స్, మీడియాకు లేఖలు.. ఇలా జరిగిపోతూనే ఉన్నాయి. కవిత తీహార్, రౌజ్ అవెన్యూ కోర్టు మధ్య చక్కర్లు కొడుతూనే ఉన్నారు. కల్వకుంట్ల కవిత లిక్కర్ స్కాం కేసులో అరెస్టై 116 రోజులైంది. ఇప్పటి వరకు భర్త అనిల్ కుమార్, అన్న కేటీఆర్, హరీష్ రావు సహా అనేకమంది కుటుంబ సభ్యులు.. కవితను కలిసేందుకు ఢిల్లీకి వెళ్లారు. కానీ కేసీఆర్ మాత్రం ఒక్కసారి కూడా వెళ్లలేదు.. కానీ కూతురు కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆమె జైల్లో ఉండి వంద రోజులు దాటి 15 రోజులైంది. దీంతో జైల్లో మగ్గిపోవాల్సి రావడంతో కవిత ఉక్కిరిబిక్కిరవుతున్నట్టు తెలుస్తోంది. కుటుంబ సభ్యుల తీరుపైనా ఆమె ఆగ్రహంతో ఉన్నారట. ఎవరూ తనను పట్టించుకోవడం లేదని కోపంతో ఉన్నారట. అంతేగా మరి.. మొన్నటి వరకు.. ఎన్నికలు, ఆ తర్వాత పరిణామాలతో ఇక్కడి బీఆర్ఎస్ హడావుడిగా ఉంది. కేటీఆర్ కవిత వంక చూసింది లేదు. తీరా అన్ని పనులు ఇక్కడ చక్కబెట్టుకోని ఢిల్లీ పయనమయ్యారు. ఓ రెండు, మూడు సార్లు కవితను చూశారు కేటీఆర్, హరీష్ రావు. ఇప్పుడిక కవిత బెయిల్ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇన్ని రోజులు జైలు జీవితం గడపడంతో కవిత ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నట్టు సమాచారం. అందుకే ఆమెను ఎంత తొందరగా వీలైతే.. అంత త్వరగా బయటికి తీసుకురావాలని చూస్తున్నారు. అందుకే లాయర్లతో మాట్లాడేందుకు ఢిల్లీ పయనమైనట్టు పైకి చెబుతున్నారు. కానీ లోలోపల కమలం నేతలతో బేరసరాలకు వస్తున్నట్లు సైతం టాక్ వినిపిస్తోంది. కానీ ఇన్నిసార్లు కోర్టు చుట్టూ తిరిగిన కవిత బయటకు రాలేదు. పైగా ఓ వైపు ఈడీ కవితకు బెయిల్ రాకుండా గట్టిగానే ప్రయత్నిస్తోంది. ఇటువైపు హరీష్ రావు, కేటీఆర్ ప్రయత్నాలు లాయర్ల కోసమే అంటే.. కేజ్రీవాల్ కే రాని బెయిల్ కవితకు కష్టమే అన్న వాదన వినిపిస్తోంది. సరే వీరిద్దరి ప్రయత్నాలు కాస్త పక్కకు పెడితే.. కూతురి కోసం తండ్రి వర్రీ అవుతున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఇప్పటికిప్పుడు తెరపైకి వచ్చింది కాదు. ఎన్నో ఏళ్లుగా నడుస్తున్న పంచాయితీ. కానీ అప్పుడు, ఇప్పుడు .. అంటే సీఎంగా ఉన్నప్పుడూ.. మాజీగా మారాక కూడా దీనిపై కేసీఆర్ స్పందించలేదు. కానీ లోలోపల కూతురు కోసం టెన్షన్ పడుతూనే ఉన్నారు. ఎన్నికల సమయంలో దాదాపు బహిరంగసభలు నిర్వహించారు కేసీఆర్. కానీ పల్లెత్తు మాట కూడా ఈ టాపిక్‌పై మాట్లాడలేదు. కనీసం బీజేపీ కక్ష పూరితంగా తన కూతురును కేసులో ఇరికించింది. అనే డైలాగ్ కూడా ఆయన నోటి నుంచి రాలేదు. నిజానికి ఈ అంశాన్ని తన పొలిటికల్ మైలేజ్‌కు వాడుకోవచ్చు.. కానీ అలా జరగలేదు. ఇప్పుడేమో ఏకంగా అరెస్ట్ చేసి జైల్లో వేసింది ఈడీ.. ఇప్పుడు కనీసం ఢిల్లీకి వెళ్లి పరామర్శించలేదు. అయితే దీనికి గల కారణాలు అనేకం కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ సర్కిల్స్‌లో అయితే ఓ ప్రచారం జోరుగా జరుగుతోంది. కవిత ఇలాంటి స్కామ్‌కు తెరలేపారన్న విషయం చాలా ఆలస్యంగా కేసీఆర్‌కు తెలిసిందన్న టాక్ వినిపిస్తోంది. సంతోష్‌రావు, కవిత డైరెక్షన్‌లోనే ఈ దందా కొనసాగినట్టు కథలు వినిపిస్తున్నాయి. అందుకే కేసీఆర్ కవితపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు ఎన్నికల ముందు ప్రచారం జరిగింది. మన తెలుగువారు మాములుగానే మహిళలు వ్యాపారాలు చేయడాన్ని డైజెస్ట్ చేసుకోలేరు. అలాంటిది కవిత ఇలాంటి లిక్కర్ దందాలో దిగడాన్ని కేసీఆర్ అస్సలు ఊహించలేదని టాక్. మేము ఈ విషయాలను కన్ఫర్మ్ చేయడం లేదు. జస్ట్ జరుగుతున్న ప్రచారాన్ని మీ ముందు పెడుతున్నాం అంతే. ఈ కారణంగానే కేసీఆర్ ఈ అంశంపై మౌనాన్ని పాటిస్తున్న కూతురుపై టెన్షన్ పడుతున్నారు అనేది క్లియర్. ఈడీ కావొచ్చు.. సీబీఐ కావొచ్చు.. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కింగ్‌పిన్ కవితే అంటున్నాయి. ఆధారాలు చూపిస్తున్నాయి. ఈ విషయాలను కోర్టు బలంగా నమ్ముతుంది కాబట్టే ఆమెకు బెయిల్ కూడా రావడం లేదు. ఈ టైంలో లాయర్లతో ఇది అయ్యే పనేనా అనే టాక్ నడుస్తోంది. మరీ బెయిల్ వస్తుందని కేటీఆర్ అంత ధీమాగా ఎలా ఉన్నారు..?

# కండక్టర్ కు సజ్జనార్ ఫిదా



**హైదరాబాద్, జూలై :** తెలంగాణ ఆర్టీసీలో నిబద్ధతతో పని చేసే ఉద్యోగులను సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ఎల్లప్పుడూ గుర్తిస్తూనే ఉంటారు. స్ఫూర్తిదాయక ఉద్యోగుల గురించి సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు షేర్ చేస్తూ ఉంటారు. కొన్నిసార్లు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించడం, సత్కరించిన సందర్భాలు కూడా ఉన్నాయి. తాజాగా ఓ మహిళా కండక్టర్ గురించి సజ్జనార్ కు తెలిసింది. సిద్ధార్థ సుభాష్ చంద్రబోస్ అనే వ్యక్తి తనకు ఆ కండక్టర్‌తో ఎదురైన అనుభవాన్ని ఫేస్‌బుక్ లో పోస్టు చేయగా.. దాన్ని సజ్జనార్ గుర్తించారు. "టీజీఎస్‌ఆర్టీసీ కండక్టర్ అనుపమ పనితనం గురించి ఫేస్‌బుక్ లో అద్భుతంగా రాసుకొచ్చారో నెటిజన్. ప్రయాణికులను తమ కుటుంబ సభ్యుల్లాగానే ఆర్టీసీ సిబ్బంది భావిస్తారని చెప్పడానికి ఈ పోస్టే నిదర్శనం. నిత్యం పని ఒత్తిడిలోనూ 'ఆడుతూ పాడుతూ పని చేస్తుంటే.. అలుపుసొలుపేం ఉన్నది' అంటూ సిబ్బంది తమ వృత్తి పట్ల అభిరుచిని కనబరుస్తుండటం గొప్ప విషయం. ఏ వృత్తి అయినా రొటీన్ కి భిన్నంగా ఆస్వాదిస్తూ పని చేస్తే ఎంత ఒత్తిడి అయినా ఇట్టే జయించవచ్చు" అని సజ్జనార్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సిద్ధార్థ సుభాష్ చంద్రబోస్ ఓసారి మెహదీ పట్నం నుంచి ఆరాంఘర్ వెళ్లే సిటీ బస్ ప్రయాణంలో అనుపమ అనే కండక్టర్ ను చూశారు. ఆమె డ్యూటీ చేస్తున్న తీరు ఆయన్ను విపరీతంగా ఆకట్టుకుందని తన పోస్టులో రాశారు. "బస్సులో ఎక్కిన ప్రతి ఒక్కరినీ ఆమె కదిలిస్తూనే వుంది మాటల్తో. "ఏరా, దోస్తాన్లని వదిలేసి వచ్చారా.." అని కాలేజీ ఆడ పిల్లల్ని.. "ఏం అక్కా కనిపిస్తలెవ్" అంటూ కూరగాయల గంప ఆడమనిషిని, "ఏం సార్, ఈరోజు ఆఫీసుకి డుమ్మానా?"అని ఉద్యోగిని.. "ఏం పాపా, మా తమ్ముడు తిండి పెట్టలేడా? ఎముకలు బయటపడుతున్నాయి" బక్కచిక్కిన యువతి భుజమ్మీద చెయ్యివేయగానే, "అవును, నా తిండికూడా ఆయనే తింటున్నడు" అని రిటార్టు రాగానే, "నేను ఇంటికొచ్చి చెప్తాలే.."మాట పూర్తికాక మునుపే.." ఈ ముచ్చట ఇంకెన్ని రోజులు చెప్తవ్, ఎప్పుడన్నా వచ్చినవా, చెప్పడమే గానీ" నిష్టూరమాడిందా యువతి. "బిడ్డా, చిన్నా, బేటా.." ఇలా పలకరింపులతోనే కాలేజీ పిల్లల్ని పలకరిస్తోంది, ఎక్కేవాళ్లు విష్ చేయడం, దిగేవాళ్లు "పోతానక్కా" అనేవాళ్లు, దిగాక రోడ్డు మీద నుండి కిటికీలోకి చేయి వూపేవాళ్ళూ.. ఎంత గొప్ప అదృష్టవంతురాలీమె అనుకున్నా. ఉర్దూ, తెలుగు, ఇంగ్లిష్ కలగలిసిన ఆమె మాటలు, వాటిని ఒక చోట చేర్చి కట్టే మాటల మాలలో కనిపించని దారంలాంటి ప్రేమ.. నన్ను చకితుడిని చేసింది. పూలగంపతో ఎక్కిన పూలమ్ముకునే స్త్రీ, బుట్ట తెరిచి ఆప్యాయంగా నాలుగైదు రోజా పూలు చేతికందించగానే, అక్కడే ఒక పువ్వు తాను జడలో గుచ్చుకుని, కొంచెం వెనక్కి వచ్చి మిగతా వాళ్లకిచ్చేసింది, "ఇంగ ఇంటికి యాడ తీస్కపోతం మేడం" నా సహచరికి ఒక పువ్వు చేతికందిస్తూ, తన జడలో పువ్వై నవ్వింది" అని సిద్ధార్థ సుభాష్ చంద్రబోస్ తన అనుభవాన్ని తన పోస్టులో రాశారు.

# పిల్లల ఎదుగుదలకు పల్లీలు




రోజుకో గుప్పెడు పల్లీలు తినండి.. ఆరో గ్యంగా ఉండండి.. అంటున్నారు ఆరోగ్య నిపుణులు. వేరుశెనగపప్పు ఆరోగ్యా నికి మంచిదని అందరికీ తెలిసిన విషయమే. ఇందులో ఎక్కువగా మెగ్నీషియం, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. వీటిల్లోని మోనో శాచ్యురేటెడ్ కొవ్వు గుండెకు మంచిది. శరీరానికి మేలుచేసే యాంటీ ఆక్సిడెంట్లు ఇందులో ఎక్కువ. విటమిన్ ఇ, నియాసిన్, ప్రోటీన్, మాంగనీసు వేరుశెనగల్లో అధికం. అలాగే అమినో యాసిడ్స్ కూడా ఎక్కువ. యాంటీఆక్సి డెంట్స్ గుండె సంబంధిత వ్యాధులను తగ్గిస్తే, ఇందులో ఉండే ప్రోటీన్‌లు కణాలు, కణజాల మరమ్మత్తులు చేసి కొత్త కణాలు ఏర్పడేలా చేస్తుంది. ఫ్రీరాడికల్స్ ఏర్పడకుండా కాపాడుతుంది. పిత్తాశయంలో రాళ్ళు ఏర్పడకుండా నివారిస్తుంది. డిప్రెషన్‌ను తగ్గిస్తాయి. వేరుశెనగపప్పులోని అమినో యాసిడ్స్ మెదడు నాడీకణాలకు సంబంధించిన కెరోటినిన్ ఉత్పత్తి చేస్తుంది. అది మన మెదడు సక్రమంగా పనిచేయడానికి సహాయపడుతుంది. కొలెస్ట్రాల్ ను తగ్గిస్తుంది. ఇన్ఫెక్షన్స్ తో పోరాడుతుంది. పల్లీల్లోని విటమిన్స్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. పల్లీల్లో క్యాల్షియం పుష్కలంగా ఉంటుంది. వీటిలోని కాల్షియమ్, విటమిన్ 'డి' లు ఎముకపుష్టికి దోహదపడతాయి. ప్రతి వందగ్రాముల వేరుశెనగల్లో 8 గ్రాముల విటమిన్ 'ఇ' ఉంటుంది. వీటిలో ప్రోటీన్లు అధికంగా ఉండడం వల్ల ఎదిగే పిల్లలకు వీటిని మంచి పోష కాలుగా అందించవచ్చు. ఫలితంగా పిల్లల్లో ఎదుగుదల బాగుంటుంది. అలాగే వీటిలో ఉండే ఆమ్లాలు పొట్టలో క్యాన్సర్ కారకాలు పేరుకోకుండా వాటిని అదుపులో ఉంచుతాయి. మన రోజువారీ అవసరాలకు కావాల్సిన 86 శాతం నియాసిన్‌ను పల్లీలే అంది స్తాయి. కాబట్టి రోజుకో గుప్పెడు పల్లీలను తినడం అలవాటు చేసుకుంటే మీరు ఆరోగ్యంగా ఉండొచ్చునని న్యూట్రీషన్లు సలహా ఇస్తున్నారు.

# మెరిపించే బీట్‌రూట్



ఎర్రటి బీట్‌రూట్‌లో ఎ, బి, సి విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. క్యాల్షియం, ఫాస్ఫరస్, పొటాషియం, మెగ్నీషియం, ఫోలిక్ ఆమ్లం వంటి పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ అందాన్ని కాపాడటంలో కీలకంగా పనిచేస్తాయి. బీట్‌రూట్ రసాన్ని రోజూ తాగితే రక్తశుద్ధి జరుగుతుంది. దీన్లోని యాంటీ ఆక్సిడెంట్లు ఒత్తిడిని తగ్గిస్తాయి. దాంతో చర్మం నిగారింపు పొందుతుంది. బీట్‌రూట్‌ని మిక్సీలో వేసి మెత్తని గుజ్జుగా చేయాలి. దానికి కప్పు ఓట్‌మీట్, చెంచా తేనె, రెండు చుక్కల నిమ్మరసం కలపండి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా వేసి, ఇరవై నిమిషాల తరువాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రపరచుకోండి. ఇలా తరచూ చేస్తుంటే దుమ్మూధూళీ ప్రభావం చర్మంపై ఉండదు. చర్మ గ్రంథులు శుభ్రపడతాయి. మచ్చలూ ముడతలూ వంటివి తగ్గుముఖం పట్టి చర్మం తాజాగా కనిపిస్తుంది.జుట్టు తెల్లబడిందనో, లేక చక్కని రంగు కావాలనిపించో, రసాయనాలతో కూడుకునన కృత్రిమ రంగుల్ని వాడుతుంటారు చాలా మ ంది. వీటివల్ల జుట్టు పాడైపోతుంది. ఇలాంటప్పుడు గోరింటాకు పొడిలో రెండు చెంచాల బీట్‌రూట్ పౌడర్‌ని కలపాలి. ఈ రెండింటిని టీ డికాక్షన్‌లో రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే తలకు రాసుకుంటే జుట్టు చక్కని రంగులోకి మారుతుంది. ఆరోగ్యంగా ఎదుగుతుంది. బీట్‌రూట్ రసంలో చెంచా నిమ్మరసం కలిపి తలకు పట్టించినా ఫలితం ఉంటుంది.పెదాలు నల్లగా, గరుకుగా ఉండి ఇబ్బంది పెడుతుంటే.. బీట్‌ఋట్ రసంలో కొంచెం తేనె కలిపి పెదాలకు రాసుకోండి. నాలుగైదు నిమిషాల తరువాత చన్నీళ్లతో కడగాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే నలుపు తగ్గుతుంది.

## జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరిచే ఫైబర్ ఫుడ్స్



ఏది పడితే అది తిని చాలా మంది జీర్ణంకాక ఇబ్బంది పడుతుంటారు. కొంతమందికి ఏది తిన్నా జీర్ణం కాదు. ఆహారం అరగడానికి మందులు వాడివాడి అలసిపోతారు. అయినా ప్రయోజనం ఉండదు. అలాంటి వారు ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని చెబుతున్నారు నిపుణులు. ఫైబర్ వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. ఫైబర్‌ని పుష్కలంగా కలిగి ఉండే కొన్ని ఆహార పదార్థాలను చూద్దాం. పచ్చి బఠానీలు, బీన్స్ వంటి కూరగాయల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. పచ్చి బఠానీలను నానబెట్టి ఉడికించుకుని ప్రతిరోజూ ఉదయాన్నే తీసుకుంటే అజీర్తి సమస్య తగ్గుతుంది. బీన్స్‌ను కూరల్లో వేసే కంటే వేపుడు చేసుకుని తింటే వాటిలోని విటమిన్స్ జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయి. క్యారెట్‌లో కూడా శరీరానికి అవసరమైనంత ఫైబర్ లభిస్తుంది.వంద గ్రాముల క్యారెట్స్‌లో 2.9 గ్రాముల ఫైబర్ ఉంటుంది. కాబట్టి ప్రతిరోజూ క్రమం తప్పకుండా క్యారెట్‌ను పచ్చిగా తింటే మంచిది. అలానే పాలకూర, దీనిలోని విటమిన్ ఏ, బి, సి, కె, మెగ్నీషియం, ఐరన్, క్యాల్షియం, పొటాషియం, ఫైబర్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది అజీర్తిని తొలగిస్తాయి. పాలకూరను కూరగా తీసుకునేందుకు పిల్లలు, పెద్దలు అంతగా ఇష్టపడరు. అందువల్ల దీనిని సూప్‌గా తయారుచేసుకుని తీసుకుంటే అనారోగ్య సమస్యలు దరిచేరవని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. పాలకూరను ఉడికించుకుని ఆ రసంలో కొద్దిగా ఉప్పు, కూరగాయలు వేసుకుంటే సూప్ తయారవుతుంది.

## సంతానం కావాలా .. అయితే వీటిని తినాల్సిందే..?


అంజిరా ఆరోగ్యానికి మంచి ఔషధంగా పనిచేస్తుంది. తరచు దీనిని తీసుకోవడం వలన జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. అంజీరపండులో విటమిన్స్, పీచు పదార్థాలు వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరరానికి కావలసిన పోషక విలువలను అందిస్తాయి. బరువు తగ్గాలనుకునే వారికి అంజీర మంచి టానిక్‌లా పనిచేస్తుంది. అంజీరలోని మరికొన్ని ప్రయోజనాలు తెలుసుకుందాం..కప్పు అంజీర పండు ముక్కల్ని భోజనానికి ముంది తీసుకోవడం వలన పొట్ట తొందరగా నిండిపోతుంది. దాంతో అతిగా తినే సమస్య తగ్గుతుంది. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. అజీరపండు తింటే.. శరీరంలో రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. దాంతోపాటు హిమోగ్లోబిన్ స్థాయిలు కూడా పెరుగుతాయి. రక్తహీనత ఉన్నవారు నిత్యం అంజీర తింటే మంచిది. నోటి దుర్వాసనకు చెక్ పెట్టాలంటే.. రాత్రివేళ నిద్రక ఉపక్రమించే ముందు రెండు అంజీర పండ్లను తింటే సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది. అంజీర పండు తింటే విటమిన్ ఎ, బి, బి12 అధిక మొత్తంలో లభ్యమవుతాయి. ఎముకలను దృఢంగా చేస్తాయి. పిల్లలు లేనివారు, పిల్లల్ని కనాలనుకుంటున్నవారు నిత్యం ఆహారంతో పాటు అంజీరను కూడా తినాలి. ఇందులోని జింక్, మెగ్నిషియం, మాంగనీస్ వంటి ఖనిజాలు సంతాన సాఫల్యతను పెంచడానికి సహకరిస్తాయి. రోజూ ఈ పండుని ఉదయం, రాత్రివేళ తింటే మలబద్దకం సమస్య దూరం చేస్తుంది. ఇప్పటి వేసవికాలంలో ఏర్పడే శరీర వేడిని తగ్గించడానికి ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. అయినా కూడా తేడా కనిపించలేదా.. అయితే.. కప్పు అంజీర పండ్లు రోజూ తినండి.. తప్పక ఫలితం ఉంటుంది. అంజీర పండులో శరీర ఎనర్జీని పెంచే పోషకాలు అధిక మోతాదులో ఉన్నాయి.

# స్త్రీ - పురుషలకు హార్మోన్ల ఉత్పత్తి కి కొలెస్ట్రాల్



అమ్మో ఇంత నూనే.? నాకొద్దు అమ్మా.. ఒంట్లో కొవ్వు పెరిగిపోతుంది. అని చాలామంది అంటుంటారు. కానీ కూరలో కాస్త నూనె తగ్గితే రుచి తగ్గిందని బాధపడతారు. అయితే ఒక గ్రాము నెయ్యిలోనూ నూనెలోనూ 9 కెలోరీల శక్తే ఉంటుంది. ఈ విషయంలో ఎటువంటి తేడా ఉండదు. కొలెస్ట్రాల్ పెరుగుతుందనో.., బరువు పెరుగుతామనో... చాలా మంది నూనె వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని చూస్తారు. ఎక్కువ నూనెలు తీసుకోవడం శరీరానికి ఎంత హాని చేస్తుందో అసలు తీసుకోక పోవడం కూడా అంతే ప్రమాదకరం. మనం తీసుకునే నూనె వల్ల శరీరంలో కొవ్వు పెరుగుతుంది. తగిన మోతాదులో కొవ్వు లేకపోతే కష్టమే. నూనె ఏమోతాదులో అవసరమో ఒకసారి చూద్దాం. నూనె నుంచి వచ్చే కొవ్వు మనం తీసుకునే విటమిన్లను శరీరానికి పట్టేలా చేస్తుంది. విటమిన్ ఎ, డి, ఇ, కేలు శరీరానికి ఉపయోగపడాలంటే నూనెలు తీసుకోవాల్సిందే. స్త్రీ పురుష లైంగిక హార్మోన్ల ఉత్తపత్తి కావాలంటే కొలెస్ట్రాల్ కావాలి. అందెకు నూనెలు తప్పనికరి. శరీరం నుంచి ఉష్ణోక్షిగత బయటకు పోకుండా కొవ్వులు శరీర ఉష్ణోక్షిగత ను సమతులంగా ఉంచుతాయి. కొత్తగా కణాలు ఏర్పడాలంటే కొవ్వులు అవసరం. లేదంటే శరీరంలో పెరుగుదల, అభివృద్ధి సరిగా జరగదు. ఆయిల్‌తో నష్టమా? ఏ నూనెలోనూ కొలెస్ట్రాల్ ఉండదు. సంతృప్త కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా ఉన్న నూనెలు తీసుకుంటే కొవ్వు ఆమ్లాలు కొలెస్ట్రాల్‌గా మారుతాయి. తగిన మోతాదులో తీసుకోవాలి. అయితే నూనె ఎక్కువైతే ప్రమాదం. మళ్లీమళ్లీ మరిగించొద్దు పిండివంటలు చేసినపుడు మిగిలిన నూనెను మళ్లీమళ్లీ వేడి చేసి ఉపయోగిస్తాం. అలా చేయడం వల్ల శరీరానికి నష్టం కలిగించే ఎల్ఎల్ కొపుస్ట్రాల్ రక్తంలో ఎగిరిపోతుంటుంది. ఈ ఎల్‌డిఎల్ కొలెస్ట్రా ల్ అధికమవడం వల్ల గుండెలోని రక్త నాళాలలో రక్త ప్రవామానికి ఆటంకం కలిగి గుండెపోటుకు దారి తీస్తుంది. మిశ్రమం మంచిది ఒకే రకమైన నూనె వంఏట రెండు మూడు కలిపి వాడటం మంచిది. ఉదాహరణకు సన్‌ఫ్లవర్ ఆయిల్ ఎఉకవగా తీసుకోవడం వల్ల ఎన్-6/ఎన్-3 నిష్పత్తులలో తేడాలు వస్తాయి. ఫలితంగా ఒమెగా-3 ఒమెగా-6(ఎన్-6) ఎక్కువవుతోంది. ఫలితంగా రక్తం చిక్కగా అవుతుంది. రక్తనాళాలు సన్నబడి పోతాయి. సోయా బీన్ ఆయిల్, రిఫైన్డ్ వేరుశనగ నూనె, రైస్ బ్రాన్ ఆయిల్ లేదా సన్ ఫ్లవర్ ఆయిల్ ఈ మూడు నూనెలు ఒకదానితో ఒకటి కలిపేసి ఈ మిశ్రమ ఆయిల్ వాడడం వల్ల శరీరానికి అవసరమైన ఫ్యాట్స్ సమపాళ్లలో అందుతాయి. ఆలివ్ ఆయిల్ బెస్ట్ ఒమేగా 3 ఎక్కువగా ఉన్న నూనెలను వాడడం వల్ల చాలా వరకు సమస్యలను నివారించవచ్చు. లినోలిక్ ఆమ్లం మాతరం అన్ని ఆయిల్స్‌లో ఉన్న ఒమేగా 3 మాత్రం ఉండదు. ఈ రెండు సరైన మోతాదులో పొందాలంటే ఒకేరకమైన ఆయిల్‌ను వాడకపోవడం మంచిది. ఒమేగా 3 ఆలివ్ నూనెలో ఎక్కువగా ఉంటుంది. అది వాడలేం కాబట్టి రిఫైన్ చేసిన వేరుశనగ నూనె ఉత్తమం అని నిపుణులు చెబుతున్నారు. ఒమెగా 3 సక్రమంగా తీసుకోవడం వల్ల రక్తం చిక్కబడకుండా ఉంటుంది. రక్తపోటును నివారిస్తుంది. కీళ్ల నొప్పులు, గుండె జబ్బుల్ని నివారిస్తుంది. గుండెలో మంట లేకుండా చేస్తుంది. పైగా ఆలివ్ ఆయిల్‌లో సంతృప్త ఫాటీ ఆమ్లం తక్కువగా ఉండి, మ్యూఫా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఇది అన్నింటికన్నా మంచదనుకోవచ్చు. రైస్ బ్రాన్ అయిల్‌లో 'ఒరైజనోల్' అనే కొలెస్ట్రాల్‌ను తగ్గించే కారకం ఉంటుంది. కాబట్టి ఇతర నూనెలతో పోలిస్తే ఇది మెరుగైనది. ఇంత నూనె కావాలి - ఒక వ్యక్తి రోజుకి 20 గ్రాముల కంటే ఎక్కువ ఆయిల్ తీసుకోకూడదు. అంటే నాలుగు టీ స్పూన్లు చాలన్న మాట. నెలకు ఒక వ్యక్తి 600 గ్రాములకు మించినూనె వాడరాదు. ఐదుగురు ఉన్న ఇంట్లో నెలకు మూడు కిలోలకు మించి నూనె వాడకూడదు నెయ్యి పూర్తిగా మానాల్సిన అవసరం లేదు. మూడున్నర స్పూన్ల నూనె, అర స్పూన్ నెయ్యి వాడితే చాలు. అంతకు మించిన నెయ్యి వాడితే సమస్యలు కొనితెచ్చుకున్నట్లే జాగ్రత్తలు మరిగించిన నూనె చాలా ప్రమాదకరం వాటికి దూరంగా ఉండడమే మంచిది ఎప్పుడూ ఒకే రకమైన నూనెలు కాకుండా మూడు నూనెల మిశ్రమాన్ని వాడడం మంచిది.

# మధుమేహం వస్తే తగ్గించుకోవడం ఎలా?




మధుమేహం వ్యాధి భారినపడితే జీవితాంతం పాటూ మందులు వాడాల్సిందే. మందులు వాడినప్పటికి మనం తీసుకునే ఆహారంలో తగు జాగ్రత్తలు తీసుకోవలసిందే. రక్తంలోని చక్కెర స్థాయిలు పెరుగుతున్నట్లయితే, మొదటగా తీసుకునే ఆహారంలో మార్పులు చేయాలి. మంచి పోషకాహార నిపుణుడిని కలిసి ఆహార ప్రణాళికను రూపొందించుకోండి. నాణ్యమైన మరియు పరిమిత మోతాదులో తినటం వలన అనుకూల ఫలితాలను పొందుతారు. అదనంగా, కార్బోహైడ్రేట్లను తగ్గించి వీటికి బదులుగా ప్రోటీన్లను తీసుకుంటే చాలా మంచిది. మధుమేహ వ్యాధిని తగ్గించే ప్రణాళికలో వ్యాయామాలు ముఖ్యమనే చెప్పాలి. 30 నిమిషాల ఏరోబిక్ వ్యాయామాల వలన రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలు తగ్గటమే కాకుండా, ముఖ్యమైన కణజాలాలను మరింత సున్నితంగా మారుస్తుంది. వ్యాయామాల వలన మధుమేహ వ్యాధి మాత్రమే కాక పూర్తి ఆరోగ్యం మెరుగుపడుతుంది.రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను తగ్గించే అందుబాటులో ఉన్న మరొక సులువైన మార్గం బరువు తగ్గటం. బరువు తగ్గటం వలన ఇన్సులిన్‌కు శరీరం మరింత సున్నితంగా మారుతుంది. కాకరకాయను కూరగా లేదా రసం రూపంలో తీసుకోవటం మధుమేహ వ్యాధిగ్రస్తులు మరియు సాధారణ వ్యక్తుల రక్తంలోని చక్కెర స్థాయిలలో మార్పులు సంభవించవచ్చు. పచ్చని ఆకుకూరలు తినటం వలన ఆరోగ్యానికి చాలా రకాల ఉపయోగాలు ఉన్నాయి. వీటితో పాటుగా మధుమేహం కూడా తగ్గించబడుతుందని కొన్ని పరిశోధనలలో వెల్లడయింది. ఈ పరిశోధనలలో పచ్చని ఆకుకూరలను తినటం వలన మధుమేహం బారి నుండి బయటపడవచ్చని తెలిపారు.

# సహజసిద్ధంగా ముఖంపై నలుపు



### పోగొట్టుకోవడం చాలా ఈజీ..

ముఖంపై నల్లగా ఇబ్బందికరమైన మచ్చలతో చాలామంది సిగ్గుతూ తలదించుకుంటూ ఉంటారు. అయితే ఆ నలుపును అధిగమించవచ్చునంటున్నారు వైద్య నిపుణులు. అదెలాగో చదవండి. శరీర చర్మంతో పోలిస్తే ముఖ చర్మం చాలా ఎక్స్‌పోజ్ అవుతూ ఉంటుంది. దీనివల్ల ముఖంపైన డస్ట్, డిస్టెల్స్, టాన్ వంటివి ఎక్కువగా ఏర్పడతాయి. అలాంటప్పుడు ఇంట్లోనే ఈ చిట్కాలను పాటించవచ్చు. ముఖం కాంతివంతంగా మారాలంటే ఒక టమోటాను సగానికి కట్ చేసి చక్కెరలో డిప్ చేసి తీసుకోవాలి. చక్కెర నేషనల్ ఎక్స్‌పోయేట్‌గా పనిచేసి చర్మంపై ఉన్న డెక్సెయిల్స్, నలుపును చక్కగా తొలగిస్తుంది. ఇలా చక్కెరలో డిప్ చేసిన సగం టమోటాను శుభ్రం చేసిన ముఖానికి బాగా అప్లై చేయాలట. ఐదునిమిషాల పాటు మర్దన చేస్తే చర్మరంధ్రాలు డీప్‌గా క్లీనవుతాయి. ఇలా అప్లై చేశాక మరో పదినిమిషాలు అలాగే ఆగి ఆ తరువాత నార్మల్ వాటర్‌తో కడిగేయాలి. ఇలా స్కబ్ చేసిన తరువాత ఫేస్ ప్యాక్ వేసుకుంటూ ముఖంపై ఉన్న నలుపు, టాన్ తొలగిపోతుంది. ముఖం చాలా క్లీన్‌గా, గ్లోయింగ్‌గా మారుతుంది. ఫేస్ పాక్ ఎలా అప్లై చేసుకోవాలంటే.. ఒక గిన్నెలోకి టీ స్పూన్ శెనగపిండి, అర టీస్పూన్ అలోవీరా జెల్, రెండు టీస్పూన్ల టమోటా రసాన్ని, అర టీస్పూన్ తేనె వేసి బాగా కలవాలి. తిక్ పేస్ట్‌లా తయారుచేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి బాగా అప్లై చేసుకుని 20 నిమిషాల తరువాత కడిగేయాలి. ఇలా టు స్టెప్‌ని పాటించడం వల్ల ముఖంపై టాన్, మృతకణాలు తొలగిపోయి ముఖం చాలా అందంగా, కాంతివంతంగా మెరిసిపోతుంది. ఇలా వారానికి ఒకటిరెండుసార్లు చేస్తే చాలు. ముఖంపైన ఉన్న ఎంతటి నలుపు, మృతకణాలైనా తొలగిపోతాయి. ముఖం చాలా అందంగా కనిపిస్తుంది.

## ఇనుములాంటి దేహం కావాలంటే మినుములు తీసుకోండి..

మినుములు తింటే ఇనుము అంత బలం అని మన ఇంట్లో అంటుంటారు. వీటిలో ఉన్న పోషకాలు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని, అలాగే రకరకాల జబ్బులను నివారిస్తాయని వైద్యులు అంటున్నారు. వంద గ్రాముల మినుముల్లో 18గ్రాముల పీచు(ఫైబర్) ఉంటుంది. ఒక గ్రాము పొటాషియం, రెండు గ్రాముల కొవ్వుతో పాటు విటమిన్ సీ, విటమిన్ బీ- కాంప్లెక్స్‌లోని బీ1,బీ3 వంటివి పుష్కలంగా ఉంటాయి. అలాగే కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్, ఐరన్ కూడా ఎక్కువే. మినుములలో మంటను తగ్గించే యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణం ఉంది. కాబట్టి గాయాలైన వారికి, అవి త్వరగా తగ్గేందుకు మినుములు మంచి ఆహారంగా అందిస్తారు. మినుముల్లో దాదాపు 72 శాతం ఫీచు ఉండటం వల్ల మన జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. జీర్ణ వ్యవస్థకు సంబంధించిన డయేరియా, డిసెంట్రీ వంటి సమస్యలు ఉన్న వారు కూడా మందులకు బదులు మినుములతో చేసిన వంటకాలను తినవచ్చని ఆహార నిపుణులు అంటున్నారు. గుండె జబ్బులను నివారించే అద్భుతమైన గుణం మినుములకు ఉంది. ఇందుకు మినుముల్లో పుష్కలంగా ఉన్న పొటాషియం, పీచుపదార్థాలే కారణం. అవి రక్తంలోకి వెలువడే చక్కెర, కొలెస్ట్రాల్ పాళ్లను గణనీయంగా తగ్గిస్తాయి. పొటాషియం వల్ల రక్తపోటు తగ్గుతుంది. కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగించే గుణం కూడా మినుములకు ఉంది. స్వాభావికమైన పీచుపదార్థం ఎక్కువగా ఉండటం వల్ల డయాబెటిస్ సమస్య ఉన్న వారికి మినుములు మంచి ఆహారం మినుములను ఏ కాలంలో అయినా తీసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.



# మ్యూచువల్ ఫండ్స్ భళా దేశీయ స్టాక్ మార్కెట్ల ఆల్‌టైమ్ హై




ముంబై, జూలై 10 : దేశీయ స్టాక్ మార్కెట్ల ఆల్‌టైమ్ హై పరుగుల నడుమ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)ల్లోకి గత నెల రికార్డు స్థాయిలో పెట్టుబడులు వచ్చాయి. ఈ ఏడాది మే నెలతో పోల్చితే 17 శాతం పెరిగాయి మరి. మంగళవారం దేశీయ మ్యూచువల్ ఫండ్స్ ఇండస్ట్రీ సంఘం యాంఫీ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ జూన్‌లో రూ.40,608 కోట్ల పెట్టుబడులు ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి రావడం జరిగింది. ఇందులో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్‌లు)లోకి వచ్చినవి రూ.21,262 కోట్లుగా ఉన్నాయి. ఇదీ రికార్డే. మే నెలలో ఇవి రూ.20,904 కోట్లుగా నమోదయ్యాయి. అయితే ఏప్రిల్, మే నెలల్లో పోయిన పెట్టుబడుల కంటే వచ్చిన పెట్టుబడులే ఎక్కువంటున్న ఇండస్ట్రీ వర్గాలు.. జూన్‌లో మాత్రం వచ్చినదానికన్నా పోయినవే అధికమని, రూ.43,637 కోట్ల పెట్టుబడులు తరలిపోయాయని చెప్తున్నాయి. ఈక్విటీ పథకాలపై మొత్తం ఎంఎఫ్ ఇండస్ట్రీ నిర్వహణలో ఉన్న నికర ఆస్తులు రూ.27.67 లక్షల కోట్లు. సిప్‌లకు సంబంధించి రూ.12.43 లక్షల కోట్లుగా ఉన్నాయి. గత నెల కొత్తగా 55 లక్షల సిప్‌లు నమోదయ్యాయి. దీంతో మొత్తం సంఖ్య 8.98 కోట్లకు చేరింది. 32.35 లక్షల సిప్‌లు మెచ్యూర్ లేదా మూతబడ్డాయని యాంఫీ సీఈవో వెంకట్ చలసాని తెలిపారు. ఇక మొత్తం మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ నిర్వహణలోని ఆస్తులు జూన్ నాటికి రూ.61.15 లక్షల కోట్లపైనే. మే నెలాఖరుతో చూస్తే దాదాపు 4 శాతం అధికం. అడ్వాన్స్ ట్యాక్స్ రిడెంప్షన్స్ కారణంగా రుణ పథకాల నుంచి జూన్‌లో రూ.1.07 లక్షల కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ జరిగిందని యాంఫీ సీఈవో వెంకట్ తెలిపారు. దీంతో జూన్ 30 నాటికి డెట్ స్కీముల నిర్వహణలోని ఆస్తులు రూ.14.13 లక్షల కోట్లకు పడిపోయాయని చెప్పారు. ఇక లార్జ్‌క్యాప్ స్కీముల్లో పెట్టుబడుల రాక రూ.970 కోట్లకు చేరింది. అయితే వాల్యుయేషన్స్ గురించి ఆందోళనలున్నా.. స్మాల్‌క్యాప్ స్కీముల్లోకి రూ.2,263 కోట్లు, మిడ్‌క్యాప్ స్కీముల్లోకి రూ.2,527 కోట్లు రావడం గమనార్హం. హైబ్రిడ్ సెగ్మెంట్‌లోకి రూ.8,854 కోట్లు రాగా.. ఓవరాల్‌గా వీటి నిర్వహణలోని ఆస్తులు రూ.8.09 లక్షల కోట్లకు చేరాయి. ప్యాసివ్ స్కీముల నిర్వహణలోని ఆస్తులు రూ.10 లక్షల కోట్ల మార్కును దాటినట్టు వెంకట్ వెల్లడించారు. బంగారం ధరల పెరుగుదల నేపథ్యంలో గోల్డ్ ఎక్సేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్) హెూల్డింగ్స్ కలిసొచ్చాయన్నారు.

# ఉద్యోగులకు కేంద్రం వరాలు.. జీతంలో 50శాతం వరకూ పెన్షన్‌కు అవకాశం!




అనేక మంది ఆర్థికవేత్తలు, మార్కెట్ నిపుణులు తమ అంచనాలను, సూచనలను ప్రభుత్వానికి సూచిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఓ గుడ్ న్యూస్ వచ్చింది. కొన్ని ఆన్ లైన్ నివేదికల్లో దీనికి గురించి వివరించాయి. నేషనల్ పెన్షన్ సిస్టమ్ లో నమోదు చేసుకున్న కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు పెన్షన్ గా తమ జీతంలో రిటైర్ మెంట్ కు ముందు చివరిసారిగా ఎంత తీసుకున్నారో దానిలో 50శాతం పెన్షన్ గా అందించేందుకు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ను ప్రవేశపెట్టేందుకు సర్వం సిద్ధం చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రి తన పద్దు ప్రసంగానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ క్రమంలో అనేక మంది ఆర్థికవేత్తలు, మార్కెట్ నిపుణులు తమ అంచనాలను, సూచనలను ప్రభుత్వానికి సూచిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ ఉ ద్యోగులకు ఓ గుడ్ న్యూస్ వచ్చింది. కొన్ని ఆన్ లైన్ నివేదికల్లో దీనికి గురించి వివరించాయి. నేషనల్ పెన్షన్ సిస్టమ్ లో నమోదు చేసుకున్న కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు పెన్షన్ గా తమ జీతంలో రిటైర్ మెంట్ కు ముందు చివరిసారిగా ఎంత తీసుకున్నారో దానిలో 50శాతం పెన్షన్ గా అందించేందుకు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత ఈ ఎన్పీఎస్ కింద 25–30 సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టే వారికి, ప్రత్యేకించి 2004 తర్వాత రిక్రూట్ అయిన వారికి ఆకర్షణీయమైన రాబడిని అందిస్తున్నప్పటికీ, ఈ కొత్త ప్రయత్నం పెన్షన్ చెల్లింపు గురించి వారి ఆందోళనలను పరిష్కరిస్తుందని అంచనా వేస్తున్నారు. 50శాతం చివరి శాలరీ అనే సరికి అందరికీ ఓపీఎస్ గుర్తుకొచ్చి ఉంటుంది. అయితే ఓపీఎస్ ను ఎట్టి పరిస్థితుల్లో తిరిగి తీసుకొచ్చేది లేదని కేంద్రం స్పష్టం చేసింది. అయితే దీనిపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్థిక కార్యదర్శి టీవీ సోమనాథన్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశారు. పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)కి తిరిగి రాకపోయినప్పటికీ కొంత స్థాయి భరోసాను అందించే అవకాశాన్ని పరిశీలించింది. అలాగే ప్రపంచ పద్ధతులను సమీక్షించింది. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన మార్పుల ఫలితాలను అధ్యయనం చేసింది. హామీ ఇవ్వబడిన రిటర్న్‌ల ప్రభావాన్ని అంచనా వేసిన తర్వాత, 25–30 ఏళ్లలోపు సేవలందించే ఉద్యోగులకు.. వారు డ్రా చేసిన చివరి వేతనంలో 50 శాతానికి ప్రభుత్వం త్వరలో హామీ ఇవ్వగలదని సూచించింది. అదనంగా, ఆర్థిక స్థిరత్వాన్ని నిర్ధారించడానికి కార్పొరేట్ రిటైర్మెంట్ ప్రయోజనాల వంటి ప్రత్యేక నిధిని రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తోందని మరో నివేదిక పేర్కొంది. దీనిపై చర్చలు కొనసాగుతున్నాయని వివరించింది.

ఓపీఎస్‌కి ఎన్పీఎస్‌కి తేడా..

ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు తమ చివరిగా తీసుకున్న జీతంలో సగం జీవితకాల పెన్షన్‌గా పొందవచ్చు. పే కమిషన్ సిఫార్సుల ఆధారంగా ఈ మొత్తం సర్దుబాటులకు లోబడి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులు కనీసం పదేళ్ల సర్వీసును పూర్తి చేసినట్లయితే, పదవీ విరమణ తర్వాత నెలవారీ పెన్షన్‌ను పొందేలా ఓపీఎస్ అవకాశం కల్పిస్తుంది. ఈ పెన్షన్ మొత్తం వారి చివరిగా డ్రా చేసిన ప్రాథమిక జీతం, సర్వీస్‌లో ఉన్న మొత్తం సంవత్సరాల ఆధారంగా లెక్కించబడుతుంది. అలాగే పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు మొత్తం పెన్షన్ మొత్తాన్ని చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. అంటే వారి సర్వీస్ సంవత్సరాలలో, ఉద్యోగుల జీతంలో ఏ భాగాన్ని వారి పెన్షన్ ఫండ్‌కు తీసివేయరు. ఈ పథకం ప్రభుత్వ ఉద్యోగులకు వారి పదవీ విరమణ తర్వాత ఆర్థిక భద్రత, స్థిరత్వాన్ని అందిస్తుంది. అయితే నేషనల్ పెన్షన్ స్కీమ్ ఎన్పీఎస్ ఈ ఓపీఎస్ కు భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే దీనికి ఉద్యోగులు కంట్రిబ్యూట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పథకం కింద, ప్రభుత్వ ఉద్యోగులు వారి ప్రాథమిక వేతనంలో 10%, కేంద్రం 14% కంట్రిబ్యూట్ చేస్తుంది.

# వంటగ్యాస్ కస్టమర్ల ఈ–కేవైసీకి నో డెడ్ లైన్.. తేల్చేసిన కేంద్ర మంత్రి



వంట గ్యాస్ సిలిండర్ల వినియోగదారుల ఈ–కేవైసీ ప్రక్రియకు ఎటువంటి తుది గడువు లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ స్పష్టం చేశారు. 2023లోనే ఎల్పీజీ ఈ–కేవైసీ ప్రక్రియ చేపట్టాలని కేంద్ర చమురు సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. తదనుగుణంగా గ్యాస్ ఏజెన్సీలు తమ కస్టమర్ల ఈ–కేవైసీ ప్రక్రియ మొదలు పెట్టాయి. గ్యాస్ ఏజెన్సీల వద్దే ఈ–కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని కొన్ని సంస్థలు పట్టుబట్టడంతో వంట గ్యాస్ వినియోగదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి కేరళ అసెంబ్లీలో విపక్ష నేత వీడీ సతీశన్ లేఖ రాశారు. సతీశన్ లేఖపై ప్రతి స్పందించిన హర్దీప్ సింగ్ పూరీ.. ఎల్పీజీ ఏజెన్సీ సంస్థల్లోనే తప్పనిసరిగా ఈ–కేవైసీ ప్రక్రియ పూర్తిచేయాలన్న నిబంధన లేదని స్పష్టం చేశారు. కేంద్ర చమురు సంస్థలు తమ వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యాన్ని కలిగించబోవని పేర్కొన్నారు. ‘బోగస్ కస్టమర్ల తొలగింపునకు కేంద్ర ప్రభుత్వ చమురు సంస్థలు గత ఎనిమిది నెలలుగా ఈ–కేవైసీ ఆధార్ అథంటికేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. వంట గ్యాస్ సిలిండర్ల డెలివరీ సమయంలోనే సంబంధిత గ్యాస్ ఏజెన్సీ డెలివరీ సిబ్బంది కస్టమర్ల వివరాలు ధృవీకరిస్తారు. డెలివరీ సిబ్బంది తమ వద్ద ఉన్న మొబైల్ ఫోన్లలోని యాప్ సాయంతో కస్టమర్ల ఆధార్ వివరాలను నమోదు చేసుకుని ఈ ప్రక్రియ పూర్తి చేస్తారు. కస్టమర్లు తమ సౌలభ్యానికి అనుగునంగా సమీపంలోని డిస్ట్రిబ్యూటర్ షోరూమ్ కు వెళ్లి కూడా ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి చేయొచ్చు. అలాగే కేంద్ర చమురు సంస్థల యాప్‌లు ఇన్ స్టాల్ చేసుకుని సొంతంగా ఈ–కేవైసీ అప్ డేట్ చేయొచ్చు’ అని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ తెలిపారు.

# ఇక ఆ మోసాలకు చెక్.. ఖాతాదారుల భద్రతకు ఆ రెండు బ్యాంకుల కీలక చర్యలు




పెద్ద మొత్తంలో సొమ్ము బదిలీ చేయాలంటే కచ్చితంగా నెట్ బ్యాంకింగ్‌ను వాడుతున్నారు. అయితే పెరుగుతున్న సైబర్ మోసాల కారణంగా భారతదేశంలోని బ్యాంకులు ఇంటర్నెట్ బ్యాంకింగ్ కోసం భద్రతా ఫీచర్లను ప్రారంభిస్తున్నాయి. ఈ చర్యలు ఖాతాలకు అనధికారిక యాక్సెస్, డబ్బు దొంగతనం, ఇతర ఆర్థిక నష్టాలను వంటి మోసాల నుంచి రక్షణను అందిస్తాయి. ఈ నేపథ్యంలో రెండు ప్రముఖ బ్యాంకు వినియోగదారుల భద్రతకు కీలక చర్యలు తీసుకున్నాయి. భారతదేశంలో ఇటీవల కాలంలో ఆన్‌లైన్ చెల్లింపులు బాగా పెరిగాయి. ముఖ్యంగా యూపీఐ రాకతో డిజిటల్ చెల్లింపులు పెరిగినా ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా కూడా నగదు బదిలీలు జరుగుతున్నాయి. ముఖ్యంగా పెద్ద మొత్తంలో సొమ్ము బదిలీ చేయాలంటే కచ్చితంగా నెట్ బ్యాంకింగ్‌ను వాడుతున్నారు. అయితే పెరుగుతున్న సైబర్ మోసాల కారణంగా భారతదేశంలోని బ్యాంకులు ఇంటర్నెట్ బ్యాంకింగ్ కోసం భద్రతా ఫీచర్లను ప్రారంభిస్తున్నాయి. ఈ చర్యలు ఖాతాలకు అనధికారిక యాక్సెస్, డబ్బు దొంగతనం, ఇతర ఆర్థిక నష్టాలను వంటి మోసాల నుంచి రక్షణను అందిస్తాయి. ఈ నేపథ్యంలో రెండు ప్రముఖ బ్యాంకు వినియోగదారుల భద్రతకు కీలక చర్యలు తీసుకున్నాయి. అవేంటో ఓ సారి తెలుసుకుందాం. పెరుగుతున్న సైబర్ మోసాలకు నుంచి రక్షణ కోసం ప్రభుత్వ యాజమాన్యంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఇటీవల తన ఇంటర్నెట్ బ్యాంకింగ్ సిస్టమ్, మొబైల్ బ్యాంకింగ్ సిస్టమ్‌లో కొత్త భద్రతా ఫీచర్ ‘సేఫ్టీ రింగ్’ని ప్రవేశపెట్టింది. మోసగాళ్లు అనధికారికంగా యాక్సెస్ చేస్తే సంభావ్య నష్టాలను తగ్గించడానికి ఈ మెకానిజం అదనపు భద్రతను అందిస్తుందని పీఎన్‌బీ ఒక ప్రకటనలో తెలిపింది. సేఫ్టీ రింగ్ అనేది ఐచ్ఛిక ఫీచర్. ఇది ఆన్‌లైన్ మూసివేతపై టర్మ్ డిపాజిట్లకు సంబంధించిన రోజువారీ లావాదేవీల పరిమితిని సెట్ చేయడానికి కస్టమర్‌లను అనుమతిస్తుంది లేదా సెట్ పరిమితి మొత్తం వరకు టీడీలపై ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యాన్ని పొందుతుంది. కస్టమర్ నిర్ణయించిన పరిమితి కన్సాలిడేటెడ్ డిజిటల్ ఛానెల్‌ల పరిమితిగా ఉండాలి. దాని వరకు కస్టమర్ టీడీ ని మూసివేయవచ్చు లేదా టీడీలో ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయాన్ని పొందవచ్చు. సెట్ చేసిన తర్వాత భద్రతా ఫీచర్ ‘సేఫ్టీ రింగ్’ ఏ డిజిటల్ ఛానెల్‌ల ద్వారా కస్టమర్ నిర్వచించిన పరిమితిని మించి టీడీని మూసివేయడం, ఉపసంహరించుకోవడం లేదా రుణాల కోసం (ఓవర్‌డ్రాఫ్ట్) ఉపయోగించడం కుదరదు. ఇటీవల ప్రైవేట్ రుణదాత ఐసీఐసీఐ బ్యాంక్ తన కస్టమర్‌లు ఫోన్ లేదా ఈ–మెయిల్ ద్వారా కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ నుండి సహాయం తీసుకోకుండా తక్షణమే బహుళ బ్యాంకింగ్ సేవలను లాక్/అన్‌లాక్ చేయడానికి వీలుగా ‘స్మార్ట్‌లాక్’ అనే ప్రత్యేకమైన భద్రతా చర్యను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ ఫీచర్ ఐ మొబైల్ పేలో అందుబాటులో ఉంది. ఇది ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ (బ్యాంక్ ఖాతాకు లింక్ చేయబడిన ఇతర యూపీఐ యాప్‌ల నుండి చెల్లింపులతో సహా), క్రెడిట్, డెబిట్ కార్డులకు యాక్సెస్‌ను లాక్/అన్‌లాక్ చేయడానికి వినియోగదారులకు అధికారం ఇస్తుంది. కేవలం ఒక బటన్‌పై క్లిక్ చేయడం ద్వారా వారి భద్రతను నిర్ధారిస్తుంది. స్మార్ట్ లాక్ కస్టమర్‌లు మొత్తం ఐమొబైల్ పేలాక్/అన్‌లాక్ చేయడానికి కూడా అనుమతిస్తుంది.

# మాస్క్‌డ్ ఆధార్‌తో ఆ సమస్యలకు చెక్.. డౌన్‌లోడ్ చేయడం మరింత ఈజీ





ఇటీవల సైబర్ నేరగాళ్లు స్కామ్‌లు, మోసాలకు తరచుగా ఆధార్ కార్డులను ఉపయోగిస్తారు. సైబర్ మోసాల బాధితుల జాబితాలో సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ఉన్నారు. ఇలాంటి స్కామ్‌ల కేసులు పెరిగిన కారణంగా భారత ప్రభుత్వం ప్రకటనలు మరియు సందేశాల ద్వారా పౌరులను హెచ్చరిస్తుంది. అలాగే పౌరులకు భద్రతను కల్పించేందుక భారత ప్రభుత్వం మాస్క్డ ఆధార్ కార్డ్ విధానాన్ని కూడా ప్రవేశపెట్టింది. ఆధార్ కార్డు అనేది భారతదేశంలోని పౌరులకు ముఖ్యమైన పత్రంగా మారింది. ఇది భారతదేశంలో గుర్తింపు రుజువుగా పని చేస్తుంది. అయితే ఇటీవల సైబర్ నేరగాళ్లు స్కామ్‌లు, మోసాలకు తరచుగా ఆధార్ కార్డులను ఉపయోగిస్తారు. సైబర్ మోసాల బాధితుల జాబితాలో సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ఉన్నారు. ఇలాంటి స్కామ్‌ల కేసులు పెరిగిన కారణంగా భారత ప్రభుత్వం ప్రకటనలు, సందేశాల ద్వారా పౌరులను హెచ్చరిస్తుంది. అలాగే పౌరులకు భద్రతను కల్పించేందుక భారత ప్రభుత్వం మాస్క్డ ఆధార్ కార్డ్ విధానాన్ని కూడా ప్రవేశపెట్టింది. మాస్క్‌డ్ ఆధార్ కార్డ్‌ను యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా జారీ చేస్తుంది. ఈ నేపథ్యంలో మాస్క్‌డ్ ఆధార్ గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. మాస్క్‌డ్ ఆధార్ సాధారణ ఆధార్‌కు భిన్నంగా ఉండటమే కాకుండా మన డేటా మరింత సురక్షితంగా ఉంటుంది. సాధారణంగా ఆధార్ కార్డ్‌లో 12 అంకెల సంఖ్యలు ముద్రించి ఉంటాయి. అయితే మాస్క్‌డ్ ఆధార్‌లో చివరి 4 సంఖ్యలు మాత్రమే కనిపిస్తాయి. ఆధార్, మాస్క్‌డ్ ఆధార్ కార్డ్‌ల మధ్య ఉన్న తేడాల్లో ఇది ఒకటి. మాస్క్‌డ్ ఆధార్ కార్డ్ ఐడీలో ఆధార్ కార్డ్‌లోని మొదటి 8 ఆధార్ నంబర్‌లు ‘%శశశశ–శశశశ%’ అని ఉంటాయి. అందువల్ల అపరిచిత వ్యక్తులకు ఆధార్ కార్డ్ నంబర్ తెలియదు. అలాగే ఇది మోసాలు మరియు మోసాల అవకాశాలను నిరోధించడంలో సహాయపడుతుంది. అయితే మాస్క్‌డ్ ఆధార్ కార్డు పూర్తిగా చెల్లుబాటు అవుతుంది. ఈ విషయాన్ని యూఐడీఏఐ స్పష్టం చేసింది. సాధారణ ఆధార్ కార్డ్ స్థానంలో మాస్క్‌డ్ ఆధార్‌ను ఉపయోగించవచ్చు. ముఖ్యంగా ఎక్కడైన అడ్రస్ ప్రూఫ్ లేదా ఇతర అవసరాలకు ఆధార్ జిరాక్స్ ఇచ్చే సమయంలో మాస్క్‌డ్ ఆధార్ ఇవ్వడం వల్ల సైబర్ మోసాల నుంచి రక్షణ పొందవచ్చు.

# మ్యూచువల్ ఫండ్స్‌లో అధిక రాబడి కావాలా? ఈ టిప్స్ మీ కోసమే



అనుభవజ్ఞులైన ఫండ్ మేనేజర్లు వీటిని నిర్వహించినప్పుడు వాటి ప్రయోజనాలు అందుతాయి. ప్రధానంగా డైవర్సిఫికేషన్ వల్ల అధిక మేలు జరుగుతుంది. మ్యూచువల్ ఫండ్స్ లో పెట్టుబడి పెట్టడం వల్ల మీ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. అయితే మీరు సరైన వ్యూహాలను ఉపయోగించాలి. ఈ నేపథ్యంలో మంచి రాబడిని అందించడానికి ఉపయోగపడే చిట్కాలపై నిపుణులు సూచనలు చేస్తున్నారు. అధిక రాబడిని కోరుకునే వారికి బెస్ట్ ఆప్షన్ మ్యూచువల్ ఫండ్స్.. కాస్త రిస్క్ ఉన్నా.. దానిలోని అధిక రాబడి మంత్రం అందులో అందరినీ పెట్టుబడి పెట్టేలా చేస్తోంది. మ్యూచువల్ ఫండ్లు అనేక స్టాక్లు, బాండ్లు, ఇతర సెక్యూరిటీలను కొనుగోలు చేయడానికి అవకాశం కల్పిస్తుంది. అనుభవజ్ఞులైన ఫండ్ మేనేజర్లు వీటిని నిర్వహించినప్పుడు వాటి ప్రయోజనాలు అందుతాయి. ప్రధానంగా డైవర్సిఫికేషన్ వల్ల అధిక మేలు జరుగుతుంది. మ్యూచువల్ ఫండ్స్ లో పెట్టుబడి పెట్టడం వల్ల మీ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. అయితే మీరు సరైన వ్యూహాలను ఉపయోగించాలి. ఈ నేపథ్యంలో మంచి రాబడిని అందించడానికి ఉపయోగపడే చిట్కాలపై నిపుణులు సూచనలు చేస్తున్నారు. ఆ వివరాలను మీకు అందిస్తున్నాం.. మీ ఆర్థిక లక్ష్యాలను తెలుసుకోండి.. మ్యూచువల్ ఫండ్స్ లో పెట్టుబడి పెట్టే ముందు, మీరు మీ ఆర్థిక లక్ష్యాలను నిర్ణయించుకోవాలి. మీరు మీ భవిష్యత్తు కోసం పెట్టుబడి పెడుతున్నారా? ఇంటిపై డౌన్ పేమెంట్ లేదా మీ పిల్లల చదువు కోసం ఆదా చేస్తున్నారా? మీ లక్ష్యాలను తెలుసుకోవడం వల్ల మీ సమయం, రిస్క్ టాలరెన్స్ కోసం తగిన మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోకునేందుకు మీకు అవకాశం ఏర్పడుతుంది. వివిధ రకాల మ్యూచువల్ ఫండ్లను అన్వేషించండి.. మ్యూచువల్ ఫండ్లు వివిధ ఫార్మాట్లలో అందుబాటులో ఉంటాయి, ఒక్కొక్కటి ఒక్కో ప్రత్యేక పెట్టుబడి అవసరాలకు ప్రతిస్పందిస్తాయి. ఈక్విటీ, డెట్, హైబ్రిడ్, ఇండెక్స్ ఫండ్లు కొన్ని ఎంపికలను మాత్రమే సూచిస్తాయి. ప్రతి వర్గానికి సంబంధించిన లక్షణాలు, నష్టాల గురించి తెలుసుకోవడానికి సమయాన్ని వెచ్చించండి. ఇది మీ పోర్ట్ ఫోలియోను విస్తరించడంలో, ప్రమాదాన్ని తగ్గించడంలో మీకు సహాయం చేస్తుంది. ఫండ్ పనితీరును అంచనా వేయండి.. గత పనితీరు మార్కెట్ ఒడిదుడుకులను ఫండ్ ఎలా నిర్వహించిందనే దానిపై అంతర్దృష్టిని అందిస్తుంది. 1–సంవత్సరం, 3–సంవత్సరాలు, 5–సంవత్సరాల రాబడి వంటి ఫండ్ పనితీరును పరిశీలించడం, భవిష్యత్తును అంచనా వేయడంలో మీకు సహాయపడుతుంది. వ్యయ నిష్పత్తిని మూల్యాంకనం చేయండి.. వ్యయ నిష్పత్తి మ్యూచువల్ ఫండ్స్ తమ పెట్టుబడిదారులకు వసూలు చేసే వార్షిక వ్యయాన్ని సూచిస్తుంది. ఇందులో నిర్వహణ రుసుములు, అడ్మినిస్ట్రేటివ్ ఛార్జీలు, ఇతర ఖర్చులు ఉంటాయి. తక్కువ వ్యయ నిష్పత్తులు మొత్తం రాబడిని ముఖ్యంగా దీర్ఘకాలికంగా ప్రభావితం చేయగలవు. సారూప్య ఫండ్ల వ్యయ నిష్పత్తులను ఎల్లప్పుడూ మూల్యాంకనం చేయండి. తక్కువ ఛార్జీలు ఉన్న వాటిని ఎంచుకోండి. ఫండ్ మేనేజర్ యొక్క నైపుణ్యం, అనుభవం ఫండ్ పనితీరును గణనీయంగా ప్రభావితం చేస్తుంది. ఫండ్ మేనేజర్ నేపథ్యం, పెట్టుబడి తత్వశాస్త్రం, ఫండ్ తో ట్రాక్ రికార్డ్ ను పరిగణించండి. మార్కెట్ను అధిగమించే ట్రాక్ రికార్డ్ తో మంచి మేనేజర్ మీ పెట్టుబడి పోర్ట్ ఫోలియోకు గణనీయమైన విలువను జోడించవచ్చు. మీ పోర్ట్ ఫోలియోలో రిస్క్ ని తగ్గించడానికి డైవర్సిఫికేషన్ అవసరం. రంగాలు, ఆస్తి తరగతులు, భౌగోళిక ప్రాంతాలలో మీ పెట్టుబడులను వైవిధ్యపరచడం ద్వారా, మీరు మీ పోర్ట్ ఫోలియోను మార్కెట్ అస్థిరత, ఏదైనా నిర్దిష్ట పెట్టుబడిలో సంభావ్య నష్టాల నుంచి రక్షించుకోవచ్చు.




# ఎఫ్.డి.సి. ఛైర్మన్ పదవికై పావులు కదుపుతున్న కెఎస్ రామారావు



ప్రముఖ నిర్మాత కెఎస్ రామారావు నిన్న ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి, చలన చిత్ర అభివృద్ధికై పలు అంశాలు చర్చినట్టుగా తెలిసింది. అయితే ఈ కలయిక వెనక రామారావు ఎఫ్.డి.సి ఛైర్మన్ పదవిని ఆశిస్తున్నట్టుగా చూచాయగా తెలుస్తోంది. ఈ కీలక పదవికోసం అతను పావులు కదుపుతున్నట్టుగా పరిశ్రమలో చర్చ నడుస్తోంది ఆంధ్ర ప్రదేశ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీ రాజ్, అటవీశాఖతో పాటుగా మరికొన్ని శాఖలకు మంత్రిగా నటుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టారు. కొత్త ప్రభుత్వంతో తెలుగు చలన చిత్ర పరిశ్రమ మంచి సత్సంబంధాలు పెట్టుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే కొంతమంది నిర్మాతలు విజయవాడ వెళ్లి పవన్ కళ్యాణ్ ని కలిసిన వారిలో వున్నారు. అలాగే ఆంధ్ర ప్రదేశ్ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఏపి ఎఫ్.డి.సి) ఛైర్మన్ పదవి కూడా ఇప్పుడు ఎంతో కీలకమని చెప్పాలి. ఇంతకు ముందు ఆ పోస్టులో వున్నవాళ్లు తెలుగు పరిశ్రమకి చేసిందేమీ లేదనే చర్చ ఒకటి నడిచింది. ఇప్పుడు ఈ ఎఫ్.డి.సి ఛైర్మన్ పదవి ఎవరికీ వరిస్తుందో అనే విషయంపై పరిశ్రమలో తాజాగా చర్చ నడుస్తోంది. కొందరేమో ఘట్టమనేని ఆదిశేషగిరి రావు కి ఇవ్వొచ్చు అని అంటున్నారు, అతనైతే పరిశ్రమలో అజాత శత్రువు లాంటి వ్యక్తి, పరిశ్రమ బాగోగులు గురించి బాగా తెలిసిన వ్యక్తి, అందుకని అతనికి ఈ పదవి చంద్రబాబు నాయుడు ఇవ్వొచ్చు అని అంటున్నారు. ఇంకొక పక్క ప్రముఖ నిర్మాత కెఎస్ రామారావు ఈ ఛైర్మన్ పదవికై పావులు కదుపుతున్నట్టుగా తెలుస్తోంది. రామారావు, మెగాస్టార్ చిరంజీవికి అత్యంత సన్నిహితుడు అవటం కూడా ఒక కారణం అని అంటున్నారు. ఈమధ్యనే విజయవాడ వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి సినిమా రంగం గురించి పలు అంశాలు చర్చించారు అని ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది మర్యాదపూర్వకంగా కలిసినట్టు చెపుతున్నా, దీని వెనక వున్న ఉద్దేశ్యం మాత్రం రామారావు ఎఫ్.డి.సి ఛైర్మన్ పదవికోసమే అని తెలుస్తోంది. అలాగే కొన్ని రోజుల క్రితం రామారావు, పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబుని కూడా కలిశారు. ఇది కూడా కేవలం మర్యాదపూర్వకంగా కలిసినట్టు చెపుతున్నా, దీని వెనకాల మాత్రం ఎఫ్.డి.సి ఛైర్మన్ కోసమే అన్నట్టుగా తెలుస్తోంది. రామారావు తనవంతుగా అందరినీ కలుస్తూ, ఛైర్మన్ పదవి కోసమై తన పేరును ప్రతిపాదించేట్టుగా చెయ్యడానికి పావులు కదుపుతున్నట్టుగా పరిశ్రమలో చర్చ నడుస్తోంది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చిత్ర పరిశ్రమని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వున్న ఈ తరుణంలో ఈ ఎఫ్.డి.సి ఛైర్మన్ పదవి ఎంతో కీలకమైనదిగా భావిస్తున్నారు. అటు ప్రభుత్వానికి, ఇటు చిత్ర పరిశ్రమకి మధ్య వారధిలా వుండి సమన్వయంతో వ్యవహరించే వ్యక్తికి ఈ కీలక పదవి ఇవ్వనున్నారు.

# అర్రె.. భారతీయుడు తెలుగు మల్టీస్టారర్.. భలే మిస్సైందే..?



ఎలాంటి సినిమా చేసినా ఎలాంటి పాత్ర పోషించినా ప్రేక్షకుల్లో అలా గుర్తిండిపోయేలా చేయడంలో లోకనాయకుడు కమల్ హాసన్ ఒకరు. ఆయన చేసిన 200 పైగా సినిమాల్లో ఏ పాత్ర మరొక పాత్రకు దగ్గరగా ఉండదు. అంత విలక్షణ చూపిస్తారు కాబట్టే ఆయన్ను వెండితెర ఉలగనాయకన్ అని అంటుంటారు. ఈమధ్యనే కల్కి సినిమాలో సుప్రీం యాస్కిన్ పాత్రలో వర్సటాలిటీ చూపించిన కమల్ రెండు రోజుల్లో ఇండియన్ 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. శంకర్ డైరెక్షన్ లో కమల్ హీరోగా తెరకెక్కిన ఇండియన్ సినిమాకు సీక్వెల్ గా ఇండియన్ 2 వస్తుంది. 1996 మే 9న రిలీజైన ఇండియన్ అదే భారతీయుడు భాషతో సంబంధం లేకుండా సూపర్ హిట్ గా నిలిచింది. అప్పటి సామాజిక అంశాల మీద అవినీతి మీద శంకర్ మార్క్ సినిమాగా వచ్చిన ఇండియన్ సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. అప్పటికే జెంటిల్మన్ తో సూపర్ అనిపించుకున్న ఆయన ఓ పక్క ప్రేమికుడు తీస్తూనే ఇండియన్ కథ రాసుకున్నారు. %కూశ్రీంశీ =ఝఀ% – కల్కి ఆ స్టిల్ వెనక ఉన్నది ఎవరంటే..? ఐతే జెంటిల్మన్ చూశాక రజినికాంత్ శంకర్ డైరెక్షన్ లో సినిమా చేయాలని అనుకున్నారు. ఆ టైం లోనే పరియ మనుషన్ అనే స్క్రిప్ట్ సిద్ధం చేశారు శంకర్. ఆ టైం లో రజిని సినిమా చేయడం కుదరకపోవడంతో ఆ కథనే కాస్త మార్చి కమల్ తో చేశారు. కమల్ హాసన్ తో భారతీయుడు చేయడానికి ముందు తెలుగు హీరోలు రాజశేఖర్, వెంకటేష్ లతో ఈ సినిమా తీయాలనుకున్నారట శంకర్. సేనాపతిగా రాజశేఖర్, ఆయన కుమారుడిగా వెంకటేష్ ని తీసుకోవాలని అనుకున్నారట. ఐతే ఆ ప్రయత్నాలు కూడా ఎందుకో ముందుకు వెళ్లలేదు. ఒతేకాదు కోలీవుడ్ లో కార్తీక్, సత్యరాజ్ లతో కూడా ఇండియన్ సినిమా చేయాలని అనుకున్నారట. కానీ ఏ సినిమా ఎవరికి పడాలని ఆల్రెడీ ముందే రాసి ఉంటుంది. అలానే కమల్ హాసన్ కి కథ చెప్పడం ఆయన ఓకే అనడంతో పాటు రెండు పాత్రలు ఆయనే చేయడం జరిగింది. అప్పటిలోనే సేనాపతి పాత్ర మేకప్ కు గంటల కొద్దీ కమల్ మేకప్ వేసుకునే వారు. కమల్ సేనాపతి మేకప్ వేసింది ఆస్కార్ విన్నర్ హాలీవుడ్ మేకప్ ఆర్టిస్ట్ మైఖెల్ వెస్ట్ మోర్. ఈ సినిమా కోసం శంకర్ చాలా హార్డ్ వర్క్ చేశారు. సుభాష్ చంద్రబోస్ ఒరిజినల్ డాక్యుమెంట్ లోని ఫుటేజ్ ని తీసుకుని వాటిల్లో కమల్ హాసన్ ని చూపించారు. అప్పట్లోనే ఆయన ఈ టెక్నాలజీని ఉపయోగించడం విశేషం. ఇక హీరోయిన్స్ గా ఐశ్వర్య రాజేష్ చేయాల్సి ఉన్నా ఆమె కుదరకపోవడంతో బొంబాయి సినిమా చూసి మనీషా కొయిరాలాకు ఆ ఛాన్స్ ఇచ్చారు శంకర్. ఇండియన్ సినిమా కోలీవుడ్ లో ఎవర్ గ్రీన్ హిట్ సాధించగా బెస్ట్ యాక్టర్, బెస్ట్ స్పెషల్ ఎఫెక్ట్స్, బెస్ట్ ఆర్ట్ డైరెక్షన్ విభాగాల్లో నేషనల్ అవార్డులను కైవసం చేసుకుంది. ఇండియన్ సినిమాకు సీక్వెల్ గా శంకర్ కమల్ మళ్లీ ఇన్నాళ్లకు ఇండియన్ 2 సినిమా తెరకెక్కించారు. శుక్రవారం రిలీజ్ అవ్వబోతున్న ఈ సినిమాపై సూపర్ బజ్ ఏర్పడింది. మరి భారతీయుడు రేంజ్ లో భారతీయుడు 2 ఉంటుందా లేదా అన్నది మరో రెండు రోజుల్లో తెలిసిపోతుంది.

# అబార్షన్ చేయించాడు.. రాజ్‌తరుణ్-లావణ్య కేసులో కొత్త ట్విస్ట్



సినీ నటుడు రాజ్ తరుణ్ తనతో పదేళ్లుగా రిలేషన్‌లో ఉండి మోసం చేశాడంటూ లావణ్య అనే యువతి హైదరాబాద్‌లోని నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తర్వాత లావణ్య, మాల్వీ ఒకరిపై ఒకరు ఫిర్యాదులు కూడా చేసుకుంటుండడంతో ఈ కేసు రోజురోజుకు మలుపులు తిరుగుతూ తాజాగా ఓ కొత్త టర్న్ తీసుకుంది. ఈ రోజు (బుధవారం) పోలీసులు రాజ్ తరుణ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పుడు ఈ ఘటన టాలీవుడ్‌లో సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళితే.. బుధవారం లావణ్య మరోసారి రాజ్ తరుణ్, మాల్వీలపై ఫిర్యాదు చేసింది. అంతే కాకుండా పోలీసులకు కొన్ని ముఖ్య ఆధారాలు ఇచ్చినట్లు సమాచారం. వాటిలో రాజ్ తరుణ్‌తు ఉన్న 170 ఫొటోలు, ఇంకా పలు టెక్నికల్ అండ్ మెడికల్ ఎవిడెన్సులు అందజేసింది. దీంతో నార్సింగ్ పోలీసులు హీరో రాజ్ తరుణ్ పై ఐపీసీ 493 సహా మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయితే.. రాజ్‌తరుణ్‌తో పదేళ్ల క్రితమే పెళ్లి అయ్యిందని, పదేండ్లుగా కాపురం చేశామని.. కొన్నాళ్ల క్రితం ప్రెగ్నెన్సీ వస్తే అబార్షన్ చేయించాడంటూ లావణ్య ఆరోపించింది. అందుకు సంబంధించి మెడికల్ డాక్యుమెంట్స్‌ను పోలీసులకు అందించానని తెలిపింది. అంతేకాకుండా చాలాకాలం అన్విక పేరుతో కలిసి ఉన్నామని.. అదే పేరుతో విదేశాలకు కూడా కలిసి వెళ్లినట్లు లావణ్య పేర్కొంది. కొంతకాలం క్రితం కానీ మాల్వీ మల్హోత్రా వచ్చాక రాజ్‌తరుణ్ తనను దూరం పెట్టాడని.. మాల్వీ కోసం రాజ్‌తరుణ్ ముంబైలో ఎక్కువగా ఉంటున్నాడని, అతను ఎప్పుడెప్పుడు ఉంబయ్‌కి వెళ్లింది, ఎవరింటికి వెళ్లింది, ఎన్ని రోజులు ఉన్నాడు అనే చాలా విషయాలకు సంబంధించి అధారాలు ఉన్నట్లు వివరించింది.

# అయ్యగారు ఏదో గట్టిగానే ప్లాన్ చేస్తున్నట్లున్నారే!



యూత్ కింగ్ అఖిల్ అక్కినేనికి బ్లాక్ బస్టర్ సక్సెస్ అనేది అందని ద్రాక్షలా మారిపోయింది. ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా, సినిమా కోసం ఎంతగా కష్టపడుతున్నా సరైన విజయం మాత్రం దక్కడం లేదు. ఎన్నో హోప్స్ పెట్టుకున్న 'ఏజెంట్' మూవీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా మారింది. అప్పటి నుంచి పూర్తిగా సైలెంట్ మోడ్ లోకి వెళ్ళిపోయినా అఖిల్.. సినిమా వచ్చి ఏడాది దాటినా ఇంతవరకూ తన తదుపరి ప్రాజెక్ట్ ను ప్రకటించలేదు. అయితే ఇప్పుడు బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు అనౌన్స్ చేయడానికి రెడీ అవుతున్నారని తెలుస్తోంది. యూవీ క్రియేషన్స్ బ్యానర్ లో అఖిల్ అక్కినేని ఓ సినిమా చేయబోతున్నట్లుగా చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. అఫీషియల్ గా వెల్లడించలేదు కానీ, ఈ చిత్రంతో అనిల్ కుమార్ అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నట్లు తెలుస్తోంది. ఈ భారీ పీరియాడిక్ మూవీకి 'ధీర' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న 6' సినిమాని అఖిల్ బర్త్ డే స్పెషల్ గా అనౌన్స్ చేస్తారని అందరూ అనుకున్నారు కానీ, అలా జరగలేదు. అయితే దీంతో పాటుగా అక్కినేని వారసుడు మరో ప్రాజెక్ట్ ను లైన్ లో పెట్టినట్లుగా తాజాగా ఓ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అఖిల్ కెరీర్ మీద అక్కినేని నాగార్జున ఫోకస్ పెట్టడం లేదని ఫ్యాన్స్ సైడ్ నుంచి కామెంట్లు వస్తున్న నేపథ్యంలో.. తనయుడు కోసం మంచి స్క్రిప్ట్ సిద్ధం చేయడానికి కింగ్ రంగంలోకి దిగినట్లు టాక్ నడుస్తోంది. ఇప్పటికే మురళీ కిశోర్ అనే దర్శకుడు చెప్పిన కథను పక్కకు తీసిపెట్టినట్లుగా తెలుస్తోంది. ఇంతకముందు గీతా ఆర్ట్స్ బ్యానర్ లో 'వినరో భాగ్యము విష్ణుకథ' సినిమాని తెరకెక్కించిన మురళీ కిశోర్.. ఇప్పుడు అఖిల్ కోసం ఓ అద్భుతమైన స్టోరీని రాసుకున్నాడట. ఇప్పటికే నాగార్జునకు వినిపించగా, ఆయన్నుంచి సానుకూల స్పందన వచ్చిందట. ఇది అఖిల్‌కు సరిగ్గా సరిపోతుందని నాగ్ భావిస్తున్నారట. చిత్తూరు బ్యాక్ డ్రాప్ లో సాగే రూరల్ డ్రామా అని టాక్. దీన్ని తమ సొంత ప్రొడక్షన్ అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ లో నాగార్జున నిర్మిస్తారని ప్రచారం జరుగుతోంది. 6' సెట్స్ మీదకు వెళ్లిన తర్వాత ఈ మూవీపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఇకపోతే డైరెక్టర్ గౌతమ్ వాసుదేవ్ మీనన్ తో అఖిల్ ఓ సినిమా చేస్తారనే మాట కూడా సోషల్ మీడియాలో వినిపిస్తోంది. ఇప్పటికే చర్చలు జరిగాయని, ఆల్మోస్ట్ ఈ ప్రాజెక్ట్ కంఫర్మ్ అయిదని అంటున్నారు.

# బిగ్ బాస్ మోనాల్.. వాట్వే బ్లాస్టింగ్ లుక్!



బిగ్ బాస్ బ్యూటీ మోనాల్ గజ్జర్ కు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. అల్లరి నరేష్ సుడిగాడు మూవీతో టాలీవుడ్ కు పరిచయమైంది ఈ అమ్మడు. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించింది. కానీ సినిమాల కన్నా బిగ్ బాస్ షోతో తెలుగులో మంచి గుర్తింపు సంపాదించుకుంది. బిగ్ బాస్-4 సీజన్ లో తన ఆటతో అందరినీ ఆకట్టుకుంది. గ్లామరస్ గా కనిపిస్తూ కుర్రాళ్ల మనసులు దోచేసింది. యూత్ లో ఫుల్ ఫాలోయింగ్ దక్కించుకుంది ఈ బ్యూటీ. దీంతో ఆమెకు తెలుగు సినిమాల్లో మంచి అవకాశాలు వస్తాయని అంతా అనుకున్నారు కానీ అలా జరగలేదు. ప్రస్తుతం బుల్లితెరపై సందడి చేస్తోంది బ్యూటీ. పలు డ్యాన్స్ షోలకు జడ్జిగా వ్యవహరిస్తోంది. దాంతోపాటు వరుస గుజరాతీ సినిమాల్లో నటిస్తోంది. యాక్ట్రెస్ గా రానిస్తోంది. సోషల్ మీడియాలో కూడా ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది అమ్మడు. హీట్ పుట్టించే పిక్స్ కు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తోంది. గ్లామర్ గేట్లు ఎత్తేసి అందాలు ఆరబోస్తుంటోంది. తాజాగా కొత్త పిక్స్ షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది మోనాల్. పర్పుల్ కలర్ లాంగ్ ఫ్రాక్ లో ఫోటో షూట్ పోస్ట్ చేసింది. అందులో సింపుల్ మేకప్ తో మోనాల్ అదిరిపోయింది. క్రేజీ నెక్ సెట్ ఆమె అందాన్ని మరింత పెంచింది. ముఖ్యంగా ఎద అందాలతో కవ్విస్తోంది. సిడ్నీ ఒపెరా హౌస్ లో ఐదో అంతర్జాతీయ గుజరాతీ ఫిల్మ్ ఫెస్టివల్ జరిగినట్లు తెలిపింది మోనాల్. ప్రస్తుతం ఆమె కొత్త పిక్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అయితే నయా ఫోటోల్లో మోనాల్ గజ్జర్ సూపర్బ్ గా ఉందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అందానికి పర్యాయ పదమని చెబుతున్నారు. బ్లాస్టింగ్ అందాలకు క్లీన్ బౌల్డ్ అయ్యామని అంటున్నారు. లైకులు కొడుతూ నెటిజన్లు.. కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. అయితే అహ్మదాబాద్ కు చెందిన మోనాల్.. స్థానిక వైశ్యా బ్యాంకులో అవుట్ సోర్స్ లో జాబ్ చేసింది. ఆ సమయంలో తీసుకున్న ఒక్క నిర్ణయంతో ఆమె లైఫ్ టర్న్ అయింది. 2011లో రేడియో మిర్చి నిర్వహించిన మిర్చి క్వీన్ బీ అందాల పోటీలో పార్టిసిపేట్ చేసి కిరీటాన్ని దక్కించుకుంది మోనాల్. ఆ తర్వాత మిస్ గుజరాత్ అందాల పోటీలో కూడా పాల్గొంది. తన అందం, టాలెంట్ తో టైటిల్ ను కైవసం చేసుకుంది. అలా ఉద్యోగం మానేసి మోడల్ గా కెరీర్ స్టార్ట్ చేసిన మోనాల్.. 2012లో తెలుగు సినిమాతోనే సినీ ఇండస్ట్రీకి పరిచయం అయింది. మళ్లీ మోనాల్ గజ్జర్.. టాలీవుడ్ లో ఎప్పుడు సందడి చేస్తుందో వేచి చూడాలి.

# కవర్ పేజీపై కవ్వించిన తివారీ బ్యూటీ!



బాలీవుడ్ నటి శ్వేతా తివారీ వారసురాలిగా ఎంట్రీ ఇచ్చిన పాలక్ తివారీ సుపరిచితమే. గతేడాది సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన కిసీకా భాయ్ కిసీకా జాన్ చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించింది. ది సాప్రాన్ చాప్టర్ ది వర్జిన్ ట్రీ లాంటి చిత్రాల్లోనూ భాగమైంది. నాలుగేళ్ల క్రితమే లాంచ్ అయినా అమ్మడి కెరీర్ మాత్రం ఇంకా పుంజుకోలేదు. సక్సెస్ కోసం ఎదురు చూస్తుంది. మరోవైపు అమ్మడు సోషల్ మీడియాలో అంతే యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు హాట్ ఫోటోలతో నెట్టింట రచ్చ చేస్తుంటుంది. యువత మెచ్చే భంగిమలతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. తాజాగా అమ్మడు ఎల్లే ఇండియా కవర్ పేజీ పై చెలరేగిన వైనం మరోసారి కుర్రాళ్లకు నిదు లేకుండా చేస్తోంది. తడిపొడి అందాల్లో పాలక్ వైట్ కలర్ డిజైనర్ షర్ట్ ధరించి ఇచ్చిన భంగిమ అలాంటింది మరి. మత్తెక్కించే కిల్లర్ లుక్ లో ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం ఈ పిక్ నెట్టింట వైరల్ గా మారింది. ఈ ఫోటోని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. కొత్త విషయాలు తెలుసుకోవడానికి ఎంతో ప్రయత్నిస్తాను. ఏదైనా నా దృష్టిని ఆకర్షించినప్పుడు దాన్ని ఎలాగైనా పొందాలనుకుంటున్నాను. అందుకోసం చాలా సీరియస్ గా పనిచేస్తాను. డ్రెస్ ల విషయానికి వస్తే నాకు ఎంత నచ్చినదైనా అందులో కంపర్ట్ చూసుకుంటాను. అన్నింటికంటే ముఖ్యం నేనేంత సౌకర్యంగా ఉన్నాను అన్నది చూస్తాను. అలా ఉన్నప్పుడే ప్రయోగానికి వెనుకాడను. నేను సినిమా ప్రపంచంలో ఎంతగానో నిమగ్నమై ఉన్నాను. విభిన్నమైన పాత్రలు చేయాలనుకుంటున్నాను. వాటిని ఎంతగా ప్రేమిస్తానో నాకే తెలుసు. అని అంది. పాలక్ తివారీ సైఫ్ అలీఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీఖాన్ తో డేటింగ్ లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోన్న సంగతి తెలిసిందే.

# శాండ్‌విచ్‌లో చిక్కుకున్న ప్రభుదేవా..




ప్రభుదేవా నటిస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రానికి 'జాలియో జింఖానా' అనే టైటిల్ ఖరారు చేసి, తాజాగా ఫస్ట్‌లుక్ రిలీజ్ చేశారు. శక్తి చిదంబరం దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాను గత యేడాది సెట్స్‌పైకి తీసుకెళ్ళారు. తాజాగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌లో ప్రభుదేవా శాండ్‌విచ్‌లో చిక్కుకుని ఉండగా, దాన్ని పలువురు నటీమణులు చేతులతో ఎత్తిపట్టుకునివుండేలా డిజైన్ చేశారు. ప్రభుదేవా నటిస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రానికి 'జాలియో జింఖానా' అనే టైటిల్ ఖరారు చేసి, తాజాగా ఫస్ట్‌లుక్ రిలీజ్ చేశారు. శక్తి చిదంబరం దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాను గత యేడాది సెట్స్‌పైకి తీసుకెళ్ళారు. తాజాగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌లో ప్రభుదేవా శాండ్‌విచ్‌లో చిక్కుకుని ఉండగా, దాన్ని పలువురు నటీమణులు చేతులతో ఎత్తిపట్టుకునివుండేలా డిజైన్ చేశారు. ఇందులో హీరోయిన్‌గా మడొన్నా సెబాస్టియన్ నటించగా.. ఇతర పాత్రలలో అభిరామి, యోగిబాబు, రెడిన్ కింగ్‌స్లీ, రోబో శంకర్, సాయి దీనా, యాషికా ఆనంద్, మధుసూదన్ తదితరులు పోషించారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు వెల్లడిస్తూ.. "ప్రభుదేవా నటిస్తున్న పూర్తి హాస్యభరిత చిత్రమిది. సినిమా ఆద్యంతం హీరో శవంలా నటిస్తారు. తెన్‌కాశికి చెందిన ఒక ఫ్యామిలీ ఈ శవాన్ని కొడైక్కెనాల్‌లో చేర్చాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఈ శవాన్ని తెన్‌కాశి నుంచి కొడైక్కెనాల్‌కు ఎలా తరలించారన్నది కడుపుబ్బ నవ్వించేలా హాస్యభరితంగా చిత్రీకరించాం. సినిమా స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు ఎంటర్‌టైన్ చేస్తూనే ఉంటుంది. ప్రతి ఒక్కరూ హాయిగా ఈ చిత్రాన్ని వీక్షించేలా చిత్రీకరించాము. నిర్మాణాంతర పనులన్నీ పూర్తి చేసి త్వరలోనే విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం" అని పేర్కొన్నారు. విలక్షణ నటుడు విజయ్ సేతుపతి ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ని విడుదల చేసి.. యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ట్రాన్స్‌ఇండియా మీడియా అండ్ ఎంటర్‌టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అశ్విన్ వినాయగమూర్తి సంగీతం అందిస్తున్నారు. ప్రభుదేవా విషయానికి వస్తే.. ప్రస్తుతం ఆయన కొరియోగ్రఫీ, దర్శకత్వం కంటే నటనపై ఎక్కువగా దృష్టి పెట్టారు. వరసగా చిత్రాలు చేస్తూ.. నటుడిగా తనేంటో నిరూపించుకుంటున్నారు. మధ్యమధ్యలో తన అవసరం ఉంది అనుకున్న చిత్రాలకు మాత్రమే ఆయన కొరియోగ్రఫీ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

# ప్రజల పక్షాన నిలబడి కొట్లాడుదాం తల్లి లాంటి పార్టీని కాపాడుకుందాం



వేములవాడ జూలై 10 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : ప్రభుత్వం ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ప్రజల పక్షాన నిలబడి కొట్లాడుదామని వేములవాడ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. వేములవాడ నియోజకవర్గంలో పదవీకాలం ముగిసిన ఎంపీపీ, జెడ్ పి టి సి, ఎంపీటీసీలను ఆయన నివాసంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ ప్రజా జీవితంలో నిస్వార్ధంగా పనిచేసే వారికి ఎప్పటికైనా గుర్తింపు ఉంటుందని అన్నారు. తాజా మాజీలుగా ఉన్న మీరు ప్రజా సమస్యల్లో పాలుపంచుకొని వారికి అండగా నిలిచి ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. ప్రతిపక్షంలో ఉన్నందునే ప్రజల పక్షాన గొంతుకై ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు దిశగా ప్రభుత్వ పనితీరును ఎండగట్టాలని వివరించారు. మానసిక వికలాంగత్వాన్ని వీడి పోరాటం చేసే ప్రతిభను అలవాటు చేసుకోవాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రాకపోతే బిజెపితో కుమ్మక్కి అయినట్టేనని చేసిన సవాలు నిజమైందని అన్నారు. ఉత్తర తెలంగాణలోనే వేములవాడ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీకి తక్కువ ఓట్లు రావడమే ఇందుకు నిదర్శనం అన్నారు. ప్రజల్లో పార్టీ బలంగా ఉందని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోను సత్తా చాటుదామని వారికి సూచించారు. గడచిన పార్లమెంట్ ఎన్నికల్లో మనకు అత్యధికంగా ఓట్లు రావడం మీరు చేసిన కృషి వల్లనేనని గుర్తు చేసి కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు రుణమాఫీ ఆగస్టు 15 లోపు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లుగానే మద్యమాన్ని నిర్వాసితులకు కూడా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఐదు లక్షల 40 వేల రూపాయల నగదు అందజేతపై కూడా కటాఫ్ డేట్ చెప్పాలని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు సవాల్ విసిరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పార్టీ అధ్యక్షుడు తోట అగయ్య మాట్లాడుతూ రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదని సందర్భంగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలకు సేవ చేయాలని గుర్తు చేశారు. జిల్లా పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని ఏ సమయంలోనైనా తాను స్పందించి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరం సైనికుల పని చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ మనసుపెట్టి పార్టీ కోసం పనిచేయాలని ఆమె సూచించారు. పనిచేసే వారికి తప్పనిసరిగా పదవులు వస్తాయని 2014లో సర్పంచ్ గా పని చేసిన తనకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటు తర్వాత మొదటి జిల్లా పరిషత్ చైర్మన్ గా అవకాశం రావడమే ఇందుకు నిదర్శనం అని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడ్డగోలుగా హామీలు ఇచ్చి ప్రభుత్వంలోకి వచ్చిందని కళ్యాణ లక్ష్మితో తులం బంగారం, 2500 రూపాయల భృతి లాంటివి కూడా అందించడంలో విఫలమై ప్రభుత్వం మీద వ్యతిరేకత మొదలైందని చెప్పారు. అనంతరం మాజీ ఎంపీపీలు, జెడ్పిటిసిలు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులను పార్టీ ఇంచార్జ్ చెల్మెడ లక్ష్మీనరసింహారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు తోట ఆగయ్య లతో కలిసి ఘనంగా సన్మానించి మెమొంట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా పార్టీ అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, రాఘవరెడ్డి, రవికుమార్, మాజీ ఎంపీపీలు ఉమా రత్నాకర్ రావు, స్వరూప మహేశ్, చంద్రయ్య గౌడ్, బైరగోని లావణ్య, మాజీ జెడ్పిటిసిలు మ్యాకల రవి, ఏశ వాణి, నాగం భూమయ్య, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరి చరణ్ రావు, మాజీ వైస్ ఎంపీపీ ఆర్ సి రావు, కిరణ్ రావు, మందాల అబ్రహం, మండల పార్టీ అధ్యక్షులు గోస్కుల రవి, సత్తి రెడ్డి, మల్యాల దేవయ్య, సింగిల్ విండో చైర్మన్ బండ నరసయ్య యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు ప్రభాకర్ రావు, ఏనుగుల శ్రీనివాస్, మాజీ ఎంపిటిసిలు, నాయకులు చిలుక పెంటయ్య తదితరులు ఉన్నారు.

# మహిళ ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బులు ఇవ్వకుండా రిజిస్ట్రేషన్ చేయకుండా కులం పేరుతో దూషిస్తూ బెదరింపులకు పాల్పడిన ఒడ్యాల వేణు అరెస్ట్ రిమాండ్ తరలింపు



వేములవాడ జూలై 10 తెలంగాణ నుండి ఫోకస్ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...వేములవాడ పట్టణం అనుపురం(ఆర్ ఆర్ కాలనీ)కి చెందిన బొమ్మేళ లక్ష్మి బస్వలింగం అనే మహిళకు తిప్పాపూర్ శివారులో ఉన్న ఫ్లాట్ అమ్మి తన కూతురి పెళ్లి చేయలనుకోగా వేములవాడ పట్టణానికి చెందిన వేణు %ం/శీ% ప్రసాద్ అనే వ్యక్తి బొమ్మేళ లక్ష్మితో ఫ్లాట్ తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తే ని కూతురి పెళ్లి కోసం ఆరు లక్షలు ఈస్త అని మరల ఆరు లక్షల నాకు ఇస్తే ని ఫ్లాట్ నీకు రిజిస్ట్రేషన్ చేస్తా అని నమ్మించి రిజిస్ట్రేషన్ చేసుకొని ఎలాంటి డబ్బులు ఇవ్వకుండా ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేయకుండా ఎల్లారెడ్డిపేట కి చెందిన వ్యక్తికి అమ్మడిని తెలుసుకొని లక్ష్మి వేణును అడుగగా లక్ష్మిని కులం పేరుతో తిడుతూ చంపుతానని బేధరించిగా 2022 సంవత్సరం లో వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించడం జరిగింది. మరల ఒడ్యాల వేణు పెద్దమనిషుల సమక్షంలో అట్టి ఫ్లాట్ లక్ష్మి కి రిజిస్ట్రేషన్ చేయడానికి 8,50,000/- రూపాయలతో ఒప్పందం చేసుకొని ఒక లక్ష రూపాయలు తీసుకొని ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేయకుండా కులం పేరుతో దూషిస్తూ చంపుతానని బెదిరించగా లక్ష్మీ పిర్యాదు మేరకు వేములవాడ పట్టణంలో కేసు నమోదు చేయగా వేములవాడ ఏఎస్పీ గారు విచారణ చేపట్టి నేరం రుజువు కావడంతో వేణు ని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించడం జరిగింది. అంతే కాక గతంలో వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో మరియు కరీంనగర్ వన్ టౌన్, కరీంనగర్ టూ టౌన్ లో పలు చీటింగ్ కేసులు, బెదిరింపు కేసులు ,భూ సమస్యల్లో తలదూర్చి సెటిల్ మెంట్ చేయడం వట్టి కేసులు నమోదు అవ్వగా ఒడ్యాల వేణు పై రౌడి షీట్ ఓపెన్ చేయడం జరిగిదని, గతంలో వేణు పై అటెంప్ట్ మర్డర్ కేసు కూడా ఉన్నదని మరల ఇలాంటి నేరాలకు పాల్పడితే పిడి యాక్ట్ పెట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వేములవాడ పట్టణానికి చెందిన ఒడ్యాల వేణు కరీంనగర్ , వేములవాడ పరిసర ప్రాంతాల్లో భూ తగధల్లో తలదూర్చి ఇబ్బందులకు గురి చేస్తున్న ఆరోపణలున్న నేపథ్యంలో వేణు కిసంబంధించిన బాధితులు సంబంధిత పోలీస్ స్టేషన్ లలో పిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ గారు తెలిపారు.

# బోనాల మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్



వేములవాడ జులై 10 తెలంగాణ నుండి ఫోకస్ వేములవాడ పట్టణంలో తూర్పువాడ మున్నూరు కాపు సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మత్తడి పోచమ్మ,అరేకటిక సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బద్దీ పోచమ్మ, లాడ్జి అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కట్ట మైసమ్మ బోనాల మహోత్సవంలో ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు..ప్రభుత్వ విప్ ను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అమ్మవారి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు ప్రజలు పాడిపంటలతో ఆనందంగా ఉండాలని వేడుకొన్నారు..ములవాడ పట్టణంలో తూర్పువాడ మున్నూరు కాపు సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మత్తడి పోచమ్మ,అరేకటిక సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బద్దీ పోచమ్మ, లాడ్జి అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కట్ట మైసమ్మ బోనాల మహోత్సవంలో ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు..ప్రభుత్వ విప్ ను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు.. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అమ్మవారి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు ప్రజలు పాడిపంటలతో ఆనందంగా ఉండాలని వేడుకొన్నారు.

# జాతీయ రహదారుల నిర్మాణానికి గడువులోగా భూ సేకరణ పూర్తి చేయాలి - రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



పెద్దపల్లి, జూలై -10, తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : జాతీయ రహదారుల నిర్మాణానికి గడువు లోగా భూ సేకరణ పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి జాతీయ రహదారుల భూ సేకరణ పురోగతి పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ లతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. రిజనల్ రింగ్ రోడ్డు ఎక్స్ ప్రెస్ వే ఉత్తర భాగం, మంచిర్యాల-వరంగల్- ఖమ్మం-విజయవాడ ఎన్.హెచ్ 163జి, ఆర్మూర్ -జగిత్యాల-మంచిర్యాల ఎన్.హెచ్ 63 నిర్మాణాలకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియ పురోగతిపై సంబంధిత జిల్లా కలెక్టర్ లు, ఇతర ఉన్నతాధికారులతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించి పలు సూచనలు చేశారు. మంచిర్యాల-వరంగల్- ఖమ్మం- విజయవాడ ఎన్.హెచ్ 163జి జాతీయ రహదారి మన రాష్ట్రంలో దాదాపు 334 కిలోమీటర్ల మేర ఉంటుందని, దీనికి సంబంధించి 1383 హెక్టార్ల భూ సేకరణ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 1284 హెక్టార్ల భూమికి అవార్డు పాస్ చేశామని, 415 హెక్టార్ల భూమి జాతీయ రహదారుల అథారిటీకి అప్పగించడం జరిగిందని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్.హెచ్ 163జి పరిధిలో పెండింగ్ లో ఉన్న 99 హెక్టార్ల భూ సేకరణ ప్రక్రియ నెల రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని అన్నారు. భూ సేకరణ అవార్డు పాస్ చేసి భూ బదలాయింపు జరగని సంబంధిత రైతులు, భూ యాజమాన్యంతో చర్చించి ఆర్బిట్రేషన్ కు వచ్చేలా చూడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి అన్నారు. ఆర్బిట్రేషన్ ప్రక్రియలో జాతీయ రహదారుల అధికారులను భాగస్వామ్యం చేయాలని, గత 6 నెలల కాలంలో సంబంధిత భూ సేకరణ ప్రాంతాల్లో జరిగిన అత్యధిక విలువ లావాదేవీల డాక్యుమెంట్ లు ఆర్బిట్రేషన్ ద్వారా జారీ చేసే అవార్డులతో జత చేయాలని, జూలై నెలాఖరు నాటికి ఆర్బిట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. భూ సేకరణ ప్రక్రియలో కలెక్టర్ లు నేరుగా రైతులతో చర్చించాలని, వారికి జాతీయ రహదారుల అథారిటీ ద్వారా మెరుగైన పరిహారం అందించేందుకు కృషి చేస్తున్నామని భరోసా కల్పించాలని అన్నారు. జాతీయ రహదారులనిర్మాణంలో కోల్పోతున్న అటవీ శాఖ భూములకు ప్రత్యామ్నాయ భూములు గుర్తించి అఫారెస్టేషన్ ప్రారంభించాలని, అటవీ శాఖ ద్వారా అవసరమైన అనుమతులు త్వరగా సాధించేందుకు అధికారులుసమన్వయంతో పని చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మంచిర్యాల - వరంగల్ గ్రీన్ ఫీల్డ్ 4 లైన్ల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పెద్దపల్లి జిల్లాలో 37 కిమి మేర రోడ్డు నిర్మాణం జరుగనుందని, దీనికి సంబంధించి 204.4 హెక్టార్ల భూ సేకరణ చేయాల్సి ఉండగా 196.3 హెక్టార్ల భూ సేకరణ అవార్డు పాస్ చేశామని, పరిహారంతో రైతులు సంతృప్తి చెందక భూములు అప్పగించడం లేదని, రైతులతో పలు మార్లు చర్చలు జరిపి ఆర్బిట్రేషన్ కు వచ్చేందుకు ఒప్పించామని అన్నారు. జాతీయ రహదారుల అధికారులను భాగస్వామ్యం చేస్తూ, సరైన ఆధారాలతో ఆర్బిట్రేషన్ అవార్డు పాస్ చేస్తామని, జూలై నెలాఖరు నాటికి ఆర్బిట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి సవరించిన అవార్డులు జారీ చేస్తామని, ఆర్బిట్రేషన్ ప్రకారం పరిహారం విడుదల చేసిన 10 రోజులలో భూమి జాతీయ రహదారుల ఆథారిటి అప్పగిస్తామని కలెక్టర్ తెలిపారు. పెండింగ్ ఉన్న 8.1 హెక్టార్ల భూ సేకరణ నెల రోజుల వ్యవధిలో పూర్తి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి వి.హనుమా నాయక్, జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిది : వన మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్



వేములవాడ జూలై 10 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలో బాలానగర్ లో వేములవాడ మున్సిపల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు... మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి,వైస్ చైర్మన్ బింగి మహేష్,కౌన్సిలర్లతో, ప్రజాప్రతినిధులతో కలసి మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ మనం చెట్ల యొక్క ప్రాముఖ్యతను పాఠ్యపుస్తకాల్లో చదువుకున్నాం. ఇప్పుడు ఉన్నా పరిస్థితుల్లో అంతరించిపోతున్న అడవులను కాపాడే బాధ్యత ప్రతీ ఒక్కరి పై ఉంది. చెట్లను పెంచడం వలన స్వచ్ఛమైన గాలి లభిస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వనమహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగ్యస్వామ్యం కావాలి. రాష్ట్ర ప్రభుత్వం అటవీ సంపదను కాపాడుకోవడానికి చర్యలు తీసుకుంటుంది. రానున్న రోజుల్లో నీడను ఇచ్చే చెట్లతో పాటు,వన్యప్రాణులకు పండ్లు ఫలాలు ఇచ్చే చెట్లను పెంచుతాం. స్వచ్ఛమైన గాలిని పీల్చడం వలన అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారు. వన మహోత్సవంలో నాటిన మొక్కలను కాపాడే బాధ్యత మన అందరిదీ. వేములవాడ పట్టణంలో ప్రతి కాలనిలో పచ్చదనంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేల మొక్కలు,పులా చెట్లను నాటాలి. ప్రతి ఒక్క పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటి వాటి సంరక్షణ చేపట్టాలి.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు:: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



రాజన్న సిరిసిల్ల , జూలై10 : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని బుధవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆర్ అండ్ బీ రోడ్లు, పంచాయతీ రోడ్ల వద్ద ఉన్న , మున్సిపాలిటీ పరిధిలో గల ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించాలని, రోడ్లమీద వాహనాలు పార్కింగ్ చేయకుండా తగు చర్యలు చేపట్టాలని చూడు అధికారులను ఆదేశించారు. ప్రధాన కూడళ్లలో, అప్రోచ్ రోడ్డు ల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేనందున అధిక సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాంటి ప్రదేశాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయుటకు పార్కింగ్ స్థలాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసి సంబధిత అధికారులకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదాల నివారణకు ప్రస్తుతం రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రోడ్లపై వ్యూ అంతరాయం కలగకుండా పిచ్చి మొక్కలు పూర్తిస్థాయిలో తొలగించాలని, పెద్దగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలని, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో రేడియం సైన్ బోర్డు ఏర్పాటు చేయాలని, వ్యవసాయదారులు కేజ్ వీల్స్ తో ట్రాక్టర్లు రోడ్ల మీద నడుపరాదనీ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుతూ రావాలని, దాని కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అంతర్గత ప్రాంతాల్లో జరిగే ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని రోడ్డు మరమ్మత్తు ప్రాంతాల్లో శ్రద్ధ వహించాలని, అవసరమైన చోట డివైడర్లు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రోడ్డు భద్రతా ప్రమాణాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో జంక్షన్ రోడ్ల వద్ద అవసరమైన స్పీడ్ బ్రేకర్, రంబల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని, సరుకు రవాణా వాహనాలు ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, జిల్లాలోని ప్రతి విద్యాసంస్థలో రోడ్డు భద్రత ప్రమాణాల పై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. హెల్మెట్ ధరించకపోవడం, త్రిబుల్ రైడింగ్, మద్యం తాగి వాహనం నడపడం, సీట్ బెల్ట్ ధరించడం మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, అతివేగం వంటివి ప్రమాదకరమని, చట్ట ప్రకారం నేరమని ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ప్రతి వారం ఒకరు చనిపోతున్నారని, 2021 లో 304 , 2022 లో 324, 2023 లో 338 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, దిని నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సూచిస్తూ జిల్లాలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే తంగళ్ళపల్లి, తిప్పాపూర్ %శ% రోడ్, గంభీరావుపేట, కోనరావుపేట ముస్తాబాద్, చందుర్తి,బోయినపల్లి, కోదురుపాక జంక్షన్ వంటి పలు ప్రదేశాల్లో బ్లాక్ స్పాట్ లకు గుర్తించి అక్కడ రోడ్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా రవాణా అధికారి లక్షన్ , మున్సిపల్ కమిషనర్లు, లావణ్య, అన్వేష్, పి.అర్.ఈఈ సూర్య ప్రకాష్ , ఆర్ అండ్ బీ డి. ఈ , ఆర్.టి.సి. డి.ఎం. సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గోన్నారు.

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.